57346

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 14, 2008

చానళ్ళ పరవళ్లు

హ్యాపీ బర్త్‌డే

(2008 డిసెంబర్-14 నుంచి
2008 డిసెంబర్-20 వరకు)



జి. ఆజాద్
1సం॥, డిసెంబర్-19
నాగమణి-కాంతారావు
విశాఖపట్నం

ఎం. నివాస్
7సం॥, డిసెంబర్-14
సాయిలత-యుగంధర్‌రెడ్డి
చౌటుప్పల్-నల్లగొండ

రోహిత్
2సం॥, డిసెంబర్-16
రామలక్ష్మి-గిరి
విశాఖపట్నం

ఎం.నిఖిత
7సం॥, డిసెంబర్-14
సాయిలత-యుగంధర్‌రెడ్డి
చౌటుప్పల్-నల్లగొండ

విరిష(మిని)
3సం॥, డిసెంబర్-14
మౌనిక-శివప్రసాద్
సింగరాయకొండ-ప్రకాశం

ఆర్.టి.హర్షవర్ధన్(పండు)
4సం॥, డిసెంబర్-17
లక్ష్మి-శ్రీనివాసరావు
చందర్లపాడు-కృష్ణా

ఎం. నమ్రత
1సం॥,డిసెంబర్
మమత-రమేష్
రొంపేడు-ఖమ్మం

జి.విద్యాగౌతమ్
1సం॥, డిసెంబర్-18
ఇందిర-కృష్ణ
అచ్చంపేట-మ॥నగర్

జి. నీరజ్‌కుమార్
డిసెంబర్-18
రత్నమ్మ-సుబ్బన్న
కర్నూలు

జి.సోని
డిసెంబర్-18
రత్నమ్మ-సుబ్బన్న
కర్నూలు

జి. ప్రవల్లిక
డిసెంబర్-18
రత్నమ్మ-సుబ్బన్న
కర్నూలు

ఎస్. సునియా
డిసెంబర్-16
జతీనాబేగం-సింపిలా
ముదిగుబ్బ-అనంతపురం

వై. ప్రియాంక-శిరీష
డిసెంబర్
యాదమ్మ-ముత్యాలు
ఆమనగల్-మ॥నగర్

బి. అర్చన
2సం॥, డిసెంబర్-2006
అలివేలు-సత్యనారాయణ
గిరికొత్తపల్లి-మ॥నగర్

ఎ.పూజ
2సం॥, డిసెంబర్-14
శేషమ్మ-చెన్నకేశవులు
మద్రాసు

కె. వేణుతేజ
2సం॥, డిసెంబర్
లక్ష్మి-సతీష్
నల్లగొండ

ఎస్. వర్ష
2సం॥, డిసెంబర్
సౌజన్య-బద్రినాధ్
కొల్లమాసినపల్లి-చిత్తూరు

కె. సౌమ్య
డిసెంబర్
కల్యాణి-రమేష్
కర్నూలు

ఎ. సాయిరాజ్
1సం॥, డిసెంబర్-2007
అర్చన-బస్వరాజ్
జుక్కల్-నిజామాబాద్

ఎ. సుమనస్వి
2సం॥, డిసెంబర్-15
జయలక్ష్మి-శ్యాంసుందర్
జగ్గయ్యపేట-కృష్ణా

మనలో మాట

తాడు తెగుతుంది... జాగ్రత్త

కనబడుటలేదు.... మా నాన్నగారు ఫలానా పొడుగు... ఫలానా ఛాయ... ఇంట్లోంచి వెళ్లినప్పుడు ఫలానా దుస్తుల్లో ఉన్నారు. మతిస్థిమితం లేదు.. ఎవరికైనా ఎక్కడైనా కనబడితే ఈ కింది నెంబర్‌కు ఫోన్ చేయగలరు. ఆచూకీ చెప్పిన వారికి బహుమతి కూడా ఉంటుంది. ఇలాంటి ప్రకటనలు పత్రికల్లో మామూలే. తండ్రులు కనబడటం లేదనో తనయులు తప్పిపోయారనో పౌరులు చెప్పకోవడం, ఏ రాష్ట్రంలోనయినా సాధారణమే. కాని హర్యానా రాష్ట్రానికి విచిత్రమైన సమస్య వచ్చిపడింది. అక్కడ ఏకంగా ఉపముఖ్యమంత్రి చందర్ మోహన్ కనబడకుండాపోయారు. నెలల తరబడి ఆయన కార్యాలయం మూతబడి ఉంది. అతాపతా లేదు. అనుమతించని గైర్హాజరీ కింద కుర్చీనుండి లాగేద్దామంటే కుదరదు. మాజీ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌కు ఆయన స్వయానా కొడుకాయె. పదవి ఆయనకు వారసత్వహక్కుగా లభించిందాయె. మనదేశంలో ఏ హక్కుకయినా ప్రమాదం ముంచుకు రావచ్చుగానీ వారసత్వ హక్కుకు మాత్రం హండ్రెడ్ పర్సెంట్ గ్యారెంటీ. సిఎం కొడుకు ఏనాటికైనా సిఎం అవుతాడు. ఎంపీ కొడుకు ఎంపీ అవుతాడు. ఎమ్మెల్యే కొడుకు ఎమ్మెల్యే అవుతాడు. హీరో కొడుకు హీరో అవుతాడు. వారసత్వ హక్కుకు ఇంతలా గ్యారెంటీ ఉన్న దేశంలో ఆ హక్కును నిరాకరించాలంటే మాటలా. ఎంతో కసరత్తు తర్వాతగానీ డిప్యూటీ సిఎం పోస్టు నుండి ఆయనకు పూస్టింగ్ జరగలేదు.

స్పష్టత కోసం ఇక్కడో విషయం మనవి చేయాలి. ఆయన గత కొన్ని నెలలుగా పనిలో లేకుండా పోయారని భర్తరఫ్ చేయలేదు సుమా. గైర్హాజరీ... పని చేయకుండా కాలక్షేపం చేయడం వంటివి సామాన్య ఉద్యోగులకే గానీ, మంత్రులకు గట్రా అస్సలు వర్తించవు. అలాంటి బాపతు మన రాష్ట్రంలో కూడా అప్పుడప్పుడూ ఉంటూ వచ్చారు. చెన్నారెడ్డి మొదటిసారి ముఖ్యమంత్రి అయిన సమయంలో ఓ మంత్రిగారుండే వారు. సచివాలయంలో ఆయన గది తలుపులు, మూడ్నెల్లకో ఆర్నెల్లకో తెరుచుకొనేవి. అయినా ఆయన పదవి పదిలంగానే ఉండింది. ఎన్డీఏ జమానాలో మన రాష్ట్రం నుండి కూడా కొందరు మంత్రులుండేవారు. సర్వకాల సర్వావస్థలందు వారు మన రాష్ట్రంలోనే తచ్చాడుతుండేవారు. చుట్టపుచూపుగా అప్పుడప్పుడు ఢిల్లీ వెళ్లి వస్తుండేవారు. వాళ్లకీ ఢిల్లీ నుండి పదవీగండం రాలేదు. ఎన్నికల గండం నుండి మాత్రం పాపం బయటపడలేకపోయారు. ఎర్రలైటేసుకొని సైరన్ కొట్టుకొంటూ పొద్దుగూకులు మా గల్లీల్లో తిరిగే వాడివి నిన్నెందుకు స్వామీ ఢిల్లీ పంపడం అనుకొన్నారు జనం. కాని మన చందర్‌మోహన్ కథవేరు. ఆయన రెండో పెళ్లి చేసుకొన్నాడు. చట్టం తన దగ్గరికి రాకుండా మతం మార్చుకొన్నాడు. చట్టం ఏమి చెప్పినా జనం సహించరు కదా హర్యానా ముఖ్యమంత్రి ఎట్టకేలకు కదిలారు. ఉపముఖ్యమంత్రిని ఇంటికి సాగనంపారు. తండ్రి ఇంట్లో నుండి బైటికి సాగనంపారు. రాజకీయ తండ్రికీ ఇదే బాధ. ఏమైనా ఈ రెండో వ్యవహారం మంత్రులకు అంతగా అచ్చిరాదులా ఉంది. చందర్ మోహన్ ఉరఫ్ చాంద్ మహ్మద్ పరిస్థితి ఇలా ఉంటే, ఒరిస్సాలో మరో మంత్రి పుంగవుడు సైడ్ కర్టెన్‌లో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. పట్నాయక్‌కు పట్టరాని కోపమొచ్చింది. కాదు కూడదంటూ కాళ్లావేళ్లా పడినా పదవి పీకేశారు. అందుకని మంత్రులూ... బహుపరాక్... తమరు జనాన్ని పట్టించుకొంటారా ఖజానాని పట్టించుకొంటారా... ఎన్నికల సమయంలో ఓటర్లు తీర్పు చెప్తారు. ఈ లోగా తిక్క వేషాలేస్తే మాత్రం వెంటనే తాడు తెగుతుంది... జాగ్రత్త.

✠

ఈ సంచికలో....

టపా	...	2
క్రైమ్ కథ	...	3
కవిత్వమ్	...	7
బాలనేస్తాలు	...	12
రుచి	...	16
ఆరోగ్యం	...	17
అట్టమీది కథ	...	18
సలహాలు	...	21
మనసా	...	24
సినిమా	...	25
కథ	...	26
కొత్త పుస్తకాలు	...	28

ఇంకా...

లాహిరిలో ... 4

ఎవర్‌గ్రీన్ కథానాయకుడు

విజ్ఞాన వీచిక ... 8

కాలుష్యంతో కాసులు



మంచి పుస్తకం ... 10

దేశ విభజన రాజకీయ విశ్లేషణ

చూద్దామా ... 22

మాక్‌నాక్ ద్వీపం





డయాలసిస్ గురించి చక్కగా వివరించారు

30-11-08 స్నేహలో మీసానికున్న ప్రాముఖ్యతను వివరిస్తూ, మెగాస్టార్ చిరంజీవి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి గారి చిన్న గొడవలను వివరిస్తూ, చేతిపై సర్వ హక్కులున్న వారికే మీసం తిప్పే అవకాశముంటుందని ఆ ధర్మ సూక్ష్మాన్ని గ్రహించలేకపోవడం వల్లే ఈ చిక్కంతా వచ్చిందని చక్కగా వివరించారు. కిడ్నీలు దెబ్బతింటే డయాలసిస్ అవసరమా చదివాం. ఆరోగ్య సమస్యల గురించి ఈ పేజీలో వివరిస్తున్న తీరు బాగుంది. విజ్ఞాన వీచికలో 'అంతుబట్టని అణుధార్మిక ప్రభావం' లో మంచి విషయాలను తెలియజేశారు. భారతరత్న పండిట్ భీమ్‌సేన్ జోషిగారికి సంగీతం పట్ల ఉన్నఆసక్తిని, ఆయన జీవన విధానాన్ని తెలియజేశారు. ఆ ఆసక్తితోనే ప్రపంచంలో గానగంధర్వుడిగా గుర్తింపు పొంది మంచి ఆదరణ పొందిన సంగీత ప్రియుడు జోషిని మనస్ఫూర్తిగా అభినందిద్దాం.

కర్రా వరప్రసాద్, యలమర్రు.

పలు విషయాలు తెలిపిన 'బ్యాంకులో డబ్బు...'

బ్యాంకుల్లో డబ్బు ఎక్కడికి వెళ్లింది? అనే వ్యాసం చాలా విషయాలను తెలియజేసింది. వ్యాసకర్త కళ్లకు కట్టినట్లు చాలా విషయాలు పొందుపరిచారు. కార్పొరేట్ కంపెనీల మోసాలు, పన్నులు ఎగవేయడాలు, కంపెనీలకు లాభాలు తెచ్చి పెట్టే శ్రమ జీవుల సంక్షోభాలు మొదలగు అనేక అంశాలు తెలుసుకున్నాం. కవర్ స్టోరీ కదలి చోరుల కల్లోలం విజ్ఞానదాయకంగా ఉంది. అనుమానాస్పద మృతి అనే క్రైం కథ సంచలనాత్మకంగా ఉంది. భార్యాభర్తలు బంగారు గాజులు వెతికి తెలుసుకుంటే ఇబ్బందులు పడేవారు కాదు. 'మర్రి మిత్రులు' కథ బాలలకు మహదానందకరంగా ఉంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

అట్టమీది కథ అదిరింది

నవంబర్ 30 స్నేహలో ముందుగా ఆకట్టుకున్నది కదలిచోరుల కల్లోలం. అందులోనూ అట్టమీది కథ. కవర్ చూసి స్నేహను గబగబా తిరగేశాను. సముద్ర దోపిడీలు ఏస్థాయిలో జరుగుతున్నాయో, ప్రపంచంలో ఏ ఏ పట్టణాల్లో ఈ పైరసీ ఎలా ఉగ్ర రూపం దాల్చిందో పర్యవసానంగా ఎదురయిన ఫలితాలు సవివరంగా వివరించిన తీరు మళ్లీ మళ్లీ చదివించింది. అయితే పద్దెనిమిది మంది భారతీయులున్న కెమికల్ టాంకర్ పైరసీకారులకు చిక్కడం జపాన్ యాజమాన్యం చొరవతో గత సెప్టెంబర్‌లో విడుదలైన సంఘటన కనీసం అప్పట్లో వెలుగు చూసిన జాడ లేదు. భూమి, వాయు రవాణానే కాక జల రవాణాకు కూడా పగడ్బందీగా గస్తీని ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను తెలిపింది.

యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం, తూ.గో.



గడ్డి మొక్కలు బాగున్నాయి

గాన గంధర్వుడు భీమ్ సేన్ జోషి కథ బాగుంది. కదలి చోరుల కల్లోలం పెట్టుబడిలేని వ్యాపారం లాభదాయకం. కొద్దిగా శ్రమ పడితే చాలు లక్షలు, కోట్లు సంపాదించవచ్చు. ఈ అక్రమ చోరులను అరికట్టకపోతే సముద్ర దొంగలు భూలోక దొంగలు కూడ అవుతారు. బాలనేస్తాలులో గుడ్డులో గడ్డి మొక్కలు బాగుంది. చిత్రరంగానికి చెందిన ప్రముఖులు ఆడిన అందమైన అబద్ధాలు చదివాం. బాగున్నాయి.

వాస్తు రామచంద్ర, రాంజీ నగర్, నెల్లూరు.

★★★









క్రైమ్ కథ

> సరిగ్గా అప్పుడే పై ఆఫీసర్ ఫోన్ చేశాడు. "సెక్యూరిటి విక్రమ్‌ను నాలుగు తగిలిస్తే వాడే చెబుతాడు. వాడికి తెలియకుండా ఆఇంటిలోకి ఇద్దరో ముగ్గురో వెళ్లి పదహారు లక్షలు విలువచేసే ఆభరణాలు, డబ్బు దోచుకుని వాటాలు తేలక ఒకడిని చంపి పారిపోయారు. ఇదంతా ఎలా జరుగుతుంది? ముందు చావచితక్కొడితే విక్రమ్‌గాడే చెబుతాడు. నేను రాత్రికి ఠాణాకు వస్తాను. ఈలోగా హంతకుల పేర్లును వాడితో చెప్పించు. వీలుంటే హంతకుల్ని అరెస్టు చేసేయ్" ఆదేశించి ఫోన్‌పెట్టేశాడు.



చాకులాంటి రక్షకుడు

- యర్నాగుల సుధాకరరావు

"కుర్రాడు చాకులా ఉన్నాడు. ఏమైనా చదువుకున్నాడా?" అడిగాడు మిలట్రీ రాయుడు. ఆమాటలకు గుడిసెలోనివారు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. కొద్దిగా సిగ్గుపడ్డాడు చాకులాంటి విక్రమ్. తండ్రి ఏం చెప్పకపోయేసరికి విక్రమే చెప్పాడు. "పది ఫెయిల్ అయ్యాను. ఇప్పుడు పెద్దకాపు పొలం కాపలా కాస్తున్నాను. పంటలో కొంత ఇస్తుంటాడు. అది తిండిగింజలకే సరిపోతుంది."

"ఇంకా గ్రామాలు పట్టుకుని ఉంటే నీకండలు ఇక్కడే కరిగిపోయి తిండికి వాచిపోతావు. రేపు నాతో వచ్చేయ్. నిన్ను పట్టణంలో సెక్యూరిటీ గార్డును చేస్తాను. వేలకువేలు వస్తాయి. ఇక్కడెందుకు గుద్దెద్దు చేలో పడ్డట్టుగానే నీబ్రతుకు ఉంటుంది". చెప్పి వెళ్లిపోయాడు.

ఆకుటుంబం కళ్లలో వెలుగులు విరజిమ్మాయి. విక్రమ్‌కు కూడా గ్రామంలో ఉండడం ఇబ్బందిగానే ఉంది. ఇలానే కుర్రాడు చాకులా ఉన్నాడు ఏంచేస్తున్నాడంటే పొలం కాపుకున్నాడంటే పెదాలు విరుస్తుంటే తట్టుకోలేకపోతున్నాడు. ఇప్పుడు ఒకదారి దొరికిందని మిలట్రీరాయుడు వెంటపడి పట్టణంలో ఒకపారిశ్రామికవేత్త ఇంటి కాపలాకు కుదిరాడు. పనిలో చేరిన వారంలోనే ఆ లంకంతకొంపలో ఒక ఖూనీ, పెద్ద దోపిడి చడీచప్పుడు కాకుండా ఒకఅర్ధరాత్రి జరిగిపోయింది. పోలీసులు వచ్చి దర్యాప్తుచేశారు. సెక్యూరిటీలో ఉన్న విక్రమ్‌ను నిలదీశారు. యక్షప్రశ్నలు వేసి ఒకరకంగా నీకు తెలిసే జరిగింది. లోపల హత్య జరుగుతున్నప్పుడు హతుడు పెనుగులాడుతున్నప్పుడు కేకలు పెడితే నీకు వినపడకపోవడమేమిటి?" అంటూ విక్రమ్‌ను పోలీసులు వ్యాన్ ఎక్కించుకుని తీసుకునిపోయారు.

ఇంటరాగేషన్‌లో విక్రమ్ చాకులానే వ్యవహరించాడు. "సార్ నేను పట్టణానికి కొత్త అయినా వృత్తిధర్మం పాటించడంలో ఏమాత్రం విఫలం కాలేదు. అంతెందుకు లోపల జాతికుక్క రాత్రివేళల్లో గస్తీ తిరిగినట్టు కాంపౌండు అంతా తిరుగుతుంది. కనీసం అది కూడా అరవలేదు. అంటే హంతకుడు హత్యను ఆఇంటిలో చేసిఉండడు సార్"

ఇన్‌స్పెక్టర్ అదోలా గుర్రుగా చూశాడు. "నువ్వు మాకు దర్యాప్తు ఎలా చేయాలో ఏకోణంలో మొదలుపెట్టాలో చెబుతున్నావా? లేక పీకల్లోతు అందులో ఉండి మమ్మల్ని తప్పుతోవ పట్టిస్తున్నావా?"

"సార్ నాకు క్రయిమ్‌స్టోరీలు చదివే అలవాటు చాలా ఎక్కువ. అందుకే నేను టెన్తుఫెయిల్ అయ్యాను. ఆ పరిశోధనలు భలేగా ఉంటాయి. ఇప్పుడు జరిగినదానిలో ఏమైనా పనికి వస్తుందని నేను మీతో అన్నాను అంతే మీకు చెప్పేవాడిని కాను."

"సరే, రాత్రి ఇంట్లో ఎవరెవరున్నారు?"

"లోపల ఎవరుంది నాకు తెలియదు. ఇంతవరకు నేను లోపలికి పోలేదు. నేను గేటు ఆవరణ వరకే పరిమితం. నేను చేరి వారమే అయ్యింది. కానీ, ఫారిన్ జాతి కుక్క మాత్రం రాత్రి మొత్తం నిద్రపోకుండా తిరుగుతుంది. నేను దాని నోటికి అందకుండా గేటు ఇవతల ఉంటాను. దానికి దొరికితే అది చీల్చిచెండాడుతుంది."

"హత్య ఇంట్లో మెట్లకింద జరిగింది. హతుడు చాలాకాలంగా ఆకుటుంబానికి తెలిసినవాడే. రాసన్ అనే తమిళడు. అంతరాత్రిమీద ఇంటికి ఎందుకు వచ్చాడు? ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఉదయాన్నే నిద్రలేచాక అతడు శవం కన్పించిందని చెబుతున్నారు. నీవన్నట్లయితే కుక్క హతుడుని చూసి అరవాలి. కానీ అది జరగలేదు. అంటే హంతకుడు ఆఇంటిలో ఉన్నాడు. అదే ఎవరు?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నలు తనకు తానే వేసుకుని విక్రమ్ వైపు చూశాడు.

విక్రమ్ కూడా ఆలోచనలో పడ్డాడు. సరిగ్గా అప్పుడే పై ఆఫీసర్ ఫోన్ చేశాడు. "సెక్యూరిటి విక్రమ్‌ను నాలుగు తగిలిస్తే వాడే చెబుతాడు. వాడికి తెలియకుండా ఆఇంటిలోకి ఇద్దరో ముగ్గురో వెళ్లి పదహారు లక్షల రూపాయల విలువచేసే ఆభరణాలు, డబ్బు దోచుకుని వాటాలు తేలక ఒకడిని చంపి పారిపోయారు. ఇదంతా ఎలా జరుగుతుంది? ముందు చావచితక్కొడితే విక్రమ్‌గాడే చెబుతాడు. నేను రాత్రికి ఠాణాకు వస్తాను. ఈలోగా హంతకుల పేర్లును వాడితో చెప్పించు. వీలుంటే హంతకుల్ని అరెస్టు చేసేయ్" ఆదేశించి ఫోన్‌పెట్టేశాడు.

ఇన్‌స్పెక్టర్ మరోసారి విక్రమ్‌ను చూశాడు. అతడిలో ఏది దాగిఉన్నట్టు లేదు.

"ఏమయ్యా మాపోలీసులు నిన్నే అనుమానిస్తున్నారు. కానీ, నీలో నాకు అలాంటిది కన్పించడంలేదు. నీ క్రయిమ్ కథల బుర్రతో ఆలోచించవయ్యా! కేసు పరిష్కారం కావాలి."

"సార్ ఒక ఐడియా, ఆహత్య కూడా ఆఇంట్లో జరిగి ఉండదు సార్. ఆరాత్రి రెండుసార్లు ఒకే కారు వచ్చింది వెళ్లింది. అదీ స్వంత కారే. డిక్కీలోగాని, బ్యాక్‌సీటులోగాని రక్తపుమరకలు ఉండి ఉండవచ్చు. ఆకారు నడిపింది డ్రయివర్ బబ్లూ."

ఆవెంటనే ఇన్‌స్పెక్టర్, విక్రమ్‌ను వెంటేసుకుని హత్యాస్థలానికి వెళ్లాడు. అక్కడ పోర్టికోలో కారుంది. డిక్కీ తెరిచి చూశాడు. రక్తపుమరక లున్నాయి. బ్యాక్‌సీటులో కూడా రక్తపుమరకలున్నాయి. అక్కడే ఉన్న డ్రయివర్‌ను పట్టుకుని ప్రశ్నించాడు. అతనికి చెమటలు పోశాయి.

అసలు కథ చెప్పాడు. "సార్ ఈహత్యకు నాకు సంబంధం లేదు. అయ్యగారి తమ్ముడు అనిల్ విపరీతంగా పేకాటాడుతుంటాడు. చనిపోయిన రాసన్‌కు పదిలక్షలు బాకీ పడ్డాడు. అతడికి డబ్బు ఇస్తానని చెప్పి నిర్జన ప్రదేశానికి తీసుకునిపోయి కత్తితో హతమార్చాడు. శవాన్ని బాక్ సీటులో పడేసి తిన్నగా ఈ ఇంటికి వచ్చాడు. అయ్యగారి క్యాష్‌బాక్సు తాళాలు డూప్లికేటులతో ఓపెన్‌చేశాడు. తన బ్యాగ్‌లో పట్టినంత వరకు నింపుకుని శవాన్ని మెట్లకింద పడేశాడు. ఇందులో నేను నిరపరాధిని. నాకు ఇవన్నీ చూశాక జ్వరమొచ్చేసింది."

"అనిల్ ఎక్కడున్నాడు?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు. ఆపక్కనే నిలబడి వింటున్న పారిశ్రామికవేత్త తమ్ముడు చేసిన నిర్వాకానికి మానసికంగా నొచ్చుకున్నాడు.

"అనిల్ సాబ్ ఆసుపత్రిలో ఉన్నాడు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ ఇదంతా పథకం ప్రకారం చేశాడు. అన్నట్టు నాకు కారును ఈఉదయమే కడిగించమని చెప్పాడు. కారు తీసుకువెళ్లడానికే నేను వచ్చాను. అయ్యగారు వేరేపని చెప్పడంతో ఇక్కడే ఉండిపోయాను. కొత్తగా చేరిన సెక్యూరిటీగార్డు విక్రమ్‌ను పోలీసులు అనుమానించి వాడిచే కక్కించే ప్రయత్నంలో ఉంటారు. ఈలోపు మనం అన్నీ చక్కబెట్టేయొచ్చు అని చెప్పాడు సార్" డ్రయివర్ ఏదీ దాచకుండా చెప్పాడు. ఆసుపత్రిలో అనిల్‌ను అరెస్టుచేసి మరిన్ని హత్యా వివరాలు రాబట్టి కేసు ముగించారు పోలీసులు.

లాహిరి లాహిరిలో...

ఎవర్‌గ్రీన్ కథానాయకుడు

నర్గీస్ తొలిసారి రాజ్‌కపూర్‌ను రాయల్ ఆపేరా హౌస్ థియేటర్ ఎదుట బట్టల దుకాణంలో చూసింది. కేవలం చూసి ఊరుకోలేదు. తల్లితో అంది - 'అమ్మా! ఆ లావాటి నీలికళ్ల ముద్దబ్బాయి చూడు... మనవైపు తినేసేలా చూస్తున్నాడు' అని తల్లి జద్దన్ బాయి కళ్లతోనే వారించింది.

-"పూరికే వాగకు! అతనెవరనుకున్నావూ? ది గ్రేట్ పృథ్వీరాజ్ కపూర్ అబ్బాయి..."

కానీ, తీరా ఆ అబ్బాయే కొన్నాళ్లకు 'నర్గీస్'తో చెట్టాపట్టాలేయటం జద్దన్ బాయికి నచ్చలేదు. బర్సాత్ చిత్రీకరణ కోసం నర్గీస్‌ను రాజ్‌తో కాశ్మీర్‌కు పంపడం జద్దన్‌బాయికి అస్సలు ఇష్టంలేదు.

డా॥ జె.పి. వైద్య

"కాలే సమయాసి వినా విలంబమ్
శ్రమస్య మూల్యం నహి యాచసేవా"

అని పూర్వం ఎప్పుడో పెద్దవారు రాశారు. వెళ్లిపోయారు. మనం యథాలాపంగా చదివీ చదవనట్టు, చూసీ చూడనట్టు చేసి, హాయిగా మర్చిపోతాము.

"-సమయం ఆసన్నం అయినట్టు వెళ్లిపోతారు కొందరు. వారి జ్ఞాపకాలు సంవత్సరాలు, దశాబ్దాలు దాటినా 'తాజా'గా ఉంటాయి. వేటాడతాయి. వెన్నంటి తరుముతూ వస్తాయి. మనస్సుతో దోబూచులాడుకుంటాయి. గమ్మత్తేమిటంటే ఆ జ్ఞాపకాలు అంతే ఆత్మీయంగా, సజీవంగా పెనవేసుకుని ఉంటాయి. మరిచిపోవటం దాదాపు అసాధ్యం. వారు నిజంగా చరిత్ర రాసినవాళ్లే... చరిత్రను సృష్టించిన వాళ్లే... చరిత్ర పుటల్లో బంగారు అక్షరాలతో చిరకాలం కళకళలాడిపోయేవాళ్లే!"

హిందీ చలన చిత్ర చరిత్రలో తనదంటూ ప్రత్యేకమైన 'సంపుటి' నిర్మించుకున్న 'గ్రేటెస్ట్ షోమాన్ ఆఫ్ ఇండియన్ సినిమా' నీలికళ్ల అందగాడు రాజ్ కపూర్. అలాంటి అద్వితీయమైన కళా తపస్వి ఎంతో ప్రతిష్ఠాకరమైన 'దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం' స్వీకరించే సమయంలో ఎవ్వరూ ఊహించలేదు. అది ఆయన పొందే ఆఖరు పురస్కారం అని. దాదాపు నెల రోజులు అపస్మారక దశలో, కృత్రిమ శ్వాస మీద జీవితానికి మరో మలుపు ఇచ్చే ప్రయత్నంలో ఓడిపోయాడు రాజ్ కపూర్.

అది మననే కాదు... యావత్ ప్రపంచంలోని సినీ అభిమానులను తీవ్రంగా కలత పెట్టిన విషయం.

రాజ్ కపూర్ గురించి ప్రపంచం మొత్తం మీద ఎన్నో వేల పేజీల సమాచారం ఉంది. పొగిడిన వాళ్లున్నారు. విశ్లేషించిన వారున్నారు. విమర్శించిన వారున్నారు. కసితీరా దూషించిన వారూ లేకపోలేదు.

రాజ్ కపూర్ ఒక చోట చెప్పుకున్నాడు - "ఆల్ మై హీరోయిన్స్ ఆర్ నాట్ మై వైఫ్జ్, అండ్ మై వైఫ్ ఈజ్ నాట్ మై హీరోయిన్". ఆ ముక్క ఆ రోజుల్లో పెద్ద దుమారం లేపింది.

ఆ పంక్తులను 'భూతద్దం'లోంచి చూసి విశ్లేషించిన వారిలో చాలా మంది ఇప్పుడు మన మధ్య లేరు. అందువల్ల ఆ పంక్తులను తిరిగి 'భూతద్దం' లోంచి చూస్తూ మరో వాడి, వేడి చర్చాపత్రం తయారు చేయాలన్నది కాదు రచయిత ఆశయం.

మనం మామూలు మనుషులం. సగటు మనిషిలా జేబు వేడిగా ఉంటే వెళ్లి సినిమా చూసి ఆనందించడం. 'అఁ! ఏదో చూశాం! ఇప్పుడు అసలు కథ ఏమిటో కూడా జ్ఞాపకం లేదు నాయనా! పోనిద్దూ! ఇప్పుడెందుకు లేనిపోని గొడవ...!' కన్న కొంచెం సుమారుగా ఆలోచించేవారి కోసం ప్రశ్న.

'వజ్ రాజ్ కపూర్ రియల్లీ ఎ ఫైన్ జంటిల్ మ్యాన్'?

నాకు రాజ్‌కపూర్‌తో ఉన్న పరిచయం చాలా సూక్ష్మం. ఉస్మానియా మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న రోజుల్లో ఒక సంగీత విభావరి కార్యక్రమంలో నాకు ప్రథమ బహుమతిగా 'టెలివిజన్ సెట్' అందించి ఆత్మీయంగా 'షేక్ హ్యాండ్' ఇచ్చాడాయన.

మెత్తటి స్పాంజ్ ముద్దతో చేయి కలిపిన ఫీలింగ్!

అప్పటికే 'కపూర్ ఖాందాన్' ప్రత్యేకతననుసరించి బాగా వ్యాకోచం చెందిపోయి ఉన్నాడాయన. లేత గోధుమరంగు సూట్, ఎర్రటి చారల టై, మొహం నిండా గులాబి కాంతి, నీలికళ్లల్లో ఆత్మీయత ఉట్టిపడే పలకరింపు, కాస్తంత కొంటెతనం మేళవింపు....

స్టేజిమీది 'హై-ఫై' జానా బెత్తెడు గుడ్డల, లిప్‌స్టిక్‌ల, తళుకు బెళుకుల అందాల మధ్య 'రాజ్' తన ప్రత్యేకతను చాటుకున్నాడు.సమయోచితంగా శ్రీ 420 ఫిల్మ్ డైలాగ్స్ వాడి వేల కొద్ది రసికులకు హాయిగా నవ్వించాడు.

నా చూపులన్నీ ఆయన కుడి కంటి రెప్ప మీది పులిపిరి మీదే! 'సిన్మాలో

ఎక్కడా కన్పించలేదేం చెప్మా...!' అనే నా చిరుఅనుమానం ఆయన డైలాగ్స్ పంచ్‌లో మటుమాయమైపోయింది.

'తబస్సుమ్' దగ్గర్నుంచి బాల్‌పెన్ తీసుకుని, సంతకం తీసుకుని మరీ వచ్చాను.

నీలికళ్ల అందాలతో పాటు, రెప్పలమీది 'పులిపిరి' నేటికీ 'హాంటింగ్'!

ఆ తర్వాత ముంబాయిలోని 'చెంబూర్'లో కలిశాను. కానీ, పులిపిరి కన్నా సంభాషణ రసవత్తరంగా సాగింది. 'గ్రేటెస్ట్ షో మ్యాన్' ను ఊరికే అందరూ ప్రేమించలేదు.

ఆయన సగర్వంగా చెప్పుకున్నాడు " నా సినీ జీవితం స్ఫూర్తి ప్రదాత బేబి...(నర్గీస్ ముద్దుపేరు). నా నాలుగు స్థంబాలు శంకర్, జై కిషన్, శైలేంద్ర, హస్రత్ జైపురి. నాగొంతు ముఖేష్..."

నేడు రాజ్ కపూర్‌తో పాటు వారెవరూ మన మధ్యలేరు.

'ది చార్మింగ్, డిగ్నిఫైడ్ లేడీ ఇన్ వైట్ - నర్గీస్' కాలేయం కాన్సర్‌తో 1981లో తనువు చాలించింది.

'బర్సాత్' నుండి సంగీతం జడివాన కురిపించి. వందల కొద్ది రసరమ్య గీతాలతో చిత్తుగా తడిపేసిన శంకర్ జైకిషన్‌లలో ముందు వెళ్లి పోయినవాడు జైకిషన్-(12 సెప్టెంబర్1971).

సగటు సినీ మనిషికున్న 'మందు అలవాటు' జైకిషన్‌ను అర్థాంతరంగా మనలోంచి తీసుకెళ్లింది. జైకిషన్ మరిణించడం శంకర్‌ను బాగా కృంగదీసింది. సంగీత పరంగానూ, ఆర్థిక పరంగానూ, వ్యవసాయ రూపంగానూ శంకర్ ఏకాకి అయ్యాడు. అయితే, మహా మొండితనం, అత్యద్భుతమైన సంగీత పరిజ్ఞానం అతడిని తట్టుకునేలా చేసింది. 'జోకర్' తర్వాత - జోకర్ 'ఫ్లాప్' కావడం రాజ్ కపూర్‌ను కృంగదీసింది.

సినీ విశ్లేషకులు 'ఆర్కే ఫినిష్డ్' అని జ్యోతిష్యం చెప్పారు. ఆంతరంగిక మిత్రులు కలవర పడ్డారు. కలత చెందారు. 'గ్రేటెస్ట్ షో మ్యాన్'కు చెప్పే దమ్ములెవరికి? పైగా ఆయన గారు 'శుద్ధి'లో ఉండొద్దూ?

'బన్నీ రూబెన్' రాజ్ కపూర్‌కు 'బహిరంగ లేఖ' రాశాడు.

- "నీ అంతటి వారు మత్తుకు దాసోహం కాకూడదు.

నీలో కళాకారుడిని తట్టిలేపు...లే! లేచి నిలబడు!

సినీ వెండితెర నీ కోసం నీ క్రియాశీలత కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నది..."

'జోకర్' ఫ్లాప్ అయ్యాక 'ఆర్.కే. ఫినిష్డ్' అన్నారు కొందరు మరీ లౌడ్ స్పీకర్లో, పని కట్టుకొని. రాజ్ కపూర్ లాంటి కళాకారులు మడి కట్టుకుని కూర్చుంటారా ఏమిటీ? డింపుల్, రిషితో 'బాబీ' వచ్చింది. చరిత్ర సృష్టించింది. 'చాబీ ఖో జాయే' ట్రేడ్ సీక్రెట్ అయిపోయింది. యూత్, లవ్, క్రేజీ నెస్ యువతీ యువకుల ఊత పదాలైపోయాయి. చాలా మంది 'ఝూట్ బోలే' అంటూ 'కవ్వాకాటే' అని వాపోయారు. ఆఖరి విన్నింగ్ స్టైల్ మటుకు రాజ్ కపూర్‌దే!

అలా పేజీన్నర ఉత్తరం సాగింది ఆంగ్ల సినీ పత్రికలో!

నర్గీస్ ఆర్కేనూ, ఆర్కే స్టూడియోనూ కట్టుబట్టలతో వదిలేసినప్పుడే అసలు రాజ్‌లోని కళాకారుడు కలత చెంది ఉసూరుమన్నాడు.

భారతీయ సినీ చరిత్రలో 'ప్రేమ' అనేమాటకు సజీవత, ప్రాసంగికత, కొత్త మలుపు, సరికొత్త అందాలు, దిశా నిర్దేశం చేసింది 'రాజ్ - నర్గీస్' జంట.

తొలిసారి 'నర్గీస్'ను తన చిత్రంలో నటించమని కోరడానికి 'మెరీన్‌డ్రైవ్'లోని ఆమె ఫ్లాట్‌కు వెళ్లినప్పటి క్షణాలు 'రాజ్'కు ఎంతో అపురూపమనిపించాయి.

-'ఎవరు? ఏం కావాలి?' అంటూ తలుపు తెరిచిన నర్గీస్ రాజ్‌కు ఒక అప్సరసలా కన్పించింది. కుడికంటినీ, చెంపనూ కప్పుతూ వెంట్రుకల పాయల్లో రాజ్‌ను ఒకే కంట చూసిందని మురిసిపోయాడు. కేశాలను సవరించ బోతే చేతికున్న తడిపిండి కాస్తా అందంగా అంటుకుంది.

'ఆగ్' కన్నా ముందే మంట అంటుకున్నది. నర్గీస్ తల్లి జద్దన్‌బాయి ఢక్కాముక్కీలు తిన్న వనిత. ఒక పట్టాన వాళ్లను నమ్మలేదు. వీళ్లు పట్టించుకోలేదు.

గమ్మత్తేమిటంటే నర్గీస్ తొలిసారి రాజ్‌కపూర్‌ను రాయల్ ఆపేరా హౌస్ థియేటర్ ఎదుట బట్టల దుకాణంలో చూసింది. కేవలం చూసి ఊరుకోలేదు. తల్లితో అంది - 'అమ్మా! ఆ లావాటి నీలికళ్ల మొద్దబ్బాయి చూడు... మనవైపు తినేసేలా చూస్తున్నాడు' అని తల్లి జద్దన్ బాయి కళ్లతోనే వారించింది.

-"వూరికే వాగకు! అతనెవరనుకున్నావూ? ది గ్రేట్ పృథ్వీరాజ్ కపూర్ అబ్బాయి..."

కానీ, తీరా ఆ అబ్బాయే కొన్నాళ్లకు 'నర్గీస్'తో చెట్టాపట్టాలేయటం జద్దన్ బాయికి నచ్చలేదు.

'రాజ్' మటుకు నర్గీస్‌తో తన తొలి పరిచయాన్ని 'బాబీ'లో డింపుల్ కపాడియా, రిషికపూర్ మీద చిత్రీకరించి చరిత్రను సృష్టించాడు. బర్సాత్ చిత్రీకరణ కోసం నర్గీస్‌ను రాజ్‌తో కాశ్మీర్‌కు పంపడం జద్దన్‌బాయికి అస్సలు ఇష్టంలేదు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఆ సన్నివేశాలను మహాబలేశ్వర్ లో చిత్రీకరించాల్సి వచ్చింది. తొలి రోజుల్లో 'రాజ్-నర్గీస్'ల చిత్రీకరణ సమయంలో ఆవిడ సోదరుడు అన్వర్ హుస్సేన్, జద్దన్ బాయి

నర్గీస్‌తో ఆర్.కె

ఒక్కక్షణం కళ్లు మూసుకోకుండా నీడలా వెంట ఉండేవారు.

బర్సాత్ రోజుల్లో నర్గీస్ తండ్రి గతించాడు. 'ఆవారా' రోజుల్లో జద్దన్ బాయి తనువు చాలించింది. ఇంకేముంది? సోవియట్ రష్యాలో 'ఆవారా' విజయఢంకా మోగించింది. నర్గీస్- రాజ్‌కపూర్ నిజ జీవితంలో అసలు సిసలైన భార్యా భర్తలు కారు అన్నది రష్యన్లు నమ్మలేదు.

మొరార్జీ దేశాయ్ మహారాష్ట్ర ప్రభుత్వంలో హోమ్ మినిస్టర్‌గా ఉన్న రోజుల్లో హిందూ వివాహ చట్టంలో కొన్ని మార్పులూ చేర్పులూ చేశారు. నర్గీస్‌కు నీలమ్ అనే అనుంగు స్నేహితురాలుండేది. వారిద్దరు మొరార్జీ గారిని కలిసి 'నర్గీస్- రాజ్'ల పెళ్లి - చట్టంలో మార్పుల గురించి అడిగారు.మొరార్జీ మహామొండి మనిషి... 'రూల్స్ అంటే అర్థం కాదా? ఛలో...! వెళ్లండి' అని తరిమేశాడు.



ఆర్.కె కుటుంబం

ఈ రోజుల్లో సరికొత్త ఫ్యాషన్‌లా నవ్య నాగరికత విశృంఖలతలకు ఆనవాలుగా 'లివ్ ఇన్- రిలేషన్ షిప్' ముమ్ముందు ఎన్ని అరిష్టాలకు నాంది అవుతుందో తెలియదు కానీ, నర్గీస్ - రాజ్ భార్యాభర్తలు మటుకు కాలేకపోయారు.

'ఆగ్' నుండి 'జాగతే రహో' వరకు 16 అపురూపమైన 'సెల్యులాయిడ్ కావ్యాల్లా సాగాయి వారిరువురి చిత్రాలు.

“దేగయీ ధోఖా హమే నీలీ నీలీ ఆంఖే...” అని ఉగ్గుత్తికతో నర్గీస్ తలచుకునేది (నీలికళ్లు మోసం చేస్తాయేమోలే...)

“యూఁ హస్ హస్‌కే దేఖాకరో తుమ్ సబ్‌కి తరఫ్, లోగ్ ఇసీహీ అదాలోఁపై ఫిదా హోతే హై” అని రాజ్ కపూర్ తన 'ఖాస్ అందాజ్'లో చెప్పేవాడు (ఇలా మాటిమాటికి నవ్వుతూ చూడబోకుబమా...! జనం ఇలాంటి భంగిమలు చూసే మతి పోగొట్టుకుంటారు తెలుసా?).

వారిలో వారేమనుకున్నా మనం బర్సాత్ బేహోష్ అయిపోయి చిత్తుగా తడిసిపోయాం. శ్రీ 420, ఆవారా తో నిష్కల్మషమైన దోస్తీ చేశాం. ఎంత ఆనాడి గాళ్లమైనా జీవితాన్ని అందంగా మలచుకునే ప్రయత్నం చేశాం. జేబులు ఖాళీగా ఉన్నా సినిమా కోసం కిటికీల దగ్గరే మకాం పెట్టాం.

నర్గీస్, రాజ్ విడిపోవడం మరో చరిత్ర. నర్గీస్ ఉన్నంత వరకు రాజ్ కపూర్ చిత్రంలో సున్నితమైన, అందమైన, ఉల్లాసమైన పరిణతి చెందిన ప్రేమ, త్యాగం కనిపించేవి. నర్గీస్ నిష్క్రమణతో రాజ్ జీవితంలో, సినిమాల్లో వెలితి కొట్టొచ్చినట్టు కన్పించింది. హుందాతనం మెల్లమెల్లగా లోపించి, బజారుతనం, వెకిలితనం అంచులదాకా విశృంఖల శృంగారం పొంగి పొర్లసాగింది. 'జిస్ దేశ్‌మే గంగా బహతీ హై'లో అస్సలు సంగీతానికీ, పాటలకు ఏ మాత్రం స్కోప్ లేదన్నారు శంకర్ జై కిషన్ అంతటి వారు. అదే సినిమాల్లో డజనుకు పైగా అపురూపమైన ఆణిముత్యాల్లాంటి 'సదాబహార్' గీతాలు చోటు చేసుకున్నాయి.

దట్ వజ్ ది మిడాస్ టచ్ ఆఫ్ రాజ్ కపూర్...

కానీ, 'ఓ మైనే ప్యార్ కియా' పాట చిత్రీకరణలో వద్దన్న చోట పద్మినీ ఒంటిమీద జలపాతం ధారలు వర్షించటం ఆ రోజుల్లో పెద్ద హల్‌చల్!

వైజయంతి మాల అంతటి అందగత్తెను కూడా రాజ్ తడితడిగా ఈత కొట్టించాడు.

'జోకర్'లో 'సిమి గ్రేవాల్' - 'సత్యం శివం సుందరం'లో జీనత్ అమన్, రామ్ తేరీ గంగా మైలీ లో మందాకినీ పబ్లిక్ బాత్ ఈ తరం వారందరూ లొట్టలేస్తూ మరీ చూశారు. చాలా మంది కను రెప్పలు అలా తెరిచే పెట్టుకున్నారట!

- ఏమో నాయనా? రాజ్ కపూర్ సినిమా బాబూ! క్షణంలో సీను మారుద్దీ... ఎందుకు రిస్కూ?

'జోకర్' ఫ్లాప్ అయ్యాక 'ఆర్.కే. ఫినిష్డ్' అన్నారు కొందరు మరీ లౌడ్ స్పీకర్లతో, పని కట్టుకొని.

రాజ్ కపూర్ లాంటి కళాకారులు మడి కట్టుకుని కూర్చుంటారా ఏమిటీ? డింపుల్, రిషితో 'బాబీ' వచ్చింది. చరిత్ర సృష్టించింది. 'చాబీ ఖో జాయే' ట్రేడ్ సీక్రెట్ అయిపోయింది.

యూత్, లవ్, క్రేజీ నెస్ యువతీ యువకుల ఊత పదాలైపోయాయి. చాలా మంది 'ఝూట్ బోలే' అంటూ 'కవ్వాకాటే' అని వాపోయారు. ఆఖరి విన్నింగ్ స్టైల్ మటుకు రాజ్ కపూర్‌దే!

బర్సాత్ నుండి జోకర్ దాకా ఉన్న రాజ్ సంగీత స్తంభాల సంగతి?

జై కిషన్ నిజంగానే క్రియేటివ్ జీనియస్. హస్రత్ మియాతో కలిసి ఎన్నో ఆణిముత్యాల్లాంటి 'హసీన్ గీతాలను' అందించిన సొగసరి. శైలేంద్ర అయితే మాటల జాదూగర్! మామూలు మాటల్లో జీవిత సారాన్ని వడపోసిన అద్భుతమైన గీతాల జనకుడు.

(శంకర్ జై కిషన్ / శైలేంద్ర హస్రత్ గీతాల గురించి సుదీర్ఘమైన వ్యాసం రసికులకు అందించాలని కోరిక. వారి సంగీతంలో కొట్టుకుని పోయిన వాళ్లు లక్షల్లో ఉన్నారు. ముంబాయి లోని శంకర్ జై కిషన్ చౌరస్తా నుండి కేవలం సంగీతాభిమానంతో నాకు ఫోన్ చేసిన మిత్రులు కోకొల్లలు... ఆ ముచ్చట్లు ఓపిగ్గా. తీరిగ్గా మళ్లీ ఎప్పుడైనా...)

గమ్మత్తేమిటంటే - అంత ఆత్మీయుడైన శైలేంద్ర సినిమా 'తీస్రీ కసమ్' కోసం రాజ్ 'వీజీ' గా అందుబాటులో లేడు. కారణాలు కోటి కావచ్చు... కానీ, 'సజన్ రే ఝూట్ మత్ బోలో' - సజనవా బైరీ హో గయే హమార్' - 'దునియా బానానే వాలే - కాహెకో దునియా బనాయీ' లాంటి 'ఫిలాసఫికల్ టచ్' రాసిన శైలేంద్ర తీస్రీ కసమ్ పూర్తయ్యే సరికి కృంగిపోయాడు. దానికి రాష్ట్రపతి పురస్కారం చూడనేలేదు శైలేంద్ర.

డిసెంబర్ 14 న రాజ్ కపూర్ పుట్టినరోజు...!

అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్తూ పలకరించాడు శైలేంద్ర రాజ్‌ను. త్వరగా కోలుకుని రా నేస్తం.. జోకర్ కోసం పాటలు రాయాలి... అంటూ నవ్వుకున్నారు. అదే ఆఖరి మాట అని ఎవ్వరూ అనుకోలేదు. జోకర్ కోసం శైలేంద్ర రాసిన అసంపూర్ణ గీతాన్ని అతడి అబ్బాయి శైలి శైలేంద్ర పూర్తి చేశాడు.

అదే జీవితం! అదే సినీ జీవితం! అసలు సిసలైనది! వెండితెర ముందు కూర్చుండి, నాణేలు విసురుతూ, పిచ్చి పిచ్చి కామెంట్స్‌తో హాలును హోరెత్తించే మామూలు నేల టిక్కెట్లు ఊహించలేని, అర్థం చేసుకోలేని సినీ మాయా జీవితం!

నేడు రాజ్ కపూర్, ఆయన స్ఫూర్తి స్థానం నర్గీస్, సంగీత దిగ్గజ స్తంభాలు శంకర్ జై కిషన్, గీత సృష్టికర్తలు శైలేంద్ర, హస్రత్, రాజ్ గొంతు ముకేష్ మన మధ్య లేరు.

మబ్బులకవతల ఏ వింత ప్రపంచం ఉందో తెలియదు కానీ, అక్కడివాళ్లంతా గుమిగూడి మరో ఆర్.కే దునియా స్థాపించారా అన్నది అంతకన్నా తెలియదు.

ఈ తరం వారికి నర్గీస్ అందాలా? హుం అనిపించవచ్చు... కానీ, ఓపిక చేసుకుని పాత రాజ్ - నర్గీస్ ల ఏ శ్వేత శ్యామ వర్ణ సినీ ఖండిక నైనా తీసి స్పర్శించండి. సంగీతం ఎలా జలజలా రాలుతుందో, ప్రేమ ఎలా సవ్వడి చేయకుండా పలకరిస్తుందో, నీలి కళ్ల భారతీయ చార్లీ చాప్లిన్ - ఆయన బేబీ (నర్గీస్) చెప్తారు!

ఎన్నేళ్లైనా వారు ఎవర్‌గ్రీన్ ఎవర్ యంగ్ - ఎవర్ లవింగ్ - అండ్ ఫరెవర్ వాంటెడ్' ఎందుకో అర్థమవుతుంది. ఈ నాటి లొల్లి సంగీతం, జిమ్నాస్టిక్స్ సాంగ్స్‌లో యాక్షన్ ఏమిటన్నదీ తేటతెల్లమవుతుంది. మనం కూడా గొప్పవాళ్లమే! కావాల్సింది 'గొప్ప' ఓపిక! దట్సాల్! ✠

కవిత్వమ్

ఉనికి తెలియని ఊడలు

-పోతగాని

కులానికేం ముప్పులేదు
కుమ్ములాటలున్నంత కాలం కుశలంగానే
ఉంటుంది
వృత్తులే వాడి ఇనుప పాదాల కింద నలిగే
పలుగురాళ్లై చూర్ణమవుతుంటే!
చెప్పులు కుట్టిన చేతులిరిగి చానాళ్లైనా
తోళ్ల రోశయ్య ఇప్పటికీ చర్మకారుడే
సంభావన కరువై మెతుకు వేటలో పండిపోయిన
బాపన కోటయ్యదింకా అగ్రవర్ణమే!!
గంజి దొరక్క గాజులమ్మే గఫూరైనా
హుక్కా పీల్చే నవాబు కిందే లెక్క!!!
బొజ్జ నింపుకోడానికి
మధురమైన మామిడి ముక్కలతో పనిగానీ
రసహీనపు టెంకలతో వాడికేం పని!
కాలం నడకలకంటే ముందే ప్రసరించిన
చూపుల్లో
ఆవిష్కరించుకున్న వానవిల్లుల గొంతుకల్ని
ఉనికి తెలియని ఊడలతో ఉరేసి
బతుకు ఆధారాల్ని ఛిద్రం చేయడం
వాడికి రక్తాన్నంతో పెట్టిన విద్య!
ఉపాధి కాజేసి ఉరితీసే నేర్పును
ఉగ్గుపాలతో ఒంటబట్టించుకున్న తలారితనంపై

వాడిది పేరైన పేటెంటు
ముద్ర
ప్రలోభ సంగీతంతో జోకొట్టి
నిద్రలోకి జారుతున్న
నెత్తుట్లోకి
డాలర్ వైరసుల్ని సుతిమెత్తగా
చొప్పించి
శ్రమైక జీవన స్వప్నాలను
భగ్నం చేసే గ్లోబలాసురుడై
బడుగు జీవులకు బువ్వ పెట్టే
వృత్తుల్ని
తలపెట్టిన వర్తకానికి మేలైన
వనరులుగా
బలిపెడుతున్నప్పుడు
అంతుచిక్కని వ్యూహాల
నెగళ్లలోకి నెట్టబడి
అలమటిస్తున్న అమాయక
శలభాల ఆత్మఘోషలిప్పుడు
కనిపించని కుట్రల నిగూఢ
రహస్యాన్ని ఛేదించేందుకు
ముడుచుకుపోతున్న మెదళ్లలోకి సర్రున జారి
తళుక్కున మెరిసే నిజాల పిడుగులై
ధిక్కార స్వరాలతో శబ్దించాల్సిన సందర్భం!
కులం అవశేషమై వృత్తి శిలాజమై
బతుకు దుర్భరమై అలముకున్న
జీవనాంధకారంలో
అడుగులు తడబతున్నప్పుడే
అచంచల విశ్వాసం ఆలంబన కావాలి
ఊపిరి వృత్తంలోకి చొరబడిన
ఆగంతక ఊడల ఉనికి అదృశ్యం కావాలి
జీవిక చిగురించేందుకు
కులవృత్తికి సాటిలేని కుంభిని నిర్మించాలి!

నిరంతర భూపోరాటాలు

-పొత్తూరి సుబ్బారావు



ఆదిమానవులే నయం
భయం లేకుండా నివశించేవాళ్లు
తమకిష్టమయిన నేలపైన
ఆధునిక యుగంలో
అడుగడుగునా భయంమయం
ఎక్కడా చోటు దొరకక
సామాన్యుడు ఫుట్‌పాత్‌పైన
నడుం వాలిస్తే చాలు
నడ్డివిరిగేలా కొడుతుంటారు పోలీసులు
లా అండ్ ఆర్డర్ అక్కడే అమలు
పరుస్తున్నట్లు
నాలుగు రోడ్ల కూడలిపైనో
రోడ్డు నడుమ డివైడర్‌పైనో
తనువు వాల్చిన రాత్రి అతనికి
తనువు చాలించే రాత్రిగా చేస్తుంటాయి.
ఆదారిన వేళ్లే భారీ వాహనాలు
ఎంత రోడ్డున్నా వాటికి సరిపోనట్లు
ఎన్నాళ్లగానో రోడ్డు ప్రక్కన పడిఉన్న
పెద్ద పైపులను నివాసంగా చేసుకుంటే
అప్పుడే వాటిని దొర్లించుకుపోతుంటారు
ముంచుకొచ్చే ఎన్నికల నాటికి
మురుగు కాలువలను
ముస్తాబు చేయటానికన్నట్లు
ఎప్పుడో వేసుకున్న పూరిగుడిసెలన్నిటిని
పీకి పారేస్తుంటారు
బడారోడ్లు వేయటానికవి
అడ్డువచ్చాయని
ఆదుకుంటామన్న నాయకులెవరూ
ముందుకు రారపుడు
వాళ్లపుడు అధికార పక్షంలోకి
వచ్చినట్లున్నరు
కబ్జాచేసి కట్టుకున్న వాళ్లంతా
కావలసిన వారయితే చాలు
క్రమబద్ధీకరణకు తలుపులు
తెరుస్తుంటారు
వాళ్ల భూములను కాపాడాలి కనుక
అందుకేనేమో మరి
కినుక వహించిన
సాధారణ మనిషికిక్కడ
మిగిలేవి
నిరంతర భూపోరాటాలు.

కాలుష్యంతో కాసులు

అతిముఖ్యమైన హరితగృహ వాయువుగా పేరొందిన కార్బన్ డయాక్సైడ్ భూగ్రహ వాతావరణంలో అనూహ్యంగా పేరుకుపోయి ఉష్ణోగ్రతలు పెంచుతూ ప్రపంచాన్ని చెమటలు పట్టిస్తోంది. జీవులు విసర్జించేది, మొక్కలు పగటివేళ తమ ఆహార తయారీలో వాడుకునేది ఈ వాయువునే. ఇప్పుడు ఇదే వాయువు ప్రపంచ ప్రజలు, వ్యాపారస్తులు, కార్పొరేట్లు, చివరికి వ్యవసాయదారులకు కూడా లక్షలార్జించి పెట్టే సాధనం! అది ఎలాగో ఏంటో ఎందువల్లో తెలుసుకుందాం.

డా॥ కాకర్లమూడి విజయ్

ఈ కార్బన్ వ్యాపారాన్ని కార్బన్ క్రెడిట్ గా పిలుస్తున్నారు. ప్రపంచదేశాలు అభివృద్ధి చెందే క్రమంలో కార్బన్ డయాక్సైడ్ వాయువుని విపరీతంగా వాతావరణంలోకి వెదజల్లడం జరిగిపోయింది, జరుగుతోంది. దీనివల్ల గ్రహ వాతావరణం విపరీతంగా వేడెక్కిపోవడం ప్రారంభమైంది. ఇలా ఏర్పడిన కొత్త విపత్తుని (గ్లోబల్ వార్మింగ్) ఏ విధంగా ఎదుర్కోవాలి? ఎటువంటి పరిష్కారాలు పాటించాలి? అనే విషయంలో సర్వత్రా మేథోమథనం మొదలైంది. ఆ విధంగా కార్బన్ డయాక్సైడ్‌ను, ఇతర హరిత గృహ వాయువులను నియంత్రించే ఉద్దేశ్యంతో ప్రపంచ దేశాల మధ్య ఒక అవగాహన ఏర్పడి క్యోటో ప్రోటోకాల్ అనే ఒప్పందం ఏర్పడింది.



ఈ ఒప్పందం ప్రకారం అధికంగా హరిత గృహ వాయువులు (కార్బన్ డయాక్సైడ్, ఓజోన్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్) విడుదల చేసే దేశాలు ఆ మోతాదుని 1990 ల స్థాయికి తగ్గిస్తామని స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి. అభివృద్ధి చెందిన దేశాలు, ముఖ్యంగా యూరోపియన్ దేశాలు, 2008- 2012 మధ్యకాలంలో తమ తమ దేశాలలోని హరితగృహ వాయువుల విడుదల తగ్గించేలా ఒప్పుకున్నాయి (అమెరికా క్యోటో ప్రోటోకాల్ పై సంతకం చేయలేదు).

ఈ అభివృద్ధి చెందిన దేశాలు తమ ఫ్యాక్టరీల వాయువుల మోతాదు నియంత్రించడానికి ఒక కొత్త పద్ధతిని అవలంభించడం ఆరంభించాయి. ఒక కంపెనీ రెండు విధాలుగా వాయువుల విడుదలను నియంత్రించవచ్చు. ఒకటి - కొత్త టెక్నాలజీలను అభివృద్ధి పరచుకోవడం ద్వారా, లేదా వున్న టెక్నాలజీనే మెరుగుపరుచుకోవడం ద్వారా వాయువుల నియంత్రణ చేయడం. లేదా, అభివృద్ధి చెందుతున్న దేశాలతో ఒప్పందం కుదుర్చుకుని, వాటికి పర్యావరణ అనుకూల టెక్నాలజీ అందించి, వాటని 'క్రెడిట్'లు సంపాదించేలా చేయడం. ఈ పద్ధతిలో లాభపడే అవకాశాలు మనదేశంతో పాటు చైనా, ఇంకొన్ని ఆసియా దేశాలకున్నాయి. ఎందుకంటే ఇవి అభివృద్ధి చెందుతున్న దేశాల కోవలోవి కాబట్టి. ఈ దేశాలలోని ఏ కంపెనీ గానీ, ఫ్యాక్టరీ గానీ, ఒక రైతుగానీ యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్ (యుఎన్ఎఫ్‌సిసిసి) ని సంప్రదించి, తమ తమ తరహా కార్యక్రమాలకు నిర్దేశించిన కార్బన్ వాయువు విడుదల మోతాదుని తెలుసుకోవచ్చు. ఆ నిర్దేశిత స్థాయి ప్రకారం ఒక రైతు గానీ, ఒక ఫ్యాక్టరీ గానీ, తామెంత తక్కువ కార్బన్ డయాక్సైడ్‌ని విడుదల చేస్తున్నామో (ఆ కార్యక్రమం కోసం ముందే నిర్దేశించిన స్థాయి కన్నా) తెలుసుకుని ఆ మేరకు అభివృద్ధి చెందిన దేశంలో క్రెడిట్ చేయవచ్చు. ఇదే కార్బన్ క్రెడిట్. ఈ క్రెడిట్లను అభివృద్ధి చెందిన దేశాలు కొనుగోలు చేస్తాయి. ఉదాహరణకు ఇంగ్లాండులో ఒక పెట్రోలియం కంపెనీ నిర్దేశిత స్థాయికన్నా అధికంగా కార్బన్‌ని విడుదల చేస్తుందనుకుందాం. అది అక్కడే, తక్కువ స్థాయిలో కార్బన్ విడుదల చేసే ప్రయత్నాలు (టెక్నాలజీ ద్వారా) చేయాలి. లేదా భారత దేశంలో (మరో అభివృద్ధి చెందుతున్న దేశంలోనైనా) దాని అనుబంధ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవాలి. అలా మన దేశంలోని కంపెనీ నుండి నిర్దేశిత స్థాయికన్నా తక్కువ వాయువు విడుదల చేయడం వల్ల ఆ 'లోటు' మేరకు క్రెడిట్లు ఇంగ్లాండు కంపెనీ కొనుక్కుంటుంది. అంటే ఏ వ్యాపారాలు కార్బన్‌ని నిర్దేశిత స్థాయికంటే ఎక్కువ విడుదల చేస్తాయో, ఆ ఎక్కువ స్థాయి మేర క్రెడిట్లు కొనుక్కోవాలి. ఏ వ్యాపారాలైతే తక్కువ విడుదల చేస్తాయో, అవి ఎంత తక్కువ ఉంటే అంత మేర క్రెడిట్లు అమ్ముకోవాలి. ఈ కొనుగోళ్లు, అమ్మకాలు అంతర్జాతీయ మార్కెట్లో అప్పటి ధర ప్రకారం చేసుకోవచ్చు. వాణిజ్యపరంగా ఒక్కో క్రెడిట్ ఒక టన్ను కార్బన్ డయాక్సైడ్‌తో సమానం. అంటే ఆ క్రెడిట్ కొనుక్కున్న సంస్థ ఒక టన్ను కార్బన్ డయాక్సైడ్ అధికంగా విడుదల చేసే హక్కుని కొనుక్కున్నట్టే.

మరో రకంగా ఈ వ్యవహారాన్ని చూద్దాం :

ఒక ఫ్యాక్టరీ ఏటా లక్ష టన్నుల హరితగృహ వాయువుల్ని వదుదల చేస్తుంది. చట్ట ప్రకారం ఆ ఫ్యాక్టరీ పరిమితి 80000 అనుకుంటే, ఆ ఫ్యాక్టరీ తన వాయువులను ఆ మేరకు తగ్గించనైనా తగ్గించుకోవాలి. వీలు కాకపోతే (అలా చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావచ్చు) ఎక్కువగా ఉన్న 20000 టన్నులకు గాను 20000 క్రెడిట్లు కొనుక్కోవాలి. పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నందుకు ఖరీదు కట్టి మూల్యం చెల్లించాలన్న మాట!

సరే! ఆ ఫ్యాక్టరీ ఎవరి దగ్గర నుండి క్రెడిట్లు కొనుక్కోవాలి? ఎవరి వల్ల కాలుష్యం తక్కువగా జరుగుతుందో, లేదా ఎవరి వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందో వారి దగ్గరినుండి. ఉదాహరణకు ఒక రైతు తన క్రెడిట్లు అమ్మి, దాంతో క్రెడిట్‌కి కొన్ని చెట్లు చొప్పున నాటాడనుకుందాం. ఆవిధంగా ఒక ఫ్యాక్టరీ ఒక టన్ను కాలుష్యం విడుదల చేసినా, మరో చోట ప్రకృతికి సహాయపడి, ఒక టన్ను కార్బన్ డయాక్సైడ్‌ని పీల్చుకునే చెట్లు కొన్నట్లు అవుతుంది.

కాలం గడుస్తున్న కొద్దీ వాయువుల విడుదల మోతాదు పెరిగేదే కానీ తరిగేది కాదు. కాబట్టి క్రెడిట్లు కొనుక్కునే కంపెనీలు పెరుగుతూనే ఉంటాయి. దాంతో ఈ కార్బన్ క్రెడిట్ల మార్కెట్ ధరలు పెరిగి, కార్బన్ క్రెడిట్లు రూపొందించి అమ్మే (తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే) సంస్థలు పెరుగుతాయి. అలా వాతావరణ కాలుష్యం తగ్గే అవకాశం వుంది.

ఈ డిసెంబర్‌లో ఒక ఆడిట్ జరుగుతుంది. ఏ కంపెనీలు ఎంత ప్రయత్నం చేసి కాలుష్యాన్ని ఏ మేరకు నియంత్రించగలిగాయో అంచనా వేస్తారు. చైనా, భారత్‌లు ఇప్పటికే కొత్త టెక్నాలజీ ఉపయోగించి కార్బన్‌ను

తక్కువ విడుదల చేసి తద్వారా ఎక్కువ కార్బన్ క్రెడిట్లు పొందే అవకాశాలను మెరుగుపరుచుకుంటున్నాయి. వాటి వాటి క్రెడిట్లను యూరప్‌లోని సంస్థలకు అమ్ముకుంటున్నాయి.

ఒకప్పుడు ఒక టన్ను కార్బన్‌కి 15 యూరోలు వచ్చేవి. ప్రస్తుతం 22 యూరోలు (ఒక కార్బన్ క్రెడిట్‌కి) వస్తున్నాయి. ఈ లావాదేవీలు యూరోపియన్ క్లైమేట్ ఎక్స్‌చేంజ్‌లో జరుగుతాయి. నిర్దేశిత స్థాయికన్నా ఎన్ని టన్నులు తక్కువ విడుదల చేస్తే అన్ని ఎక్కువ యూరోలు సంపాదించినట్లే.

విశేషమేమిటంటే భారత ప్రభుత్వం ఇంకా కార్బన్ విడుదలపై ప్రత్యేకంగా నిబంధనలు పెట్టలేదు. ఏ స్థాయిలో వుండాలో నిర్దేశించలేదు. దానివల్ల భారతీయుల నుండి క్రెడిట్లు కొనుక్కోవడానికి వచ్చే వాళ్లు పెట్టుబడిదార్లే. వారి అంచనా ప్రకారం రాబోయే మూడేళ్లలో యూరోపియన్లు తమ కాలుష్యాలను నిర్దేశిత స్థాయికి తగ్గించుకోలేని పక్షంలో కార్బన్ క్రెడిట్ల డిమాండ్ పెరిగి విపరీతమైన లాభాలు ఆర్జించవచ్చు. అందువల్ల పెట్టుబడిదారులు కార్బన్ క్రెడిట్లను ప్రస్తుతం కొనిపెట్టుకుంటున్నారు. వాటి ధర మార్కెట్లో పెరిగినప్పుడు అమ్ముకుంటారు. భారత దేశంలో ఇప్పటికే మూడు, నాలుగు వందల కంపెనీలు యుఎన్ఎఫ్‌సిసిసి నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ కార్బన్ క్రెడిట్లు అమ్మకానికి పెట్టుకున్నాయి.

తాజా ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారత దేశం కార్బన్ క్రెడిట్ల వ్యాపారంలో ఎక్కువ లబ్ధిపొందే అవకాశం వుంది. మొత్తం ప్రపంచ కార్బన్ ట్రేడింగ్‌లో మన దేశం 25% చేజిక్కించుకోవచ్చు. యూరప్‌లోని జర్మనీతో పాటు రానున్న కాలంలో అమెరికా, జపాన్ కూడా క్రెడిట్లు కొనే పెద్ద దేశాలుగా మారవచ్చు. ఆ విధంగా భారతదేశం కార్బన్ ట్రేడింగ్ ద్వారా ఏటా 100 మిలియన్ డాలర్లు సంపాదించవచ్చు. ఈ కార్బన్ క్రెడిట్లను షేర్ మార్కెట్లలో 'కమోడిటీలు'గా పరిగణిస్తూ, వాటిపై పెట్టుబడులు పెట్టడం కూడా ప్రారంభమైంది. అప్పుడే వీటికోసం ప్రత్యేకంగా బ్రోకర్లుకూడా తయారయ్యారు. ఈ డిసెంబర్‌లో దేశ దేశాల కర్బన ఉద్గార స్థాయిలు మదుపు చేయబడతాయి. దానివల్ల క్రెడిట్ల విలువ షేర్ మార్కెట్లో పెరిగే అవకాశముందని ఆ వర్గాలు చెబుతున్నాయి. రానున్న మూడు నాలుగేళ్లలో క్రెడిట్ల విలువ అనూహ్యంగా పెరిగే అవకాశముందని పరిశీలకుల అంచనా. మొత్తానికి కాలుష్యంతో వ్యాపారం జరిపి ప్రకృతికి ఉపశమనం కలిగించే సంగతి ఎలావున్నా మానవులు మాత్రం డబ్బు సంపాదించుకోవచ్చు. విశృంఖలంగా కాలుష్యాన్ని వెదజల్లిన వాళ్లం పశ్చాత్తాపపడి దాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయాలు స్వచ్ఛందంగా చేపట్టవలసింది పోయి, ఈ విచిత్ర వ్యాపారం ఏమిటని నిలదీసేవాళ్లు పెరుగుతున్నారు. "నాకు మా వూళ్లో పదికిలోల చెత్త పడేసేందుకు పర్మిషనుంది. కానీ నేను ఉత్పత్తి చేసే చెత్త ఇరవై కిలోలు. ఆ మిగతా పది కిలోలకు మీవూళ్లో పది క్రెడిట్లు కొంటే సరిపోతుంది కదా, నా చెత్త ఉత్పత్తిని తగ్గించడమెందుకు?" అనే అహంకార ధోరణికి ఈ ప్రకియ దారి తీస్తుందన్న ఆందోళనా ఉంది.

కానీ ఈ పద్ధతిలో ఎప్పటికైనా అటువంటి విచ్చలవిడితనానికీ ముగింపు ఉంది అంటారు దీన్ని వెనకేసుకొచ్చేవాళ్లు. ఈ రోజు భారతదేశం వంటి దేశాలు ఇంకా అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి కాబట్టి ఈ క్రెడిట్లతో లాభాలు పొందవచ్చు. కానీ ఎప్పటికైనా అవి అభివృద్ధి చెందుతాయి కదా! అప్పుడు వాటి కాలుష్య ఉద్గార స్థాయి వల్ల ఈనాడు క్రెడిట్లు అమ్మేవి రేపు వాటిని కొనుక్కోవలసిన అగత్యం ఏర్పడుతుందేమో! మరి అప్పుడు? అప్పణంగా వచ్చిపడే డబ్బులు ఆగిపోవచ్చేమో గానీ పర్యావరణానికి వచ్చిపడే తిప్పల సంగతి?



అవసరమున్నా లేకున్నా మరో నాలుగైదు తరాలు సుఖంగా జీవించేందుకు సరిపడా ధనార్జనతో "ముందుచూపు" పెంచుకున్న వారికి - పారిశ్రామిక యజమానులు, పాలకులు వగైరా - వారి సంతతికి డబ్బే కాదు, దాన్ని అనుభవించేందుకు మంచి వాతావరణం కూడా అవసరమే అన్న దృష్టి లేకపోవడం విచారకరం.

ఎవరికి వారే విధించుకోవలసిన 'డిసిప్లిన్' వదిలి చేసిన తప్పుల్ని డబ్బుతో సరిదిద్దుకోవాలని చూడటం మరింత విచారకరం.

క్యోటో ప్రోటోకాల్

1997 డిసెంబర్ 1-11 మధ్యలో జపాన్ దేశంలోని క్యోటో లో యునైటెడ్ నేషన్స్ ఆధ్వర్యంలో ప్రపంచ దేశాల సదస్సు జరిగింది. ఈ సదస్సులో కుదిరిన ఒప్పందం మేరకు ఈ ప్రోటోకాల్‌కు అంగీకరించిన దేశాలు నాలుగు హరిత గృహ వాయువుల (కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్) విడుదలను తగ్గించవలసి వుంటుంది. ఈ నాలుగింటితో పాటు మరో రెండు వాయువుల (హైడ్రో ఫ్లోరో కార్బన్లు, పర్‌ఫ్లోరో కార్బన్లు) సముదాయాలను కూడా నియంత్రించవలసి ఉంటుంది. ఈ తీర్మానం 37 పారిశ్రామిక దేశాలపై నియంత్రణ విధించింది. మొదటి ఒప్పంద కాలం 2008- 2012. ఈ కాలాంతానికి అంగీకారాన్ని తెలిపిన దేశాలు తమ కాలుష్యాలను 1990ల స్థాయికంటే తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. అంటే 1990లో ఉన్న కాలుష్య స్థాయి కంటే 5.2% తగ్గించాలి. ఈ తగ్గింపు దేశాలను బట్టి మారుతుంది. యూరోపియన్ యూనియన్ కి 8%, అమెరికాకి 7%, జపాన్‌కి 6%, రష్యాకి 0%. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఐస్ లాండ్ లలో కాలుష్యం చాలా తక్కువ వుండడంతో అవి1990 స్థాయికంటే అధికంగా విడుదల చేసే వీలు కల్పించబడింది.

మన పాత్ర

భారత దేశం ఆగస్టు 2002 లో ఈ ఒప్పందంపై సంతకం చేసింది. కాలుష్య విడుదలపై భారత దేశానికి ఎటువంటి నిబంధన (ఈ ప్రోటోకాల్‌లో) లేనప్పటికీ టెక్నాలజీ మార్పిడికీ, విదేశీ పెట్టుబడులకీ వీలుంది. మన దేశంలో తలసరి కాలుష్యం అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే చాలా స్వల్పం. అయితే ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చు. చైనాతో పాటు మనదేశం కూడా వేగంగా పారిశ్రామికీకరణ దిశలో సాగుతోంది కాబట్టి మనం కూడా కాలుష్యాలను అధికంగా విడుదల చేసే దేశాల జాబితాలో చేరవచ్చు.

అగ్రజుడి అలక

మనవంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఈ ప్రోటోకాల్ పరిధిలోకి తేనంతవరకూ ఈ తీర్మానానికి అంగీకరించేది లేదని అమెరికా మొండికేసింది. వైస్ ప్రెసిడెంట్ ఆల్ గోర్ నవంబర్ 12, 1998న సూత్రప్రాయంగా సంతకం చేసినా, అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొనందే సెనేట్‌లో ఆమోదించమని ప్రకటించారు. చైనాని ఈ ఒప్పందంలో చేర్చనందుకు (చైనాలో తలసరి కార్బన్ విడుదల తక్కువే ఉన్నా నికర విడుదల ప్రపంచంలో అధికం) నిరసనగా జార్జ్ బుష్ ఈ ప్రోటోకాల్‌ని ఒప్పుకోనని ప్రకటించాడు. అయితే 2012 కల్లా తమ దేశపు కార్బన్ విడుదలను 18% తగ్గించేలా ఒక ప్రణాళిక అమలు పరుస్తున్నారు.

కార్బన్ క్రెడిట్లతో మేలు జరిగేనా?

అధికంగా కాలుష్యాన్ని విడుదల చేసేవాళ్లు తాము చేసిన 'పాప' ప్రక్షాళణకు తక్కువ కాలుష్యం విడుదల చేసే వారికి డబ్బిచ్చి క్రెడిట్లు కొనుక్కోవడం ఈ తతంగం అర్థం. అయితే ఇది పర్యావరణానికి మంచి చేస్తుందని సర్వత్రా ప్రచారం జరుగుతోంది. క్రెడిట్లు అమ్మడానికి, తద్వారా డబ్బు సంపాదించడానికి చాలా కంపెనీలు తమ కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తాయన్నది ఆ ప్రచారానికి మూలం.

దీనికి మరో కోణం కూడా ఉంది. ఎలానూ డబ్బుంది కదా అని ధనిక దేశాల కంపెనీలు విచ్చలవిడిగా కాలుష్యాన్ని వెదజల్లుతూ, ఆ మేరకు క్రెడిట్లు కొంటూ పోతే అసలు ఈ పథకానికి అర్థం ఉందా అంటున్నారు విమర్శకులు. ఏతా వాతా, కార్బన్ క్రెడిట్లు పర్యావరణాన్ని పాడుచేసే ప్రక్రియని మాత్రం ఆపకపోవచ్చని వారి అంచనా.

డబ్బుంది కాబట్టి ఏమైనా చేసేసి చేతులు దులిపేసుకోవచ్చు (డబ్బులు విదిలించవచ్చు) అనే భావన ఇప్పటికే ఏ దేశంలోనైనా వుంది. ఇప్పుడు ఆ ధోరణి పర్యావరణ పరిరక్షణకే ఆటంకంగా మారే ప్రమాదం కనిపిస్తోందని నిపుణులు చెపుతున్నారు. పైగా ఇటువంటి ప్రమాదం ధనిక దేశాలనుండే ఉన్నా, ప్రభావం మాత్రం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందన్నది విదితమే.

ఓ మంచి పుస్తకం

దేశ విభజన రాజకీయ విశ్లేషణ

'భారత దేశ విభజన' అన్న పుస్తకం ఈ వాక్యాలతో ప్రారంభం అవుతుంది.దేశ విభజన తర్వాత చాలాకాలానికి అనితా ఇందర్ సింగ్ రాసిన ఈ పుస్తకంలో దేశ విభజనకు సంబంధించి వివిధ రాజకీయ వర్గాలు అనుసరించిన వైఖరులను అప్పటి వాస్తవ పరిస్థితులను విశ్లేషించారు.వంద పేజీల పుస్తకమే అయినా దీన్ని చదివిన తర్వాత ఆయా పక్షాల అవకాశవాదం, బ్రిటిష్ వారి రాజకీయ కౌటిల్యం కూడా తెలుస్తాయి.



- తెర

"1947లో భారత దేశ విభజన అన్నది ప్రపంచ చరిత్రలోనే అత్యంత విధ్వంసకర సంఘటనల్లో ఒకటి. దానిపైన చర్చకు అంతే లేదు. 18వ శతాబ్దం నుంచి ఐరోపా ఆసియా ఆఫ్రికాల్లోనూ మధ్య ప్రాచ్యంలోనూ చోటు చేసుకున్న అనేకానేక విభజనల్లో అదొకటి. వాటిల్లో చాలా వాటిలో జరిగినట్టుగానే ఈ విభజనతో పాటుగా వివిధ మత వర్గాల మధ్య తీవ్ర హింసాకాండ చెలరేగింది.మరే దేశ విభజనలోనూ లేనంత ఎక్కువ మంది ఇక్కడ చనిపోయారు. భారత దేశ విభజన సందర్భంలో చనిపోయిన వారు, నిరాశ్రయులైన వారు, సర్వం కోల్పోయిన వారి సంఖ్య ఎంతో తెలియదు. రెండు నుంచి ముప్పై లక్షల మధ్య ఎంతమందైనా ప్రాణాలు కోల్పోయి వుండొచ్చు.1946 1951 మధ్య కాలంలో దాదాపు 90 లక్షల మంది హిందువులూ సిక్కులూ పాకిస్తాన్ నుంచి ఇండియా తరలివచ్చారు. ఇండియా నుంచి పాకిస్తాన్‌కు సుమారు 60 లక్షల మంది ముస్లింలు తరలివెళ్లారు.

సామ్రాజ్యవాద బ్రిటన్ అమలు చేసిన నాలుగు విభజనల్లో ఇదొకటి. వేర్వేరు మతాల వారు కలసి జీవించలేరన్న ప్రాతిపదికపై బ్రిటిష్ వారు ఐర్లాండ్, పాలస్తీనా,సైప్రస్ దేశాలను కూడా చీల్చారు. ఇందుకు మత జాతిపరమైన విభజన ఒక్కటే కారణం కాదు. బ్రిటన్ సైనిక ప్రయోజనాలు కూడా ఈ సందర్భంలో దాని వ్యూహాలను ప్రభావితం చేశాయి....."

'భారత దేశ విభజన' అన్న పుస్తకం ఈ వాక్యాలతో ప్రారంభం అవుతుంది.దేశ విభజన తర్వాత చాలాకాలానికి అనితా ఇందర్ సింగ్ రాసిన ఈ పుస్తకంలో దేశ విభజనకు సంబంధించి వివిధ రాజకీయ వర్గాలు అనుసరించిన వైఖరులను అప్పటి వాస్తవ పరిస్థితులను విశ్లేషించారు.వంద పేజీల పుస్తకమే అయినా దీన్ని చదివిన తర్వాత ఆయా పక్షాల అవకాశవాదం, బ్రిటిష్ వారి రాజకీయ కౌటిల్యం కూడా తెలుస్తాయి.

చిన్న ఉపోద్ఘాతం వంటి మొదటి అధ్యాయంలో జాతి మత ప్రాతిపదికన జరిగిన దేశాల విభజనల నేపథ్యాన్ని పొందుపర్చారు. విభజనల పర్యవసానాలను వాస్తవికంగా పేర్కొన్నారు.విభజనల వల్ల సరిహద్దులను బలప్రయోగంతో నిర్ణయించవలసి వస్తుంది. దాంతో అనేక మానవతా సమస్యలు తలెత్తుతాయి. విభజనల వల్ల మూఢత్వం నిరంకుశత్వం, కలసి మరిన్ని జాతియుద్ధాలు రగిలిస్తాయి.పాకిస్తాన్‌లో కన్నా ఈ నాటికీ ఇండియాలోనే ముస్లిం జనాభా ఎక్కువగా వుంది. విభజిత సరిహద్దుకు అటూ ఇటూ కూడా మిశ్రమ జనాభా కొనసాగుతూనే వుంది. విభజనలు కోరేవారు భూగోళాన్ని జాతి మతం సంస్కృతి వంటి వాటితో కలగాపులగం చేస్తారు.

దేశ విభజనకు కారకులెవరనే ప్రశ్నను రెండవ అధ్యాయంలో పరిశీలించారు. హిందూ ముస్లిం విభజన చీలిక తప్పనంత తీవ్రంగా వుందా? ముస్లిం లీగ్ నాయకుడు జిన్నా ప్రత్యేక దేశం కోరినంత మాత్రాన ఆమోదం లభించిందా? బ్రిటిష్ వారి ఎత్తుగడలు లేదా కాంగ్రెస్ నేతల పొరబాట్లు ఇందుకు దోహదం చేశాయా? అనేనే ప్రశ్నలు.మైనారిటీల సమస్య, హిందూ ముస్లిం సమస్య వంటి వాటిని కారణాలుగా చూపడానికి ఆధారాలు లేవు.1946-47 వరకూ అన్ని స్థాయిల్లో మత విభజనలు వున్నట్టు చెప్పడానికి ఆధారాలు కూడా లేవు.ఉదాహరణకు 1937లో వాయువ్య రాష్ట్రంలో ముస్లింలు సంఖ్యాపరంగా ఆధిక్యతలో వున్నా రాజకీయంగా ముస్లిం లీగ్ వెనకబడి వుంది. మైనార్టీల సమస్య అనేట్టయితే క్రైస్తవులు సిక్కులు వగైరా చాలా రకాల వారున్నారు.కాని బ్రిటిష్ వారు కేవలం ముస్లింలనే ఆ కోణంలో పరిశీలించడానికి కారణమేమిటి? అన్నది ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానంగా "విభజన నేపథ్యం: భారత దేశంలో మతతత్వ సమస్య" అన్న తదుపరి అధ్యాయం రాశారు.1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించినప్పటి నుంచి బ్రిటిష్ వారు ముస్లింలలో కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెంచడానికి తంటాలు పడుతూ వచ్చారు.1857లో ప్రథమ స్వాతంత్ర సంగ్రామం రగిలించింది ప్రధానంగా ముస్లింలేనని,వారి పట్ల జాగ్రత్తగా వుండాలని

భావించారు. ముస్లింలను మంచి చేసుకోవడంపై దృష్టి పెట్టారు. అంతేగాక కాంగ్రెస్‌పై హిందూ ముద్ర వేసి ముస్లింలను దానికి వ్యతిరేకంగా తయారు చేయడం వారి వ్యూహంగా మారింది. హిందూ మహాసభ వంటి సంస్థలు వున్నా వాటిని బ్రిటిష్ వారు వాటిని లెక్కలోకి తీసుకోలేదు. వాస్తవంలో ఈ హిందూ సంస్థలు కూడా బ్రిటిష్ వారి పట్ల విశ్వాసం ప్రదర్శిస్తూ కాంగ్రెస్‌ను వ్యతిరేకించేవే. ఉదాహరణకు 1930ల నాటి కాంగ్రెస్ ఆర్థిక కార్యక్రమం తీవ్రవాద ధోరణిలో వుందని హిందూ మహాసభ,ముస్లింలీగ్ రెండూ భావించాయి. బ్రిటిష్ ఇండియా రాజ్యాంగ రూపకల్పన చక్రవర్తికి సంబంధించిన వ్యవహారంగానే వుండాలని సావర్కార్ స్పష్టంగా పేర్కొన్నాడు. కనక ఇది రాజకీయ సమస్య తప్ప కేవలం మత పరమైన సమస్య కాదు. 1905లో బెంగాల్ విభజనలోనూ బ్రిటిష్ వారి వ్యూహం వుంది. 1909లో హిందూ ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయడం వల్ల మతపరమైన వైరాలు రెచ్చగొట్టబడ్డాయి. దీనికి ఆర్థిక వైరాలు కూడా తోడై మత ఘర్షణలు విజృంభించాయి. ప్రజాబాహుళ్యం రాజకీయ చైతన్యం వల్ల స్వాతంత్ర పోరాటం వూపందుకొన్నట్టే మత భావనలతో కూడా మద్దతు పొందవచ్చని ముస్లింలీగ్ పసిగట్టింది. తత్ఫలితంగానే 1937 తర్వాత మత సమస్య స్వభావం మారిపోయింది.

1937 ఎన్నికల ఫలితాలను పర్యవసానాలను రచయిత నాల్గవ అధ్యాయంలో విశ్లేషించారు. 1936లో జరిగిన శాసనసభ ఎన్నికలకు కాంగ్రెస్ తరపున నెహ్రూ,లీగ్ తరపున జిన్నా నాయకత్వం వహించారు. 1946-47లో దేశ విభజన సంప్రదింపులలోనూ వారే సూత్రధారులు. 1936 ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయమే సాధించింది. ముస్లింలు అధికంగా వున్న రాష్ట్రాలలో కూడా లీగు ప్రధాన శక్తిగా రాలేకపోవడం సమస్యను కొత్త మలుపు తిప్పింది. అయితే ఆ రాష్ట్రాలలో కాంగ్రెస్ కూడా ప్రభావం చూపలేదు. కనక ఆ ఎన్నికల్లో మతపరమైన అంశాలు ప్రధాన పాత్ర వహించలేదని స్పష్టమవుతుంది. కాని ఆ తర్వాత జిన్నా కాంగ్రెస్ ముస్లింల పట్ల వ్యతిరేకతతోవున్నదంటూ ప్రచారం మొదలెట్టాడు. ఆ ప్రచారం చాలా వేగంగా వ్యాపించింది.

రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంగా కాంగ్రెస్ లీగుల మద్దతు పొందడానికి వైస్రాయి లిన్లిత్ గ్రో గట్టిగా ప్రయత్నం చేశాడు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వారితో సహకరించడానికి జిన్నా సంసిద్ధత వ్యక్తం చేశాడు. ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలంటూ 1940 మార్చి 28న లాహోర్ మహాసభ తీర్మానంలో డిమాండ్ చేసింది. ఆ తీర్మానంలో పాకిస్తాన్ అన్న పదం లేదు. అయితే అంతకు ముందే చౌదరి రహ్మాన్ అలీ అనే ఆయన 1933లోనే పాకిస్తాన్ అన్న పదాన్ని రూపొందించాడు. ఇందుకు గల అవకాశాలపై జిన్నా 1939 లో చర్చలు జరిపాడు. యుద్ధ సన్నాహాలలో సహకారం కంటే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా లీగును ఉపయోగించుకోవడానికి గల అవకాశమే బ్రిటిష్ వారిని ఆకట్టుకున్నది. వారిచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని లీగు 1942-45 మధ్య బాగా నిలదొక్కుకుంది. 1945 మే6వ తేదీన యుద్ధం ముగిసింది. తర్వాత పదినెలల కాలంలో లీగు బాగా పుంజుకోవడానికి బ్రిటిష్ వారు సహకరించారు. ముస్లింల తరపున మాట్లాడే ప్రతినిధులను నియమించే హక్కు జిన్నాకు ధారాదత్తం చేశారు. తర్వాత జరిగిన ఎన్నికలలో ఆయన నాయకత్వం బాగా బలపడింది. 1937లో దేశంలోని ముస్లిం ఓట్లలో 4.8శాతం ఓట్లు లీగుకు వస్తే 1946 నాటికి ఇది 76 శాతానికి పెరిగింది. తర్వాతి కాలంలో పాకిస్తాన్ డిమాండు బాగా బలపడ్డానికి ప్రాతిపదిక వేసిన ఈ పరిణామాలను రచయిత 5,6,7అధ్యాయాలలో చర్చించారు.

ఎనిమిదవ అధ్యాయంలో దేశ విభజనకు ముందస్తుగా 1946 లో భారత దేశం వచ్చిన బ్రిటిష్ క్యాబినెట్ మిషన్ పాత్రను పరిశీలించారు. దానితో జరిపిన సంప్రదింపులలో కాంగ్రెస్,లీగు,బ్రిటిష్ ప్రభుత్వం వేర్వేరు ప్రయోజనాలు కలిగివున్నాయి. లీగుకు దేశ విభజన అవసరం. బ్రిటిష్ వారికి నిష్క్రమణ తర్వాత కూడా తమ వ్యూహాత్మక ప్రయోజనాలు కాపాడుకోవడం ముఖ్యం. ఇక కాంగ్రెస్ అందరికీ తానే ప్రాతినిధ్యం అంటున్నందున విభజనకు అంగీకరించదు. స్వాతంత్ర్యానికి ముందు ఏర్పడే రాజ్యాంగ పరిషత్తు పాత్రపైనా చాలా తర్జన భర్జనలు జరిగాయి.

ఈ నేపథ్యంలో జిన్నా 1946 ఆగష్టు 16న ప్రత్యక్ష కార్యాచరణకు పిలుపునిచ్చాడు. అల్లా పేరుతో డ్యాన్ పత్రికలో అడ్వర్టయిజ్‌మెంట్లు వచ్చాయి. మత ఘర్షణలు ప్రజ్వరిల్లే ప్రమాదం వున్నా బ్రిటిష్ వారు గాని, ముస్లిం లీగు ప్రభుత్వాలు గాని ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. కలకత్తాలోనే పది వేలమంది చనిపోయారు. ఈ సమస్య చాలా ఎక్కువగా వున్న నాటి బెంగాల్‌లో బ్రిటిష్ గవర్నర్ కూడా అనేక ఆరోపణలకు గురైనాడు. వీటన్నిటి మధ్య సెప్టెంబరు 2న తాత్కాలిక ప్రభుత్వ ప్రారంభం జరిగింది. ఇందులో ముస్లింలీగును చేర్చుకోవడంపైనా వివాదం నడిచింది. చివరకు జిన్నా అందుకు అంగీకరించాడు. ఈ కాలమంతటా కాంగ్రెస్ వ్యూహాత్మక గందరగోళంలో వుండగా బ్రిటిష్ వారు మాత్రం ఏకపక్షంగా జిన్నాను లీగును ముందుకు నెడుతూ వచ్చారు. మే 16న లీగుతో జరిపిన చర్చలలో వారి మధ్య ఒక అవగాహన కూడా కుదిరింది. కాని దాన్ని చాలా కాలం తర్వాత గాని కాంగ్రెస్‌కు తెలియజేయలేదు. 1948 జూన్ 30 లోగా ఇండియా నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు ఆ ఏడాది ఫిబ్రవరి 20న బ్రిటిష్ వారు ప్రకటించారు. ఒక విధంగా దేశ విభజనను వేగవంతం చేసేందుకు, జరిగే పరిణామంలో తమ బాధ్యత లేదని చెప్పుకోవడానికి వ్యూహాత్మకంగానే వారు ఈ ప్రకటన చేశారు. కాని వాస్తవంలో మత కలహాలు మరోవైపునుంచి దావానలంలా వ్యాపిస్తున్నాయి. దేశమంతా కల్లోలితమైంది. కాంగ్రెస్ నాయకత్వం 1947 ఏప్రిల్‌నాటికి విభజనతో రాజీ పడింది. మే చివరకు అందరూ అందుకు సిద్ధమైనారు. జిన్నా పట్టుదలలో ఏ మాత్రం మార్పురాలేదు. ఆఖరి గవర్నర్ జనరల్ మౌంట్ బాటెన్ తన జ్ఞాపకాలలో ఆయనను గురించి ఇలా రాశాడు. "ఒక మానసికోన్మాద వ్యక్తి. నిజానికి పాలనాజ్ఞానం,బాధ్యతాయుత దృష్టి బొత్తిగా లేని ఒక మనిషి అంత వున్నత స్థానానికి రాగలడని ఆయనను కలుసుకుని వుండకపోతే నేను నమ్మేవాణ్ని కాదు"

1947 జూన్ 3న మౌంట్ బాటెన్ ఆగష్టు 15న అధికార మార్పిడి చేయనున్నట్టు ప్రకటించాడు. ఈ లోగా లీగు ఆధిక్యతలోని రాష్ట్రాల శాసనసభలు విభజన కోరుతూ తీర్మానాలు చేశాయి. భారతీయుల మనోభీష్టం ప్రకారమే తాము ఈ పని చేసినట్టు మౌంట్‌బాటెన్ చెప్పుకోవడానికి అవకాశం లభించింది. వాస్తవంలో విభజించు వైదొలుగు అన్న బ్రిటిష్ వారి సూత్రమే దేశ ఈ విభజన కు మూల కారణమైంది. తర్వాతి మారణ హోమం వగైరాలు ప్రపంచమంతటికీ తెలిసినవే.

అనితా ఇందర్ సింగ్. చివరకు ఇలా ముగించారు "ముస్లిం మెజారిటీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ సంస్థాగతంగా వెనకబడటాన్ని బట్టి చూస్తే ఒక లౌకిక పార్టీ విజయానికి అన్ని మతాల ప్రజల మద్దతు కీలకమని విదితమైంది. మతతత్వ శక్తులను రాజకీయంగా సైద్ధాంతికంగా ఓడించకపోవడం వల్ల స్వాతంత్ర్యం కోసం 1947లో భారత దేశం భారీ మూల్యం చెల్లించవలసి వచ్చింది. 21వ శతాబ్దిలో భారత దేశం ఈ మూల్యం చెల్లించకుండా వుండాలంటే అది తన లౌకికపునాదిని పటిష్టం చేసుకోవాలి. మతతత్వ శక్తులను శాశ్వతంగా తిప్పికొట్టాలి."

బ్రిటిష్ వారి ప్రయోజనాలు, భారత దేశంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రయోజనాలు కలగలిసి పోయి దేశ విభజనకు దారి తీసిన తీరును పుస్తక రచయిత ప్రొఫెసర్ అనితా ఇందర్ సింగ్ విదేశాంగ విషయాలలో నిపుణులు. చాలా సూటిగా సంక్షిప్తంగా వివరించిన తీరు ఆకట్టుకుంటుంది. తెలకపల్లి రవి అనువదించగా నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది.

భారతదేశ విభజన
రచయిత: అనితా ఇందర్ సింగ్
అనువాదం: తెలకపల్లి రవి
వెల: 45/-,
పేజీలు: 107,
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

వస్తువులేవి?

హాయ్! ఇక్కడ మొసలి మాత్రమే కనిపిస్తోంది కదూ. కానీ మరికొన్ని వస్తువులు కూడా ఇక్కడ దాగున్నాయి. ఆ వస్తువులేంటంటే...
దువ్వెన, స్పూను, చాకు, తెరిచిన పుస్తకం, చిక్కుడు గింజల గొలుసు.
మరి గుర్తించి సున్నా చుట్టండే.



అవేంటో!

ఫ్రెండ్స్! ఇక్కడ బోలెడు అక్షరాలు కనిపిస్తున్నాయిగా. వీటి కిందే కొన్ని బొమ్మలు కూడా వున్నాయి. అయితే ఆ బొమ్మలు కొన్ని జబ్బులతో బాధపడేవారివి. ఆ జబ్బుల పేర్లన్నీ ఇంగ్లీషులో కిందున్నబాక్సులో అడ్డంగా, నిలువుగా ఎలాగైనా వుండొచ్చు. అవేంటో చెప్పగలరా?

s	h	e	a	d	a	c	h	e	e	g
c	r	c	e	d	s	o	p	e	n	d
i	e	a	n	h	b	u	m	p	o	r
s	s	b	c	h	a	g	r	g	t	f
s	t	o	m	a	c	h	a	c	h	e
p	n	f	l	l	k	q	p	v	b	v
o	o	t	o	o	t	h	a	c	h	e
t	r	l	i	x	r	i	p	l	o	r
s	o	r	e	t	h	r	o	a	t	w
s	r	r	u	n	n	y	n	o	s	e



జవాబు : headache,cough,stomachache, runny nose,toothache,feaver,



ఖడ్గమెక్కడ?

నేస్తాలూ! పెద్ద ఫిరంగి దగ్గర ఒక సైనికుడు నించొని ఉన్నాడు కదా. అయితే అతని దగ్గర ఒక పెద్ద కత్తి ఉంది. అదెక్కడుందో చెప్పగలరా.



పక్షులెన్ని?

పిల్లలూ... పైనున్న బొమ్మకు రంగులు వేసి చూస్తే మీకు అక్కడ పక్షులెన్ని ఉన్నాయో తెలుస్తుంది.



దారి కనిపెడదాం

కిందున్న రాకుమారి కోటలోకి వెళ్లడానికి దారి తెలియడంలేదట. మనం సాయం చేస్తే త్వరగా తన ఇంటికి వెళ్తానంటోంది. మరి సాయం చేసేద్దామా!

తేడాలేంటో!

పిడుగులూ! చూడ్డానికి రెండు బొమ్మలూ ఒకేలా ఉన్నా వీటి మధ్యలో ఆరు తేడాలున్నాయి. అవేంటో చెప్పగలరా.







బొమ్మలు నేర్చుకుందాం

చిత్రంలో విచిత్రం

ఇక్కడ మొత్తం ఎన్ని తోడేళ్లు కనిపిస్తున్నాయో చెప్పండి.

షెడ్యూల్డ్ తెగల సంక్షేమంతో నూతన అధ్యాయానికి నాంది!

చిత్తశుద్ధి... లక్ష్యసిద్ధి... రెండు కళ్ళుగా సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ఎన్నెన్నో ప్రణాళికలతో దేశంలోనే అన్ని రాష్ట్రాలకన్నా ముందుకు దూసుకెడుతూ సంక్షేమ రాజ్యానికి చిరునామాగా ఆదర్శ రాష్ట్రానికి అసలు ఉదాహరణగా ఎదిగింది మన రాష్ట్రం. ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి నిరంతర శ్రమ ఫలితంగా ఓ సుందర స్వప్నం అక్షరాలా నిజంగా సాక్షాత్కరించిన క్షణాలు ఇవి. సాంఘిక సంక్షేమ కోణం నుంచి రాష్ట్ర ప్రగతిని పరిశీలించినపుడు ఈ విజయాల వెనుక ఉన్న ప్రభుత్వ కృషి ప్రతి ఘట్టంలో కనపడుతుంది.

గిరిజన సంక్షేమం

మన రాష్ట్రంలో 50.24 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. జనాభాలో వీరిది ఆరు శాతం. ఈ 50 లక్షల మందిలో 30.47 లక్షల మంది నోటిఫైడ్ గిరిజన ప్రాంతాల్లోను, 19.53 లక్షల మంది మైదాన ప్రాంతాల్లోనూ నివసిస్తున్నారు. 2004 నుంచి సమగ్ర గిరిజనాభివృద్ధి ప్రణాళికలకు, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, గృహనిర్మాణ కార్యక్రమాలకు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రూ.5402.56 కోట్లు ఖర్చు చేసింది. 2008-09లో అదనంగా 812.80 కోట్లు కేటాయించింది.రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఉప ప్రణాళికలను అమలు చేస్తోంది. ఐదవ పంచవర్ష ప్రణాళికలో ప్రవేశపెట్టిన గిరిజన ఉప ప్రణాళిక రెండు దీర్ఘకాలిక లక్ష్యాలు కలిగి ఉంది. అవి - గిరిజనుల సామాజిక, ఆర్థికాభివృద్ధి, దోపిడీ నుంచి గిరిజనులకు రక్షణ కల్పించడం. గతంలో 2002-03లో రాష్ట్ర ప్రణాళికా వ్యయంలో గిరిజన ఉప ప్రణాళిక కింద కేవలం 6.11 శాతం ఖర్చు చేయగా 2007-08లో దానిని 8.77 శాతానికి పెంచారు.

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం దిశలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో కొన్ని -

రాష్ట్రంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న 5.84 లక్షల ఎకరాల భూములకు హక్కులు కల్పించే కార్యక్రమాన్ని 2008 లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇలా హక్కులు కల్పించిన భూముల్లో పండ్లతోటలు, కాఫీ, రబ్బరు వంటి వాణిజ్య పంటలను పండించడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహమిస్తుంది. ఈ భూముల సాగుకు విత్తనాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు, బోర్లు, చెరువుల తవ్వకానికి, ట్యాంకుల నిర్మాణానికి నిధులు ఇస్తారు. మహబూబ్‌నగర్ జిల్లా నల్లమల అభయారణ్యంలోని చెంచులను, ఇతర జాతుల గిరిజనులను బయటకి తెచ్చి పునరావాసం కల్పిస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో విద్య

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆహార ఛార్జీలు (డైట్ ఛార్జీలు) 2006-07లో 25 శాతం, 2008-09లో 40 శాతం పెంచారు. హాస్టళ్ళలోని విద్యార్థులకు శుచి, రుచి కలిగిన పోషకాహారాన్ని అందించేందుకు సవివరమైన మార్గదర్శకాలతో ఆదేశాలు జారీ అయ్యాయి. గిరిజన హాస్టళ్ళలోని విద్యార్థులకు వెంటనే కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందే విధంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ద్వారా 2,79,954 మంది విద్యార్థులకు బీమా సదుపాయం కల్పించారు. దీని క్రింద రూ.5 వేల వైద్య బీమా, రూ.15 వేల ప్రమాద బీమా, ఖరీదైన వైద్యం అవసరమైన సందర్భాలకు రూ.50 వేల బీమా ఈ పథకం కింద లభిస్తాయి. ఇప్పటివరకు 4798 మంది గిరిజన విద్యార్థులు ఈ బీమాను వినియోగించుకుంటున్నారు.

గిరిజన ప్రాంతాల్లో 128 ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా, 46 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చి కొత్తగా 1,327 టీచర్ పోస్టులను మంజూరు చేశారు. రూ.27.25 కోట్ల ఖర్చుతో 259 మందికి అదనపు సదుపాయం కల్పించారు. రూ.2.75 కోట్లతో మినీ గురుకులాలకు భవనాలు నిర్మిస్తున్నారు. 507

గిరిజన హాస్టళ్లలో 6,138 పారిశుద్ధ్య యూనిట్లకు రూ.1,227.60 లక్షలు మంజూరయ్యాయి. 260 గురుకుల పాఠశాలల్లో మొత్తం 65,431 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఏజెన్సీలో కాఫీ సాగు

అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో కాఫీ తోటల్లో పండే పంట అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచింది. దీనికి 'అరకు' అనే బ్రాండ్ నేమ్ కూడా వచ్చింది. పదవ ప్రణాళికలో 60 వేల మంది గిరిజనులకు ప్రయోజనం చేకూర్చేందుకు 60 వేల ఎకరాల్లో కాఫీ, ఇతర పంటల సాగుకు రూ.144 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక ఒకదాన్ని రూపొందించారు. ఆరవ ప్రణాళికలో 60 వేల ఎకరాల్లో కాఫీ సాగుకు 25 శాతం కాఫీ బోర్డు, 25 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 50 శాతం లబ్ధిదారుల శ్రమ రూపంలో పెట్టుబడి పెట్టి రూ.148 కోట్ల కాఫీ ప్రాజెక్టును చేపట్టారు.

2,83,882 ఎస్‌టి కుటుంబాలకు రూ.272.89 కోట్లు సహాయం అందించే ఒక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది. దీనివల్ల గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయం, పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం లభిస్తుంది. 9,66,591 మంది గిరిజన మహిళలు 69,737 స్వయం సహాయక బృందాలుగా సంఘటితమై ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటున్నారు. వారిలో 27,245 సంఘాలకు ఆదాయాన్నిచ్చే ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు సామాజిక మదుపు నిధి కింద ఆర్థిక సహాయం అందుతుంది. దీనివల్ల 3,54,183 మంది గిరిజన మహిళలు ప్రయోజనం పొందుతున్నారు.

గడిచిన నాలుగున్నరేళ్ళుగా గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వ అధిక ప్రాధన్యతనిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వైద్య, విద్య, తాగునీటి, రహదారి వంటి సౌకర్యాలతో పాటు గిరిజనుల విశిష్టమైన సంస్కృతి, జీవనశైలిని కాపాడుతూ వారి మనోవికాసానికి, సామాజిక చైతన్యానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంది. మీ సంపూర్ణ సహాయ సహకారాలతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపడతానని హామీ ఇస్తూ... ఎల్లవేళలా మీ అభ్యున్నతిని కోరుకునే...

వై.యస్. రాజశేఖర రెడ్డి



ఆరోగ్య సంక్షేమం

ఆదిమ గిరిజన బృందాల (పిటిజిలు) అభివృద్ధి, సంక్షేమాలకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నది. 2005-06లో శ్రీశైలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన 12 వేల మంది చెంచులకు జనశ్రీ బీమా యోజన కింద రూ.60 లక్షలతో బీమా కల్పించింది. ఈ బీమా ఐదేళ్ళ పాటు వర్తిస్తుంది. ఇలాగే 2006-07, 2007-08 మరియు 2008-09లో సీతంపేట, పార్వతీపురం, కె.ఆర్.పురం, భద్రాచలం, పాడేరు, రంపచోడవరం, ఉట్నూర్, శ్రీశైలం ఏజెన్సీల పరిధిలోని సవర, గదబ, కొండరెడ్డి, కోలం, తోటి, ఖోండ్, చెంచు ఆదిమ గిరిజన బృందాలకు రూ.407.55 లక్షలతో బీమా సదుపాయం కల్పించారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విజయనగరం, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో 244 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 1012 ఉప కేంద్రాలు, 18 డిస్పెన్సరీలు, 32 కమ్యూనిటీ సెంటర్లు ఉన్నాయి. 8,500 మంది కమ్యూనిటీ హెల్త్ కార్యకర్తలు పనిచేస్తున్నారు.

గిరిజన ప్రాంతాల్లో మినీ జలవిద్యుత్ కేంద్రాలను, సౌరశక్తి, బయోగ్యాస్ ఆధారిత సంప్రదాయేతర విద్యుదుత్పత్తి కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

•దేశంలోనే మొట్టమొదటిసారిగా, మన రాష్ట్రంలో గిరిజనులకు భూమిపై హక్కు, 6 లక్షల ఎకరాలకు పైగా మొదటి విడత అటవీ భూముల పంపిణీ •2008-09 సంవత్సరంలో 894.16 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపు. గత నాలుగేళ్ళలో 106% పెరుగుదల •1301 గిరిజన విద్యా సంస్థల్లో 2.92 లక్షల మందికి అందుబాటులో విద్య •2006-07 నుండి 25% మెస్ ఛార్జీలు పెంపు •2008-09లో మరలా 40% మెస్ ఛార్జీలు పెంపు •ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలు 10% పెంపు •2005-06లో 32% మరియు 2008-09లో 30% పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు పెంపు •పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు పొందగోరు గిరిజన విద్యార్థుల తల్లిదండ్రుల యొక్క వార్షిక ఆదాయ పరిమితి రూ.లక్షకు పెంపు •గిరిజన విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉపకార వేతనాల మంజూరు •ఐటిఐ, ఎన్ఐటి, మెడికల్‌తో పాటు ఇతర వృత్తి విద్యా సంస్థలలో ప్రవేశానికి "ప్రతిభ" విద్యా సంస్థలు ఏర్పాటు - దేశంలోనే తొలి ప్రయత్నం •గిరిజన ప్రాంతాలలో 3 మినీ జల విద్యుత్ కేంద్రాలు మంజూరు. నిర్వహణా బాధ్యత స్థానిక గిరిజన మహిళా సంఘాలకే అప్పగింత •గిరిజన ప్రాంతాల్లో రూ.77 కోట్ల నాబార్డ్ ఆర్థిక సహాయంతో 533 కి.మీ. పొడవు గల 92 జాతీయ రహదారి పనులు పూర్తి •సామాజిక భద్రతకు "జనశ్రీ బీమా యోజన", "రాజీవ్ గిరి బాల రక్ష" వంటి పథకాలు అమలు •అటవీ ఉత్పత్తులతో గిరిజన సహకార సంస్థ గత ఏడాది చేసిన వ్యాపారం విలువ రూ.200.20 కోట్లు •గిరిజనుల ఆరోగ్య రక్షణలో ప్రత్యేక శ్రద్ధ - మారుమూల ప్రాంతాలలో కొత్తగా 81 ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు •ఐటిడిఏ పరిధిలో గల చెంచుల అభివృద్ధికి రూ.254 లక్షలతో 806 ఎకరాల భూమి పంపిణీ.

కేక్

కావలసినవి

మైదా - 1గ్లాస్
పంచదార - 1గ్లాస్
వెన్న - 1గ్లాస్
గుడ్డు సొన - 1గ్లాస్
బేకింగ్ పౌడర్ - 1 టీ స్పూను
వెనిల్లా ఎసెన్స్- 1 టీ స్పూను
జీడిపప్పు - 1టేబుల్ స్పూను
బాదంపప్పు - 1టేబుల్ స్పూను
కిస్ మిస్ - 1టేబుల్ స్పూను
చెర్రీస్ - 1టేబుల్ స్పూను
టూటీఫ్రూటీ ముక్కలు - 1టేబుల్ స్పూను

చేసే విధానం

ముందుగా వెన్న, పంచదార ను మిక్సీలో బాగా కలియ దిప్పాలి. తర్వాత అందులోనే గుడ్లుకూడా కొట్టి మళ్లీ మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసుకుని బేకింగ్ పౌడర్ కలిపిన మైదా మెల్లిమెల్లిగా వేస్తూ కలియదిప్పాలి. దీనిలోనే వెనిల్లా ఎసెన్స్, ముక్కలుగా చేసుకున్న పప్పులన్నీ కలుపుకోవాలి. ఒక అల్యూమినియం పాత్రకి నెయ్యి పూసి కొద్దిగా మైదా చల్లుకోవాలి. దానిలో ఈ మిశ్రమాన్ని పోసుకోవాలి. ఒక వెడల్పాటి గిన్నెలో ఇసుక పోసి దానిమీద ఈ గిన్నె పెట్టాలి. సిమ్‌లో స్టౌమీద పెట్టి 45 నిమిషాలు ఉడికించుకోవాలి. నోరూరించే కేక్ రెడీ.

మిక్స్ దాల్ కర్రీ

కావలసినవి

కాబూలీ శనగలు - 50 గ్రాములు
చిన్న శనగలు- 50 గ్రాములు
పెసలు- 50 గ్రాములు
రాజమా- 50 గ్రాములు
బొబ్బర్లు- 50 గ్రాములు
అలసందలు- 50 గ్రాములు
సోయా గింజలు- 50 గ్రాములు
అల్లం, వెల్లుల్లి పేస్ట్ - 1టేబుల్ స్పూను
ఉల్లిపాయలు -2
పచ్చిమిర్చి - 5
గరం మసాలా - 1టేబుల్ స్పూను
టమాటా - 2
బ్లాక్ సాల్ట్ - చిన్నముక్క

చేసే విధానం

గింజలన్నింటినీ రాత్రే నానబెట్టుకుని ఉదయాన్నే ఉడకపెట్టుకోవాలి. స్టవ్ మీద బాండీపెట్టి దానిలో నూనెవేసి ఉల్లిపాయ, పచ్చిమిర్చి, టమాటా పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. అల్లంవెల్లుల్లి పేస్ట్, పసుపు, ఉప్పు, గరం మసాలా, మీగడ వేసి వేయించుకోవాలి. తర్వాత ఉడకబెట్టుకున్న పప్పులన్నీ నీళ్లతో సహా వేసి ఇగరపెట్టుకోవాలి. ఇప్పడు బ్లాక్‌సాల్ట్ దంచుకుని వేయాలి. కొత్తిమీర చల్లుకుని దించుకోవాలి. ఇది పూరీ, చపాతీల్లోకి చాలా రుచిగా ఉంటుంది.

స్ప్రింగ్ రోల్స్

కావలసినవి

స్టఫింగ్‌కి కావలసినవి
క్యారెట్ ముక్కలు - 1 కప్పు
బీన్స్ ముక్కలు - 1 కప్పు
క్యాబేజీ ముక్కలు - 1 కప్పు
సోయాసాస్ - అర టీ స్పూను
అజినమోటో - చిటికెడు
టమాటా సాస్ - 1 టేబుల్ స్పూను
ఉప్పు - తగినంత
మైదా - పావుకేజీ

చేసే విధానం

స్టఫింగ్‌కు

క్యారెట్, బీన్స్, క్యాబేజీని సన్నగా తరిగి ఉంచుకోవాలి. స్టవ్ మీద బాండీ పెట్టి నూనె కాగాక తరిగిన ముక్కలన్నీ వేసి దానిలో ఉప్పు, అజినమోటో, టమాటా సాస్, సోయా సాస్ వేసి మగ్గపెట్టుకుంటే కూర సిద్ధమైనట్టు.

మైదాని చపాతీ ముద్దలాగా చేసుకుని అరగంట నానబెట్టాలి. తర్వాత వల్చగా చపాతీలాగా చేసుకుని ముందుగానే చేసుకున్న కూరని అందులో పెట్టుకుని రెండువైపులా మడుచుకుంటూ రోల్ చేసుకోవాలి. ఇలా అన్నిటినీ సిద్ధం చేసుకున్న తర్వాత కాగుతున్న నూనెలో వేసి బంగారురంగు వచ్చేవరకు వేయించకుకోవాలి. తీసిన వెంటనే చాకుతో క్రాస్‌గా కట్ చేసుకోవాలి. వీటిని టమోటా సాస్‌తో కలిపి తింటే అదురుతుంది.

అరటికాయ పెరుగు పచ్చడి

కావలసినవి

అరటి కాయ - 1
పెరుగు - పావు లీటర్
పచ్చిమిర్చి - 10
కొత్తిమీర - 1పెద్ద కట్ట
అల్లం - చిన్న ముక్క
వెల్లుల్లి - 5 రెబ్బలు
జీలకర్ర - 1టేబుల్ స్పూను
చింతపండు - నిమ్మకాయంత

చేసే విధానం

అరటికాయను రెండుగా కోసుకుని ఉడకపెట్టుకోవాలి. పచ్చిమిర్చిని వేపుకోవాలి. ఇప్పడు పచ్చిమిర్చి, కొత్తిమీర, అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు, చింతపండు వేసి నూరాలి. అందులోనే ఉడకపెట్టిన అరటికాయ కూడా వేసి నూరాలి. తర్వాత మెల్లిగా కొద్దికొద్దిగా పెరుగు వేసుకుంటూ కలియదిప్పకోవాలి. దానిని తిరగమోత వేసుకోవాలి. అంతే... అరటికాయ పెరుగు పచ్చడి రెడీ.

- అరుణ.కె.

అరటికాయ పెరుగు పచ్చడి

స్ప్రింగ్ రోల్స్

కేక్

మిక్స్ దాల్ కర్రీ

ఆరోగ్యం

నలభై అయిదేళ్ల వ్యక్తికి వాంతులు విపరీతంగా అయ్యాయి. రక్తం కూడా పడింది. కంగారుపడి ఆసుపత్రికి వెళ్లాడు. రక్తపోటు పరీక్షించారు. తక్కువగా వుంది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం కూడా బాగా తగ్గింది. 13 ఉండాల్సింది 4 వుంది. అత్యవసరంగా ఎండోస్కోపి చేశారు. బాగా వాంతులు చేసుకోవడం వల్ల ఆహారనాళానికి కడుపుకు మధ్య ఉన్న జంక్షన్ పొర చిరిగిందని ఎండోస్కోప్‌లో తెలిసింది. దీంతోనే రక్తపు వాంతులయ్యాయి. వెంటనే చికిత్స మొదలుపెట్టారు. వారం రోజుల్లో పూర్తిగా కోలుకున్నాడు.

రక్త స్రావం - రకరకాలు

డాక్టర్ జయన్,
కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
మెడిసిటీ హాస్పిటల్స్, హైదరాబాద్.
ఫోన్ : 9000177708.

శరీరంలోని రక్తనాళాల్లోనే రక్తప్రసరణ జరుగుతుంది. బయటికి రాదు. ఏదైనా గాయమైనప్పుడు మాత్రం రక్తం బయటికొస్తుంది. కొన్ని సందర్భాల్లో వ్యాధుల వల్ల రక్తస్రావం అయ్యే అవకాశముంది. నోటి నుంచి, ముక్కు నుంచి, మల ద్వారం నుంచి రక్తస్రావం జరుగుతుంది. ముక్కుకు సంబంధించిన సమస్య వల్ల ముక్కులో నుంచి రక్తస్రావం అవుతుంది.

జీర్ణాశయం (కడుపు), చిన్న పేగు, పెద్ద పేగు నుంచి రక్తస్రావం జరుగుతుంది. ఆహారనాళం, పొట్ట, చిన్న పేగు మొదటి భాగం నుంచి రక్తం లీకైతే రక్తం వాంతుల్లాగా నోట్లోంచి బయటికొస్తుంది. చిన్నపేగు రెండో భాగం, పెద్ద పేగు నుంచి రక్తం లీకైతే మలద్వారం నుంచి రక్తస్రావం అవుతుంది. నోటి ద్వారా, మల ద్వారం నుంచి రక్తం పడుతుంటే సమస్య తీవ్రమైందని భావించాలి. దీన్ని నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి, చికిత్స మొదలుపెట్టాలి.

పొట్ట నుంచి రక్తస్రావానికి కారణం కడుపులో పుండు (అల్సర్). పుండు కడుపులో వుండొచ్చు లేదా చిన్న పేగులో ఉండొచ్చు. అల్సర్ వల్ల కలిగే రక్తస్రావం లేత ఎరుపు, కాఫీ రంగులో వస్తుంది.

డాక్టర్‌ను సంప్రదించకుండా నొప్పి నివారణ బిళ్లలు వేసుకోవడం వల్ల చాలా ప్రమాదం. కొన్నిసార్లు వీటి వల్ల అల్సర్లు వచ్చే అవకాశముంది.

చిన్న పేగు నుంచి రక్తస్రావానికి కారణం రక్తనాళాలు ఉబ్బిపోవడం. కాని పెద్ద పేగు నుంచి రక్తస్రావం అవడానికి కారణం పైల్స్ అని చాలామంది అనుకుంటారు. కానీ ఇందుకు పలు ఇతర కారణాలున్నాయి. మాంసం ముద్ద (పాలిప్స్) పెరగడం, క్యాన్సర్, అల్సరేటివ్ కొలైటిస్, క్షయ, రక్తసరఫరా తక్కువగా ఉండడం వల్ల పేగుల్లో వచ్చే అల్సర్..ఇస్కిమిక్ కొలైటిస్ (మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది వస్తుంది) పెద్దపేగు నుంచి రక్తస్రావం అవుతుంది.

లక్షణాలు

నోట్లో నుంచి రక్తం కారడం, మలంతో పాటు రక్తం పడడం, నడుస్తున్నప్పుడు తల తిరగడం వంటి లక్షణాలుంటే డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రతి రక్తపు వాంతి క్యాన్సర్ కాదు. బాగా క్యాన్సర్ ముదిరినప్పుడు మాత్రమే రక్తపు వాంతులొస్తాయి. శరీరం నుంచి రక్తం కారిందంటే అసాధారణ విషయమని భావించాలి.

కారణాలు

ఆహార నాళం నుంచి రక్తం పడడానికి కారణం ఆల్కహాలు. ఆల్కహాలు ఏ మోతాదులో తీసుకున్నా కాలేయం దెబ్బతింటుంది. ఆహారనాళంలో రక్తనాళాలు ఉబ్బి రక్తపు వాంతులవుతాయి. బాగా ఆల్కహాలు తీసుకోవడం వల్ల పొట్టకు, ఆహారనాళానికి మధ్య ఉన్న జంక్షన్ పొర పగిలి రక్తస్రావం కావొచ్చు. రక్తనాళాలు ఉబ్బి పగిలినప్పుడు కలిగే రక్తస్రావం ప్రాణాంతకమైంది.

రక్తపు వాంతుల వల్ల రోగి డాక్టర్‌ను సంప్రదిస్తే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. నోట్లో నుంచి రక్తపు వాంతులవుతుంటే ఎండోస్కోపి, మలం నుంచి రక్త స్రావమవుతుంటే కొలనోస్కోపి చేస్తారు. వీటి వల్ల 98 శాతం కారణాలను సులువుగా కనుక్కోవచ్చు. 5 నుంచి 10 కేసుల్లో కారణం తెలియకపోవచ్చు. తర్వాత అధునాతనమైన క్యాప్సుల్ ఎండోస్కోపి చేస్తారు. అవసరమైతే సిటి స్కాన్, యాంజియోగ్రామ్ పరీక్షలు చేస్తారు.

ఎండోస్కోప్

ఆహారనాళం, కడుపు, చిన్నపేగు వరకు చూడొచ్చు. ఎండోస్కోప్‌కు కెమెరాను అమరుస్తారు. ఎండోస్కోప్‌ను లోపలికి పంపిచే కొద్దీ లోపలి భాగంలోని దృశ్యాలు టీవీ తెరపై కనిపిస్తాయి. దీని ద్వారా లోపల ఎలా వుంది? పొర చిరిగిందా? అల్సర్ వుందా? అనేది తెలుసుకోవచ్చు.

కొలనోస్కోపి

పెద్దపేగులోని మొత్తం భాగాన్ని దీని ద్వారా చూడొచ్చు. మలద్వారం ద్వారా ఎండోస్కోప్‌ను పంపించడం వల్ల ఈ పరీక్ష చేస్తారు.

నొప్పి వుంటుందా?

రక్తపు వాంతులు రెండు రకాలు. నొప్పితో కూడుకున్నవి, నొప్పి లేనివి. రక్తం పడుతుంది కానీ నొప్పి వుండదు. రక్తనాళాలు ఉబ్బడం వల్ల ఇది జరుగుతుంది. రక్తపు వాంతులైనప్పుడు నొప్పి వుంటే దానికి కారణం అల్సర్.

అల్సర్ ఎలా ఏర్పడుతుంది?

హెలికోబ్యాక్టీరియా పైలోరి బ్యాక్టీరియా వల్ల, డాక్టర్‌ను సంప్రదించకుండా పరగడుపున నొప్పి నివారణ మందులేసుకున్నా అల్సర్ వస్తుంది. అల్సర్ పెద్దగా మారి పగిలి రక్తపు వాంతులవుతాయి. సాధారణంగా పొట్ట యాసిడ్‌ను తయారు చేస్తుంది. నొప్పి నివారణ కోసం తీసుకున్న డైక్లోఫినాక్ అనే టాబ్లెట్ పొట్టలోని పొరను తాకుతుంది. ఈ మందు ప్రభావం వల్ల యాసిడ్ ఉత్పత్తి ఎక్కువై పొర పగులుతుంది. గుండెజబ్బులు పెరగడం వల్ల ఎకోస్ప్రిన్, యాస్ప్రిన్ తీసుకుంటున్నారు. అయితే వీరు గమనించాల్సింది ఏంటంటే... చిన్న సమస్య ఎదురైనా వెంటనే దగ్గర్లోని వైద్యుణ్ణి సంప్రదించాలి.

అట్టమీది కథ

చానళ్ల పరవళ్లు



సంక్రాంతి అంటే పంట కోతకు వచ్చే సమయం. అలాగే చానళ్లకూ ఓ సీజనుంది. అది ఇన్నికల వేళ! 1998లో ఎన్నికల ముందు ఎన్నికల కోసం అని మూడు నెలల చానల్‌గా స్టార్ న్యూస్ మొదలైంది. కానీ మూడు నెలల తర్వాత కూడా అలాగే సాగడం కాదు కదా, మరిన్ని చానళ్లు రావడానికి స్ఫూర్తి కల్గించింది. తెలుగు నాట కూడా 2004 ఎన్నికల ముందు తొలి తెలుగు వార్తా చానళ్లు రెండు మొదలయ్యాయి. అవే ఈ టీవీ-2, టీవీ-9. మరి ఈసారి 2009 ఎన్నికల ముందు ఎనిమిది చానళ్లు వస్తాయా? అనే ప్రశ్నకు ఆశ్చర్యం లేదు. అని జవాబు చెప్పకోవాలి! నిజానికి 2008 సంవత్సరం అంతా కొత్త న్యూస్ చానళ్ల ఊరింపులతో సాగింది. కానీ, నవంబరు పూర్తి అయినా ఏ కొత్త న్యూస్ చానల్ రాలేదు. ఇలాంటి వాతావరణంలో రాబోయే చానళ్లు ఏవి? అన్న ప్రశ్న తప్పక కలుగుతుంది. కనుక మొదట వినబడే న్యూస్ చానళ్ల పేర్లేంటో, అసలా ఆలస్యం ఎందుకో? ఆ చానళ్ల వెనక ఉన్నదెవరో చూద్దామా!

- నాగసూరి వేణుగోపాల్

హైదరాబాదు మీడియా టీవీ(హెచ్‌ఎమ్‌టివి)

టీ చానల్ పేరుతో వస్తుందని ప్రచారం జరిగిన చానల్ తర్వాత పేరు మార్చుకుంది. టీ చానల్ అంటే తెలుగు చానల్ అని ఉద్దేశ్యం. ప్రముఖ సంపాదకుడు కె. రామచంద్రమూర్తి నేతృత్వంలో ప్రారంభమవుతున్న చానల్. కపిల్ చిట్ ఫండ్స్ యాజమాన్యం మరికొంత మంది తెలంగాణా ఎన్ ఆర్ ఐల సహకారంతో ఈ (హెచ్‌ఎమ్‌టివి) వస్తోంది. 2008 జనవరి 2న ఈ చనల్ గురించి ప్రకటన వెలువడింది. త్వరలో అని! ఎంత ఆలస్యం అయినా ఎన్నికల ముందు వస్తుంది అని వినబడుతోంది.

సాక్షి టీవీ

ఇందిర టీవీ పేరుతో వస్తుందని తొలుత వినబడింది. అయితే వారిపత్రిక సాక్షి ఉండటంతో సాక్షిటీవీ పేరుతో వస్తుందని ఇప్పుడు ప్రచారం. ఈనాడు టెలివిజన్‌లాగా సాక్షి టెలివిజన్ అనే పేరుతో రావడం సహజం. కొత్త టెక్నాలజీతో వస్తోందని విడబడుతోంది.

ఐ- న్యూస్

టీవీ 9 నుండి తప్పుకున్న రాజశేఖర్, కొంత మంది ఆర్థిక సహాయంతో వస్తున్న న్యూస్ చానల్. ఆ కొంత మందిలో ఎమ్.ఎన్.ఆర్ కళాశాల యాజమాన్యం కూడా ఉందని తెలుస్తోంది. ఈ న్యూస్ చానల్ ప్రకటన చాలా కాలం క్రిందటే వెలువడింది.

స్టూడియో ఎన్

ఇక్కడ ఎన్ అంటే నార్నె అని తెలుసుకోవాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్న నార్నె గ్రూపు ఈ చానల్‌ను ప్రారంభిస్తోంది. టీవీ -5 ప్రారంభంలో దోహదపడిన శివరామ ప్రసాద్ నేతృత్వంలో స్టూడియో ఎన్ మొదలౌతోంది. ఒకటికి మించి చానళ్లు వస్తాయని తెలుస్తోంది.

జీ 24 గంటలు

జీ సంస్థ వారికి జీతెలుగు అనే చానల్ ఉంది. వారే ఇప్పుడు తెలుగులో 24 వార్తా చానల్‌తో సిద్ధమవుతోంది. శైలేష్ రెడ్డి నేతృత్వంలో జీ ఇరవై నాలుగు గంటలు తయారవుతోంది.

మహా టీవీ

మాజీ సంపాదకుడు ఐ. వెంకట్రావు నేతృత్వంలో మహా టీవీ వస్తోంది. ఆలస్యంగా పేరు వినపడినా పనులు వేగంగా జరుగుతున్నాయని ప్రచారం ఉంది. ఎన్ ఆర్ ఐల పెట్టుబడులతో వస్తోందని తెలుస్తోంది.

ఆసియా నెట్ వర్క్

ఆసియా నెట్ సంస్థ ఇటీవల సితార పేరుతో ఒక చానల్ ప్రారంభించింది. ఈ సంస్థకు స్టార్ టీవీతో ఒప్పందం ఇలీవల కుదిరింది. త్వరలో వీరి వార్తా చానల్ వస్తోంది. పేరు ఏమిటో పూర్తిగా తెలియరావడంలేదు.

ఆంధ్రజ్యోతి న్యూస్

దిన పత్రికల చానళ్లు రావడం కొత్త విషయం కాదు. తొలుత టీ చానల్‌తో ఒప్పందం ఉందని వారి దిన పత్రికలలోనే ప్రకటన వెలువడింది. దీని గురించి వివరాలు తెలియడం లేదు. కానీ త్వరలో ఈ సంస్థ న్యూస్ చానల్ వస్తున్నట్లు తెలుస్తోంది.

ఎనిమిది మాత్రమేనా?

నిజానికి ఈ విషయం గురించి స్పష్టంగా చెప్పడం చాలా కష్టం. భక్తి చానళ్లు మొదలైనపుడు ఆరేడు భక్తి చానళ్లు వస్తాయని ప్రచారం జరిగింది. 2007 ఆగస్టులో సంస్కృతి, భక్తి , 2008 జూన్‌లో ఎస్‌విబిసి (శ్రీ వెంకటేశ్వర భక్తి

తెలుగు వార్తా చానళ్లు	ప్రారంభాలు
ఈ టీవీ-2	28-12-2003
టీవీ-9	9-2-2004
జెమినీ న్యూస్	5-9-2004
ఎన్ టీవీ	30-8-2007
టీవీ-5	2-10-2007

చానెల్) మొదలయ్యాయి. అంతకు మించి మరే చానల్ ప్రారంభంకాలేదు. అందువల్ల ఎన్ని చానళ్లు ఖచ్చితంగా మొదలౌతాయో చెప్పలేని పరిస్థితి ఉంది. అలాగే ప్రారంభాలు ఎందుకు ఆలస్యమౌతున్నాయో బోధపడడంలేదు. ఎవరికి వారు తేదీలు చెబుతున్నారు. కానీ చానళ్లు బయటకు రావడంలేదు.

ఎందుకాలస్యం?

టైమ్స్ ఆఫ్ ఇండియా, డిఎన్ఏ పత్రికలు ప్రారంభం కావాల్సిన అదనపు ఎడిషన్లను వాయిదా వేసుకున్నాయి. ఔట్ లుక్ హిందీ వార పత్రిక మాస పత్రిక అయింది. సకాల్ టైమ్స్ న్యూఢిల్లీ కార్యాలయం మూతవేసింది. సిఎన్‌బిసి చానల్ 80 మందిని తొలగించింది. ఎనిమిది నెలల క్రితం ప్రారంభమైన ఐఎన్ ఎక్స్ టీవీ చానల్ అమ్మకానికి తయారైంది... వంటి వార్తలు వస్తూనే ఉన్నాయి. ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం, సెన్సెక్స్ పతనం వంటివి కారణాలుగా చెబుతున్నారు. ఇది కేవలం భారతదేశానికే కాకుండా ప్రపంచ స్థాయిలో కనబడుతున్న పరిస్థితి. ఇక్కడ మాత్రం ఇదే కారణాలతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందనీ, ఫలితంగా ఉత్సాహం కొరవడిందని చెబుతున్నారు.

వార్తా చానళ్ల వెనుక పార్టీలు

అయినా కూడా వార్తా చానళ్లకు సంబంధించి ప్రచారం ఎందుకుంది? అలాగే ప్రకటనలు చాలా భాగం వినోదాత్మక చానళ్లకు వెళతాయి. ఎందుకంటే వాటిని ఎక్కువమంది చూస్తారు కనుక. మరి వార్తా చానళ్లు ఎందుకు వస్తున్నాయి? ఇది పెద్ద ప్రశ్నే! అయితే దీనికి జవాబు ఎన్నికల ముందే చానళ్లు ఎందుకు వస్తున్నాయనే ప్రశ్న జోడిస్తే కొంత అర్థమౌతుంది. నేరుగా పార్టీల చానళ్లు, పత్రికలు రావడం మనకు కొత్తగా ఉండవచ్చు కానీ కేరళ, తమిళనాడు, బెంగాల్ వంటి చోట్ల పాత విషయమే! సాక్షి పత్రిక వచ్చిన తర్వాత తెలుగు నాట పరిస్థితి పారదర్శకమైంది. దాగుడు మూతలు లేకుండా బాహా బాహీ యుద్ధం తయారైంది. ఈ ఎన్నికలతో కొత్త చానళ్లతో పాటు ఉన్న చానళ్ల పార్టీ వైఖరి బహిర్గతం కావచ్చు. పార్టీలతో సంబంధం లేదనే చెప్పుకున్నా వీక్షకులు నమ్మని పరిస్థితి ఏర్పడవచ్చు.

కుటుంబాలు - చానళ్లు

మీడియా సంస్థల ఆధిపత్యం కుటుంబాలకు ఉండటం పాత విషయమే! అయితే చానళ్లు కుటుంబాలను కలుపుతాయా? విడదీస్తాయా? అనే ప్రశ్నలకు అవుననే చెప్పాలి. చానళ్లతో కుటుంబ కలహాలు రావడం విడపోవడం అటే సన్ టీవీ - కరుణానిధి - మారన్ కుటుంబాలు గుర్తుకురావచ్చు. డి.ఎం.కె కు దూరమైన సన్ టీవీ జయలలితకు ప్రచారం పెంచిందట. ఇటీవల కరుణానిధి - మారన్ కుటుంబాలు కలిశాయిని వార్త. అంతకు ముందురోజే కరుణానిధి 'కలైంజర్' టీవీ మరో వార్తా చానల్ ను ప్రారంభించింది.

పత్రికలకు చానళ్లు

దేశంలోనే ఒక పత్రికా సంస్థ చానల్ రావడం అనేది ఈనాడుతోనే ప్రారంభం. తర్వాత ఇండియాటుడే, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి పత్రికలు చానళ్లు ప్రారంభించాయి. ఈనాడు వార్తా చానల్ ప్రారంభించగా ఇప్పుడు సాక్షి, ఆంధ్రజ్యోతి పత్రికలు వార్తా చానళ్లతో వస్తున్నాయి. ఇంతకు ముందు వార్త దిన పత్రిక మైకు చానళ్లలో దర్శనమిచ్చేది. ఇప్పుడు కనబడటం లేదు.



తెలుగు వార్తా చానళ్ల తీరు తెన్నులు

ఈ టీవీ తన రెండవ చానల్ అని చాలా కాలం ఊరించింది. కానీ 2003 చివరికి టీవీ9 వస్తోందని ఖరారు అయ్యాక రంగం సిద్ధం చేసుకుని డిసెంబరు 28న ఈ టీవీ వార్తా చానల్ ప్రారంభించింది. ఈనాడు సంస్థకు అప్పటికే తెలుగు దేశం ముద్ర ఉంది. ఎన్నికల ముందు కనుక వార్తా చానల్ తీరు అలాగే సాగింది. టీవీ9 ఎటువంటి ప్రచార ఖర్చులేకుండా, ఇతర మీడియాలో ప్రకటనలు లేకుండా సంచలనం సృష్టించింది. టీవీ9 కి సంచలనమే ఆయువు. విభిన్నంగా సాగినా టిఆర్‌పి (టెలివిజన్ రేటింగ్ పాయింట్)ల దృష్టితోనే, తక్కువ ఖర్చు- ఎక్కువ ప్రకటనలుగా నడవడం టీవీ9 విధానం. ఈ రెండు చానళ్లు మొదలైన తర్వాత జెమిని సంస్థ 2004 సెప్టెంబరులో తన మూడవ చానల్ (అలాగే మూడవ తెలుగు వార్తా చానల్) ను ప్రారంభించింది. తేజ న్యూస్ పేరుతో మొదలై తర్వాత జెమిని న్యూస్‌గా మార్చుకుంది. మరింత ఎక్కువ ఖర్చుతో ఈ చానల్ వెలువడం విశేషం.

ఇలా మూడు చానళ్లు నడుస్తుండగా 2007 ఆగస్టులో ఎన్ టీవీ, అదే సంవత్సరం అక్టోబర్‌లో టీవీ5 మొదలయ్యాయి.ఈ రెండు చానళ్ల ప్రారంభాలు కాస్త సమస్యాత్మకంగా మారాయి. కేబుల్ ఆపరేటర్లు సహకరించకపోవడంతో ఎన్ టీవీ తొలి దశలో ఎక్కువ చోట్ల లభ్యం కాలేదు. టీవీ 5 కి మరో సమస్య ఎదురైంది. చానల్ లోగోకి సంబంధించి చట్టపరమైన అవరోధం కారణంగా మొదటి రెండు మూడు రోజులు ఈ చానల్ ప్రసారాలు ఆగిపోయాయి. పోటీచానళ్ల తెర వెనుక రాజకీయాలే కారణమని తెలుస్తోంది. ఎన్ టీవీ కొత్త ఓబి వ్యాన్లు, టెక్నాలజీతో ముందుకు వచ్చి టీవీ9 బాటలో నడవగా, టీవీ5కు ఈటీవీ2 స్ఫూర్తి. కాస్త క్రమశిక్షణతో పాటు టీవీ5 ఇటీవల తెలుగుదేశం అనుకూల వైఖరితో నడుస్తోందని ప్రచారం ఉంది. ఇందులో కూడా ఈ టీవీ స్ఫూర్తి అనుకోవాలి. మరోవైపు టీవీ9 , ఎన్‌టీవీ కాంగ్రెస్‌కు మొగ్గుచూపుతాయని వినబడటమే కాదు, వార్తా కథనాలలో విశదమౌతోంది. జెమిని న్యూస్ చానళ్లు మూడు ఉన్నా, ఐదు ఉన్నా చివరి స్థానం లోనే సాగుతోంది.

వార్తా చానళ్లంటే కేవలం వార్తలేనా?

అనే ప్రశ్న ఇప్పుడు తరచూ వినపడుతోంది. ప్రస్తుతం వార్తా చానళ్లకూ ఇతర చానళ్లకు తేడా బోధపడడం లేదు. వినోదం, సంచలనం ఉంటేకానీ వీక్షకులు చూడటం లేదని చానళ్లు భావిస్తున్నాయి. గతంలో బిజినెస్ ఇండియా టీవీ, జైన్ టీవీ చానళ్లు వార్తా చానళ్లు నేడు విభిన్న రంగాలకు చెందిన సమాచారం వివరంగా ఇచ్చేవి, ఆ పద్ధతి ఈ టీవీ 2లో కనబడింది. అయితే టీవీ9 పోటీతో మారింది. నేడు వంటలు, సినిమాలు, మహిళలు, యువత, క్రైం, సినిమా అంశాలు వార్తా చానళ్లలో తప్పనిసరి అయ్యాయి. అయితే ఎన్నికల సమయంలో కార్యక్రమాల రూపు, వస్తువు కొద్దిగా మారవచ్చు. అలాగే వార్తా చానళ్ల సంఖ్య పెరిగితే మార్పు ఏమిటి అనే ప్రశ్న ఉండనే ఉంది. 2009 సంవత్సరంలో దేశంలో చానళ్ల సంఖ్య ఏడువందల దాకా పెరగవచ్చనీ, అందులో నాలుగు వందల దాకా వార్తా చానళ్లు ఉండవచ్చని ఒక అంచనా!

వదంతుల వీర విహారం?

సినిమా తారల తర్వాత ఎక్కువ వదంతులు ప్రచారంలో ఉండేది మీడియా రంగంలోనే అంటే ఆశ్చర్యం లేదేమో! టీవీ9ను, సాక్షి తీసుకుంటోందని, అలాగే ఎన్ టీవీ ని తీసేసుకుందని ప్రచారం ఉంది. టీ చానల్ అంటే తెలంగాణా చానల్ అని ముద్ర పడే అవకాశం ఉందని పేరు హెచ్‌ఎమ్ టీవీగా మారిందని కూడా వినబడింది. ఏ జర్నలిస్టు ఏ చానల్ నుండి ఎక్కడికి వెడుతున్నాడో ప్రచారం బాగా ఉంటుంది.

విమర్శల వెల్లువ?

ఇటీవల ముంబైలో తీవ్రవాదుల దాడి సమయంలో చానళ్లు విమర్శలకు గురయ్యాయి. అదేపనిగా, తామే ముందటూ చాలా ప్రచారం చేసుకున్నాయి. స్టింగ్ ఆపరేషన్ సంబంధించి చాలా సార్లు ఖండనలు ఎదురయ్యాయి. ఒంగోలు కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యా ప్రయత్నం, రాజాంలో విద్యార్థి తల్లి ఆత్మహత్య, చనిపోని ఎమ్మెల్సీ చనిపోయినట్లు ప్రకటించటం వంటివి. తెలుగు నాట కూడా ఇంకా చాలా ఉదంతాలు ఉన్నాయి. స్వయం నియంత్రణ అని కొంత కాలం చర్చ జరిగింది. ఇప్పుడు ప్రయివేటు వార్తా చానళ్లు అసోసియేషన్‌గా ఏర్పడి నియమాలు ఏర్పరచుకోవాలనే ప్రయత్నం మొదలైంది.

ఏది ఏమైనా వార్తలంటే వినోదాల పంటే! తెలుగునాట దానికి కొదవ లేదు, ఉండబోదు!! అలాగే అంతర్గతంగా రాజకీయాల సమరమే!!! వెరసి వాణిజ్య ఫలాలే!!

ఇతర భాషల్లో వార్తలు, చానళ్లు

టీవీ-5 మెట్రో న్యూస్ అంటూ ఉదయం 8గంటలకు 10 నిమిషాల వ్యవధితో ఆంగ్లంలో ప్రారంభించింది. తర్వాత అరగంటకు పెంచింది. విస్సాటీవీ రాత్రి 9:30 నిమిషాలకు ఒక అరగంట ఇంగ్లీషు వార్తలు ఇస్తోంది. ముందుముందు హెచ్ ఎమ్ టీవీ, సాక్షి టీవీ ఈ బాటలో నడువ వచ్చని చెబుతున్నారు. ఇంగ్లీషుతో పాటు ఉర్దూలో కూడా వార్తలు ఇవ్వవచ్చు. అలాగే స్టూడియో ఎన్, టీవీ-9 సంస్థలు త్వరలో ఇంగ్లీషు చానళ్లు ప్రారంభించవచ్చు.

చానళ్ల అధిపతులుగా ఎడిటర్లు

తెలుగులో కె. రామచంద్రమూర్తి నేతృత్వంలో వార్తా చానల్ ప్రయత్నం ఒక కొత్త మలుపు. అంత వరకు పత్రికా జర్నలిస్టు పైస్థాయిలో చానల్‌లో దిగలేదు. తర్వాత ఐ.వెంకట్రావు ప్రయత్నాలు ప్రారంభించారు. ఫలితంగా హెచ్ ఎమ్ టీవీ, మహాటీవీలు వస్తున్నాయి. దేవీప్రియ, శ్రీరమణ వంటి ప్రముఖ పాత్రికేయులు సైతం ఈ చానళ్లలో చేరడం విశేషం.

యాంకర్లే నాయకులా?

టీవీ ప్రచారంలో రాజకీయాలలోకి దిగవచ్చనే అభిప్రాయం జర్నలిస్టులలో ఉంది. ఈసారి ఎన్నికలలో ఎక్కువమంది రంగంలోకి దిగవచ్చని అంటున్నారు. ఈటీవీలో కరెంట్ అఫైర్స్ యాంకర్లు రాజకీయ నాయకులు అవుతున్నారు. తొలుత విద్యాసాగరరావు ప్రతిధ్వని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన బిజెపి నాయకుడు. తర్వాత జయ ప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా పార్టీ పెట్టాడు. పిమ్మట వరకాల ప్రభాకర్ ప్రజారాజ్యంలో చేరాడు. మరి తర్వాతి యాంకర్ ఏ పార్టీలో చేరుతారో?



జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది,
9848994240

నష్టపరిహారం పొందవచ్చా!

ప్లీడర్ గారికి మా విన్నపం ఏమనగా... మేము కాటన్ (పత్తి) పంట వేశాం. పేరున్న కంపెనీ విత్తనాలు వాడాం. మొక్క వృక్షంలా పెరిగింది కానీ పూలు, కాయలు సరిగా రాలేదు. దీంతో మాకు ఎకరాకు 30వేల వరకు నష్టం వాటిల్లింది. మేం కోర్టుకెళ్లవచ్చా? అది ఎలా నిరూపించుకోవాలి. ఏ కోర్టుకెళ్లాలో తెలుపగలరు. మేం నష్ట పరిహారం పొందగలమా లేదా?

నారాయణరెడ్డి, గుంటూరు.

మీరు వెంటనే వ్యవసాయాధికారులను కలవండి. మీరు కొన్న బిల్లులు వగైరా పత్రాలు దగ్గర ఉంచుకోండి. వారు వచ్చి తనిఖీ చేసి మీ సాగు లోపమా? లేక విత్తన లోపమా అనేది రిపోర్టు ఇస్తారు. మీరు కొన్న దుకాణ దారునకు, కంపెనీ వారికి నోటీసులు ఇవ్వండి. కేసు వెంటనే వేసి అడ్వకేట్ కమీషనర్‌ని కూడా అపాయింటు చేసుకోండి. చేను పరిశీలించి రిపోర్టు కోర్టువారికి విన్నవించటం జరుగుతుంది. మీరు న్యాయవాదిని సంప్రదించండి. మీ కేసు కంజ్యూమర్ కోర్టు (వినియోగ దారుల) నందు వేయవలసి ఉంటుంది. చేను మీద పిచికారీ చేసిన మందుల బిల్లులు, పిండి వగైరా బిల్లులు ఎంత ఖర్చు చేసింది తెలుపుతూ, పంట పండితే మీకు వచ్చే లాభాన్ని, ఎంత నష్ట పోయిందీ వివరించండి. మీరు నష్ట పరిహారం పొందగలుగుతారు.

విడాకులిచ్చేస్తే ఎలా బతకాలి?

లాయర్ సాబ్ గారికి నమస్తే.నా భర్తకు ముగ్గురు భార్యలు. వారి తర్వాత నాల్గవ భార్యగా నన్ను నిఖా చేసుకున్నాడు. ప్రస్తుతం నాకు ఇద్దరు పిల్లలు(పాప, బాబు). అతను ఇప్పుడు గల్ఫ్‌లో ఉంటాడు. ఎప్పుడూ గల్ఫ్‌లోనే ఉంటాడు. అక్కడే వ్యాపారం చేస్తాడు. నన్ను వెళ్లగొట్టి ఇప్పుడు ఇంకో అమ్మాయిని నిఖా చేసుకున్నాడు. నన్ను అక్కడే బంధించి ఇక్కడ బాజీ దగ్గర తలాక్ చేయించాడు.నేను గల్ఫ్ నుండి వచ్చిన రెండోరోజే నాకు నోటీస్ వచ్చింది. నేను సమ్మతించకుండానే విడాకులు వచ్చాయి. టైలరింగ్‌చేస్తూ నా పిల్లలను చదివిస్తున్నాను. తండ్రి గల్ఫ్‌లో వ్యాపారం చేస్తున్నా వీరు మాత్రం గరీబుల్లాగా బతకవలసి వస్తోంది. మళ్లీ ఇప్పుడు నా పిల్లలను తన వద్దకే పంపించమని వత్తిడి చేస్తున్నాడు. ఈ పరిస్థితిలో నాకు ఎటువంటి న్యాయం జరుగుతుందో తెలుపగలరు.

ఓ సోదరి, హైదరాబాద్.

మీరు మీ భర్తకు నాల్గో భార్యగానే వెళ్లారు. అతడి గురించి పూర్తి సమాచారం పొందాక పెళ్లి చేసుకోవలసింది. మీరు అతనికి దూరంగా ఉంటున్నారు కాబట్టి అతను గల్ఫ్‌లో వ్యాపారం చేస్తున్నాడు కనుక అతని వ్యాపార రాబడికి తగినట్టు మీరు మనోవర్తి కేసు దాఖలు చేయవచ్చు. అలా మీరు అతని ఆదాయాన్ని బట్టి నెలకు 10.15 వేలు పొందగలుగుతారు. పిల్లలను ఒక వయసు వచ్చే వరకు మీ దగ్గరే ఉంచుతారు. పిల్లలకు 12 సంవత్సరాల వయసు దాటితే వారిష్ట ప్రకారం వారు ఎక్కడ ఉంటానంటే అక్కడే ఉంచుతారు. బలవంతంగా పిల్లలను తీసుకుపోయే హక్కు అతనికి లేదు. ఏది జరిగినా కోర్టు ఉత్తర్వుల ప్రకారం మాత్రమే జరుగుతుంది. మీరు న్యాయవాదిని గానీ, స్త్రీ, శిశు సంక్షేమ అధికారినిగానీ సంప్రదించండి. ఫలితముంటుంది. న్యాయం జరుగుతుంది.

వారిద్దరూ కలిసేదెలా!

మా క్లాస్‌మేట్స్ ఇంటర్ చదువుతున్నారు. సెకండియర్‌లో ప్రేమలో పడ్డారు. పెద్దలు వద్దంటారనే భయంతో మేమే ఓ పదిమంది మధ్య గుడిలో పెళ్లి చేశాం. పూజారి గారికి వారిద్దరూ మేజర్లనే చెప్పడం జరిగింది. కాని ఇరువురు కూడా మైనర్లే. 18 సంవత్సరాలు నిండలేదు. ఇప్పుడు ఆ పెళ్లి విషయం పేరెంట్స్‌కు తెలిపి అమ్మాయిని చదువు మాన్పించారు. బయటికి కూడా రానీయట్లేదు. హోమ్ అరెస్టు చేశారు. ఆవిడను కలిసేదేలా? వాళ్ల బంధం విడిపోయినట్లేనా? న్యాయం జరగదా తెల్పగలరు?

సుధాకర్, ఒంగోలు.

తమ్ముడూ! ఏ వయసులో ముచ్చట ఆ వయసులోనే ఉండాలి. చదువుకునే వయస్సులో పెండ్లి అని పెద్ద విషయాల జోలికెళితే కెరీర్ ఏమైపోతుంది. అమ్మాయి తల్లిదండ్రులకే కాదు! అబ్బాయి అమ్మానాన్నలకూ అది నచ్చని విషయం కాదా! ఆ వయస్సు బాల్యానికి పెద్దది. యవ్వనానికి తక్కువది. ఆ వయస్సు మరీ డేంజర్. దేనికయినా తెలుస్తుంది. అందుకే ప్రతీచోట జరుగుతుంది. మీ ఊళ్లోకూడా ఇలాంటివి జరిగి, పెద్దలు కాదన్నారని, హత్యలు, ఆత్మహత్యలుకైనా దారి తీస్తుంది. అమ్మాయికి ఇష్టం ఉందంటే మైనారిటీ తీరాక కాపురానికి తీసుకెళ్లవచ్చు. అదీ కాదంటే నిజంగా బలవంతం చేస్తున్నారని అనుకుంటే హైకోర్టులో కేసువేసి జడ్జీగారి వద్ద ప్రవేశపెట్టడంతో పభుత్వ వసతి గృహంలో ఉంచుతారు. ఎందుకైనా కొద్దిరోజుల ఆగి మెజారిటీ వచ్చాక ఏమైనా ప్రయత్నించండి. ముందు చదువుమీద శ్రద్ధ పెట్టండి. ✠



చూద్దామా

మాక్‌నాక్ ద్వీపం



సహజ ఉద్యానవనాల్లో నేషనల్ స్టేట్ పార్క్ ఒకటని నేషనల్ జియోగ్రాఫిక్ వాళ్లు నిర్ధారించారు. ఇక్కడ 80శాతం వరకు ఉద్యానవనాలే. అనేక రకాల మొక్కలు, చెట్లు, పక్షులతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. యంత్రాలతో నడిచే వాహనాలు నిషేధం. గ్యాస్‌తో కానీ, పెట్రోల్‌తో కానీ నడిపే వాహనాలుండవు. హైదరాబాదు నుండి వెళ్లేవారికైతే అది ఒక భూతల స్వర్గమనిపిస్తుంది. 1898నుండి యాంత్రిక వాహనాలు నిషేధమట. గుర్రపు బగ్గీలు, సైకిళ్లు, లేదా పాదయాత్రలు.. ఎంత బాగుంటుందో కదా! వాతావరణ కాలుష్యం అస్సలుండదు.

ముక్తవరం వసంత కుమారి

ఉత్తర అమెరికాలోని మిషిగన్ రాష్ట్రంలో మాక్‌నాక్ ఐలాండ్ ఒక చిన్న ద్వీపం. ఈ ద్వీపం సహజ ఉద్యానవనాలతో నిండి ఉంటుంది. ఈ ఐలాండ్‌ను యూరోపియన్లు ఆక్రమించకముందు నేటివ్ అమెరికన్లు నివసించేవారు. దీని వైశాల్యం 3.8 చదరపు మైళ్లు(9.8 కిలో మీటర్లు). అయితే ఇక్కడి జనాభా ఎంతో చెప్తే ఆశ్చర్యపోతారు. 2000 సంవత్సరపు జనాభా లెక్కల ప్రకారం 523 (మన హైదరాబాదులో 10 అపార్టుమెంట్లలోని జనాభా అంత). వేసవిలో మాత్రం సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రతిరోజూ 15,000 మంది సందర్శకులు వచ్చి వెళ్తుంటారట. అందుకే ఈ ద్వీపం వేసవి విడిదికి నిలయమైంది. మాక్‌నాక్ ఐలాండ్‌లో 80 శాతం వరకు మాక్‌నాక్ ఐలాండ్ స్టేట్ పార్క్‌తో నిండివుంది (ఫోర్ట్ మాక్‌నాక్‌తో కలిపి). ఈ ఐలాండ్‌ను దర్శించిన ప్రముఖుల్లో అమెరికా సాహిత్య పితామహుడైన మార్క్ ట్వెయిన్, అమెరికా అధ్యక్షులు ఉన్నారు.

ద్వీపం అంటే చుట్టూ నీళ్లు. పడవ మీద ప్రయాణం. మిషిగన్ రాష్ట్రంలో వున్న మిషిగన్ సరస్సు తీర ప్రాంతంలో క్యాంపింగ్ (వనభోజనాలు అనొచ్చు మన భాషలో)కు అనువుగా వుంటుంది. మేం పిల్లలతో సరదాగా కారులో వెళ్లే ఏర్పాటు చేసుకున్నాం.

మొదట క్యాంపింగ్‌కు కావలసిన వస్తువులు, టెంట్, బార్ బెక్యూ(bar-b-q) బొగ్గులు కానీ, గ్యాసుతో గానీ వెలిగించే పొయ్యి (ఒక సూట్‌కేస్‌లాగా ఉంటుంది). గ్రిల్ చేయటానికి ఇనుప చువ్వలు, మొక్కజొన్న కంకులు తీసుకెళ్లాం. ఎయిర్ బెడ్, లైటర్ ఇవన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. టార్చ్‌లైట్, దోమలు కుట్టకుండా క్రీం లాంటివి, ఒక ఐస్ బాక్సులో కూల్‌డ్రింక్స్ అన్నీ ప్యాక్ చేసుకుని షికాగో నుండి ఉదయం 8 గంటలకు బయలుదేరాం. మధ్య మధ్యలో బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ, గ్యాస్ స్టేషన్లో గ్యాస్ నింపుకుంటూ ప్రయాణించాం. ఆ గ్యాస్ స్టేషన్లలో రెస్ట్ రూం (బాత్‌రూమ్) లుంటాయి. తినడాటానికి, అరటి పళ్లు, కాఫీ లాంటివి తీసుకెళ్లడంతో అంతా సాఫీగా సాగింది.

సాయంకాలం 6 గంటలకు అక్కడికి చేరుకున్నాం. మిషిగన్ సరస్సులో సూర్యాస్తమయం, సాయంసంధ్య ఆకాశంలో సూర్య కాంతులు చూస్తూ ఇసుక దిబ్బలో కూర్చుండిపోయాం. ఫారెస్టు డిపార్ట్‌మెంట్ వాళ్లు ఏర్పాటు చేసిన క్యాంపింగ్ స్థలానికి వెళ్లి అక్కడ టెంట్ వేసుకున్నాం. ఎయిర్ బెడ్‌లో ఎయిర్ నింపడానికి కావలసిన ఎయిర్ పంప్స్ (ఎలక్ట్రిక్)





సీతాకోక చిలకల పార్కు దగ్గర రచయిత్రి

ఉన్నాయి. ఆ అడవిలో చలి కాచుకోవడానికి కర్రలు కూడా దొరుకుతాయి. గ్రిల్ మీద మొక్కజొన్న కంకులు కాల్చుకుని తిన్నాం. పులిహోర, దద్దోజనం లాంటివి తీసుకెళ్లి తిన్నాం. పక్కనే బీచ్. అద్భుతమైన సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, పక్కనే పెద్ద చెట్లు, చుట్టూ చిన్న చిన్న నీటి కొలనులు, పక్షుల కిలకిలా రావాలు.... అద్భుతంగా ఉందక్కడ.

అమెరికాలోని ఐదు పెద్ద సరస్సులో మిషిగన్ సరస్సు ఒకటి. మిషిగామి అంటే "great water" లేదా "large lake" అని అర్థమట. మిషిగన్ రాష్ట్రం అమెరికాలో అతి పెద్ద రాష్ట్రం. మిషిగన్ సరస్సు నాలుగు రాష్ట్రాలలో (విస్కాన్సిన్, ఇలినాయ్, ఇండియానా మిషిగన్) ప్రవహిస్తున్న పెద్ద సరస్సు.

రెండవ రోజు లేక్ హెరన్‌లో ఫెర్రిలో అరగంట ప్రయాణం చేసి మాక్‌నాక్ ఐలాండ్ చేరుకున్నాం. మిషిగన్ సరస్సు, హురన్ సరస్సు మధ్యన ఈ ద్వీపం ఉంటుంది. మాక్‌నాక్ ద్వీపం ఎగువ, దిగువ పెనున్సులా నగరాల మధ్య ఉంటుంది. ఫెర్రిలో ప్రయాణం చేస్తుంటే మాక్‌నాక్ బ్రిడ్జ్ కనిపిస్తుంది. ఇది ఐదు మైళ్లుంటుంది.

ఈ ద్వీపంలోని పది సహజ ఉద్యానవనాల్లో నేషనల్ స్టేట్ పార్క్ ఒకటని నేషనల్ జియోగ్రాఫిక్ వాళ్లు నిర్ధారించారు. ఇక్కడ 80శాతం వరకు ఉద్యానవనాలే. అనేక రకాల మొక్కలు, చెట్లు, పక్షులతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. యంత్రాలతో నడిచే వాహనాలు నిషేధం. గ్యాస్‌తో కానీ, పెట్రోలుతో కానీ నడిపే వాహనాలుండవు. హైదరాబాదు నుండి వెళ్లేవారికైతే అది ఒక భూతల స్వర్గమనిపిస్తుంది. 1898నుండి యాంత్రిక వాహనాలు నిషేధమట. గుర్రపు బగ్గీలు, సైకిళ్లు, లేదా పాదయాత్రలు.. ఎంత బాగుంటుందో కదా! వాతావరణ కాలుష్యం అస్సలుండదు. రోలర్ స్కేట్స్ కూడా వాడతారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రం మంచు కురుస్తున్నపుడు, చలికాలంలో స్నో మొబైల్స్ వాడతారు. ఫిబ్రవరిలో లేక్ హురన్ మంచు గడ్డగా మారుతుంది. మే జూన్ నుండి మంచు కరగటంతో ప్రయాణికులు సందడి మొదలౌతుంది. ఈ ద్వీపం కూర్మావతారం లో ఉండటం వలన నేటివ్ అమెరికన్ భాషలో "mishimakinal" పిలిచేవారు. ఇంగ్లీషులో పొట్టిగా "మాక్‌నాక్ ఐలాండ్" అని పిలుస్తున్నారు. ఇక్కడ తాత్కాలిక ఉద్యోగులు ఎక్కువ. ఆ ప్రాంతమంతా స్టేట్ హిస్టారిక్ పార్క్ వాళ్ల ఆధీనంలో ఉంటుంది. అక్కడ పది మైళ్ల విస్తీర్ణంలో ఉన్న చూడదగిన ప్రదేశాలకు వెళ్లాలంటే గుర్రపు బగ్గీలే శరణ్యం. ఈ గుర్రాలు 1500 పౌండ్ల వరకు బరువుండి ఎంతో బలిష్టంగా ఉంటాయి. నాలుగైదు ట్రెయిన్ బోగీల్లాంటి వాటిని 4 గుర్రాలు లాగుతాయి. వీటిలో 50, 60మంది కూర్చుంటారు.

అంత చిన్న ద్వీపం మీద కనీసం ఐదు ఆర్ట్ గ్యాలరీలున్నాయి. ఆశ్చర్యమేసింది. ఎండిన ఆకులతో చేసిన కళా రూపాలు, క్విల్ట్ పాచ్ వర్క్ చేసినవి, అనేక రకాల పెయింటింగ్స్ ఉన్నాయి. విక్టోరియా గ్రాండ్ హోటల్లో ఉన్నాయి. ఇక్కడ మరో ఆకర్షణ ఆర్చ్ రాక్, గ్లేషియర్స్ (హిమనీనదాలు, మంచు దిబ్బలు). ఇవి కరిగి సరస్సులేర్పడ్డాయి. భూనిర్మాణ ప్రాథమిక దశలో ఏర్పడిన ఒక శిలా తోరణం (తిరుమల కొండ మీద ఇలాంటిదే ఉంది). ఈ ఆర్చ్ రాక్ మిషిగన్‌లో మాకినాక్ ద్వీపంలో వుంది. ఇది లేక్ హురన్‌కు 145 అడుగుల ఎత్తున ఉంది.

ఈ ద్వీపం మీద మరో ప్రత్యేక ఆకర్షణ వింగ్స్ ఆఫ్ మాకినాక్ ఉద్యానవనం.. తోటలో పూలు.... లెక్కలేనంత మకరందం... దానికోసం వచ్చి వాలే సీతాకోక చిలకలు.... మనకు ప్రకృతిలోని రంగులన్నీ స్వేచ్ఛకు ప్రతీకలైన సీతాకోక చిలకల రంగులే. రెండు కళ్లూ చాలవు చూడటానికి. 1500 సీతాకోక చిలకలకు సంరక్షణగా ఒక పెద్ద గ్లాసుతో నిర్మితమైన ఒక గ్రీన్ హౌస్ నిర్మించారు. అక్కడికి 400 సీతాకోకచిలకలను తీసుకొస్తారు వారానికి. వసంత రుతువు, శిశిరంలో 200 రకాలు జాతుల సీతాకోక చిలకలు ఆయా కాలాల్లో కనిపిస్తుంటాయి. మనకు కొన్ని చుక్కల మకరందాన్ని ఇస్తారు. వేలి మీద రాసుకుంటే చాలు వాలిపోతాయి సీతాకోక చిలకలు. తూనీగా...తూనీగా.. ఎందాకా నీ పయనం... ఇటు రావే అంటూ పాడుకుంటూ హాయిగా ఆనందంతో తేలిపోతాం. ఎంత అందమైన జీవితమైనా లిప్త కాలమే అన్నట్టు వీటి జీవితకాలం కొన్ని రోజులు, నెలలు మాత్రమే. అందుకని ఈ గ్రీన్ హౌస్‌ను శీతాకాలంలో మూసి వేస్తారు.

మాకినాక్ ద్వీపంలో ప్రత్యేక సంప్రదాయకమైన వంట ఫడ్జ్ తినకుండా రాలేం. అమెరికా వాళ్ల ప్రత్యేకమైన కాండీ. పాలు, వెన్న, బెల్లం మొదలైన వస్తువులు వేసి ప్రత్యేకంగా తయారు చేస్తారు మన ముందరే. కోక్ పొడర్ కలిపి చాక్‌లెట్ గా కూడా చేస్తుంటారు.

ఇక్కడ కర్రలతో కట్టిన ఇళ్లు, రాతి కట్టడాలు, భవనాలు కనిపిస్తాయి. ప్రశాంతమైన వాతావరణంతో ఎంతో ఆహ్లాదంగా వుంటుంది.

నవ్వుల్ - పువ్వుల్

తల తిప్పు



రాంబాబు: డాక్టర్! బరువు తగ్గడానికి ఏమైనా సలహా ఇవ్వండి.

డాక్టర్: తల పక్కకు తిప్పుతూ వుండండి

రాంబాబు: డాక్టర్! రోజంతానా!!

డాక్టర్: కాదయ్యా! ఎవరైనా ఏదైనా పెట్టినప్పుడు.

ఫీజు



రోగి: ఏంటి డాక్టర్! మీ ఫీజు నాలుగొందలేకదా, మరేంటి వెయ్యి రూపాయలు రాశారు?

డాక్టర్: ఎందుకా! నువ్వు పెట్టిన కేకలకు ఇద్దరు కొత్త పేషెంట్లు వెళ్లిపోయారు. అందుకని.

-హెచ్. విజయ లక్ష్మి, అనంతపురం.

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

ఫోన్ నెం:9390044031

ఒంటరిగా వుండటమే ఇష్టం

నేను డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నేను ఎవ్వరితోనూ స్వేచ్ఛగా మాట్లాడలేను. అందరికీ దూరంగా, ఒంటరిగా వుండటానికి ఇష్టపడతాను. దానివల్ల ఏదో పోగొట్టుకున్న దానిలా దిగులు, ఆందోళన, విచారం పెరిగిపోతుంటాయి. చదవాలనిపించటంలేదు. పని చేయాలనిపించటంలేదు. నేను ఏం చేయాలి. సలహా ఇవ్వగలరు.

రమ, కందుకూరు.

చాలా మంది టీనేజ్ పిల్లలు బహిర్వర్తనులుగా తమ భావోద్వేగాలను స్వేచ్ఛగా ప్రకటించుకోలేరు. తనమీద తనకు సెల్ఫ్ ఇమేజ్ లేకపోవటం, తమలో ఏదో లోపం ఉందన్న నమ్మకంతో తమను ఎవ్వరూ లక్ష్యపెట్టరని భావిస్తుంటారు. అలాగే చిన్నతనం నుండి తల్లిదండ్రులు తమను ఎక్కడికీ పంపించకపోవడం, ఎవరితోనూ మాట్లాడనీయకపోవటం, ప్రతి కదలికనూ భూతద్దంలో చూడటం వల్ల కూడా ఇలా మారడానికి కారణం అవుతుంది. ముందు మీ కుటుంబసభ్యులతో మనసు విప్పి మాట్లాడు. స్నేహితులు మాట్లాడేటప్పుడు శ్రద్ధగా విను. వ్యక్తిత్వ వికాస సంబంధ పుస్తకాలు, పేపర్లు చదువు. స్నేహితులంతా చదువుకు సంబంధించిన విషయాలను ఎక్కువగా చర్చించండి. కొంతకాలానికి నీ మీద నమ్మకం కలిగి అందరితో చక్కగా మాట్లాడతావు. ఒకసారి కౌన్సిలింగ్ సైకాలజిస్టును కలువు.

ఒకటే భయం

మా చెల్లెలు గత ఆరు నెలల నుండి భయం భయం అంటూ ఎక్కడికీ పోదు. ఏ పనీ చెయ్యదు. పొద్దున 8 గంటలకు ఒక చోట కూర్చుంటుంది. మళ్లీ రాత్రి 8 గంటలకు అన్నం తిని కాసేపు కూర్చుని పడుకుంటుంది. డాక్టర్‌కు చూపిస్తే మందులు ఇచ్చారు. కానీ బలవంతంగా బయటకు తీసుకువస్తే భయం భయం అంటుంది. పడిపోతానంటూ వెంటనే ఇంటికి వచ్చేస్తుంది. మళ్లీ యథా ప్రకారం కూర్చుంటుంది. ఏ పనీ చేయదు. దాని వల్ల ఆమె భవిష్యత్ అగమ్యగోచరంగా ఉంది. ఈ విషయమై తగు సలహాతో కూడిన చికిత్సా విధానం తెలియజేయ ప్రార్థన.

బి.సుమలత, రాజంపేట.

సమాజంలో ఎవరి పనులు వారు చేసుకుపోవడానికి కారణం భయం. అది మనిషిలో తగినంత మాత్రమే ఉంటే చాలా వరకు ఒక ప్రేరణగా వుపయోగపడుతుంది. భయం లేకపోతే ప్రమాదంలో ఇరుక్కునే పరిస్థితి వస్తుంది. ఈ భయం మనిషిలో ఎక్కువైతే అది హానికరంగా పరిణమిస్తుంది. భయం ముసుగులో మనిషి విచక్షణను కోల్పోతాడు. భయానికి హేతుబద్ధత కరువైనప్పుడు ఆ భయం ఫోబియాగా మారి మనిషిని కృంగదీస్తుంది. కుటుంబానికి లేదా తనకు విపత్కరమైన సంఘటన, ప్రమాదం సంభవించటం వల్ల మీ చెల్లిలో ఫోబియా ఏర్పడి ఉండవచ్చు. కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ దగ్గరకు తీసుకువెళితే పూర్తిగా పరీక్షించి సమస్యను



పరిష్కరిస్తారు. ఫోబియాకు బిహేవియర్ థెరపీ, ఎన్‌ఎల్‌పి టెక్నిక్స్, హిప్నోథెరపి ద్వారా చక్కగా పరిష్కరించగలరు. డి సెన్సిటైజేషన్ ప్రక్రియ ద్వారా ఫోబియాను సులువుగా తగ్గించవచ్చు.

ఓసీలైతే ప్రభుత్వ ఉద్యోగం రాదా?

నేను రాజమండ్రిలో గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీలో ఎం.ఎస్.సి ఆర్గానిక్ కెమిస్ట్రీ చేస్తున్నాను. ఒక ఉన్నతమైన గవర్నమెంటు జాబ్‌లో సెటిల్ అవుదామనుకుంటున్నాను. నాకు ఎటువంటి రిజర్వేషన్ లేదు. కానీ స్నేహితులను మరియు ఇతరులను సలహా అడిగినప్పుడు 'నీవు ఒక ఓ.సి విద్యార్థివి, ఎటువంటి గవర్నమెంటు జాబ్స్ రావు' అంటున్నారు. మానాన్నగారు కూడా నేను గవర్నమెంటు జాబ్ చేయటం పట్ల మొగ్గు చూపుతున్నారు. అయితే ఓ.సిలకు గవర్నమెంటు జాబ్ వస్తుందో రాదో అని భయంగా ఉంది. ఏ నిర్ణయం తీసుకోలేని స్థితిలో ఉన్నాను. ప్రస్తుతానికి ఎం.ఎస్.సి చదువుతూ మరోవైపు బ్యాంక్ పోస్ట్‌కి కోచింగ్ తీసుకుంటున్నాను. కానీ నాకు ధైర్యం సరిపోవడంలేదు. దయచేసి నాకు సలహా ఇవ్వగలరు.

వర్మ, జడ్చర్ల.

ఎవరో ఏదో చెప్పారు, అన్నారు అనేది కాదు సమస్య. నీ గురించి నీవు ఏమనుకుంటున్నావు. నువ్వు సమాజం గురించి, జాబ్స్ గురించి ఏం తెలుసుకున్నావో ఒక్కసారి పరిశీలించుకో! టార్గెట్ ఉంటే ఎక్కడైనా రాణించవచ్చు. ఈ రోజుల్లో గవర్నమెంటు జాబ్స్‌లో కన్నా ప్రైవేటు జాబ్స్‌లోనే ఎక్కువ సంపాదించగలుగుతున్నారు. నీ శక్తి ఎంతో, ఏమిటో అక్కడే బాగా తెలుస్తుంది. నీలో చక్కటి పవర్ ఉంది. దానిని ఉపయోగించుకో. ఆర్గానిక్ కెమిస్ట్రీకి మంచి అవకాశాలున్నాయి. నెట్ ఎంట్రన్స్ రాసిన మీకు గవర్నమెంట్ లెక్చరర్‌గా జాబ్స్ వస్తాయి. నువ్వు బ్యాంక్ ఉద్యోగం చెయ్యాలంటే చక్కగా ప్రిపేర్ అవ్వాలి. ముందు భయాన్ని వదిలి చదువు మీద దృష్టి పెట్టాలి. నీ గురించి ఆలోచించగలిగే వ్యక్తివి నువ్వే! విజయం పట్ల పూర్తి ధీమాతో ఉండు.

పేరుతోనే ఇబ్బంది

నాపేరు రాములు. నాపేరు వల్ల నేను చదవలేకపోతున్నాను. కాలేజీలో ఎక్కువసేపు ఉండలేను. కనుక నేను డిగ్రీలో పేరు మార్చుకోవాలనుకుంటున్నాను. సలహా ఇవ్వగలరు.

రాములు, కరీంనగర్.

నిజానికి పేరు వలన పెద్దగా ఇబ్బంది లేదు. దాని గురించే ఆలోచిస్తున్నావంటే రోజులో ఎక్కువ సమయం ఖాళీగా గడుపుతున్నావనిపిస్తోంది. ఇది ఆలోచించవలసినంత పెద్ద విషయమేమీ కాదు. అంతా నువ్వు మేనేజ్ చేసుకోవటంలోనే వుంది. ముందుగా నలుగురు ఫ్రెండ్స్‌కి చెప్పి నిన్ను రాము అని పిలవమను. క్రమంగా అందరికీ అదే అలవాటు అవుతుంది. కాదనుకుంటే పేరు మార్పుకి చట్టప్రకారం పద్ధతులున్నాయి. వీటిని ఎం.ఆర్.ఓ కార్యాలయంలో తెలియజేస్తారు.



న్యూ లుక్‌తో వస్తా

సినిమా కబుర్లు

నా స్నేహితులు చాలామంది దర్శకులు, నటులయ్యారు. సక్సెస్ అయినా ... నేను ఏ రోజూ వాళ్ళ దగ్గరకు వెళ్ళ లేదు. స్ట్రగుల్ అవుతున్న ఫ్రెండ్స్‌కి ఏదో రకంగా సాయం చేయాలనుకుంటాను. దర్శకుడు సాయికిరణ్ 'వినాయకుడు' స్క్రిప్ట్ తయారు చేసేటప్పుడు నా నుంచి చాలా ఇన్‌పుట్ తీసుకున్నారు. నా రియల్ లైఫ్‌ని అబ్జర్వ్ చేశారు. నాకు జరిగిన సంఘటనలను తెలుసుకుని క్యారెక్టరైజేషన్‌లో దాన్ని కొంత ఉపయోగించారు. రియల్ లైఫ్‌లో నేను చాలా కూల్. రిచ్ ఫ్యామిలీ నుంచి వచ్చినా... ఏ రోజూ ఆడంబరంగా ప్రవర్తించలేదు. కోటి రూపాయలు కావాలా? ఆనందం కావాలా? అంటే... హ్యాపీగా ఉండాలని కోరుకునే తత్వం నాది.


కృష్ణుడు చెప్తోన్న కబుర్లు

- చందు

(గతవారం తరువాయి)

ఈ సినిమాతో మీ పేరు 'వినాయకుడు'గా స్థిరపడిపోయిందనుకుంటా!

ఈ సినిమా తర్వాత రోడ్డు మీద వెళ్తుంటే 'వినాయకుడు' అని పిలుస్తున్నారు.

ముమ్ముందు రెగ్యులర్ హీరోల మాదిరి అవకాశాలొస్తాయనుకుంటున్నారా?

'వినాయకుడు' అనే స్క్రిప్ట్ నన్ను హీరోగా డిమాండ్ చేయడంతో కథానాయకుడినయ్యాను. హీరో అవుదామనుకున్న కల నిజమైంది. మెచ్యూరిటీ లేని 10 ఏళ్ళ క్రితం హీరో అయివుంటే... హీరో అంటూ గర్వంగా ఫీలయ్యేవాణ్ణి. కానీ ప్రస్తుతం ఎంతోకొంత మెచ్యూరిటీ వచ్చిందనుకుంటున్నాను. ఈక్రమంలో భవిష్యత్తులో మంచి క్యారెక్టర్ ఆర్టిస్టుగా పేరు తెచ్చుకోవాలనుకుంటున్నాను. పరేష్ రావెల్, తనికెళ్ళ భరణి మాదిరి మంచి పాత్రలు పోషించాలనుంది. 'వినాయకుడు' తర్వాత హీరోగా మూడు ఆఫర్లు వచ్చాయి. కానీ స్క్రిప్ట్ నచ్చకపోవడంతో వదులుకున్నాను. సున్నితమైన మంచి స్క్రిప్ట్ వస్తే హీరోగా నటిస్తాను.

సహాయ దర్శకునిగా పని చేశారు. డైరెక్షన్ చేసే ఉద్దేశం ఉందా?

తప్పకుండా. నా అల్టిమేట్ గోల్ డైరెక్షన్.

మరి కథలేమైనా సిద్ధం చేసుకున్నారా?

దర్శకత్వ విభాగంలో ఉన్నప్పుడు కొన్ని కథలు రాసుకున్నా గానీ, ఐదు సంవత్సరాల తర్వాత డైరెక్షన్ చేస్తే... ఆ కథలు సూట్ కావు. ట్రెండ్, జనరేషన్‌కు అనుకూలంగా డైరెక్టర్ అప్‌డేట్ అవుతూ ఉండాలి.

'వినాయకుడు'లో కార్తీక్ మనస్తత్వం, మీది ఒకటేనా?

కార్తీక్‌లా నేనూ చాలా సెన్సిటివ్. నా స్నేహితులు చాలామంది దర్శకులు, నటులయ్యారు. సక్సెస్ అయినా ... నేను ఏ రోజూ వాళ్ళ దగ్గరకు వెళ్ళ లేదు. స్ట్రగుల్ అవుతున్న ఫ్రెండ్స్‌కి ఏదో రకంగా సాయం చేయాలనుకుంటాను. సాయికిరణ్ 'వినాయకుడు' స్క్రిప్ట్ తయారు చేసేటప్పుడు నా నుంచి చాలా ఇన్‌పుట్ తీసుకున్నారు. నా రియల్ లైఫ్‌ని అబ్జర్వ్ చేశారు. నాకు జరిగిన సంఘటనలను తెలుసుకుని క్యారెక్టరైజేషన్‌లో దాన్ని కొంత ఉపయోగించారు. రియల్ లైఫ్‌లో నేను చాలా కూల్. రిచ్ ఫ్యామిలీ నుంచి వచ్చినా... ఏ రోజూ ఆడంబరంగా ప్రవర్తించలేదు. కోటి రూపాయలు కావాలా? ఆనందం కావాలా? అంటే... హ్యాపీగా ఉండాలని కోరుకునే తత్వం నాది. సినిమాలో కార్తీక్ కూడా అంతే కూల్‌గా ఉంటాడు.

సినిమాలో సోనియాపై మనసు పడ్డారు. నిజ జీవితంలో ఎవరినైనా ప్రేమించారా?

లేదు. ఎవర్నీ ప్రేమించలేదు.

పోనీ... పెళ్ళి చేసుకునే అమ్మాయి ఎలా ఉండాల్లనుకుంటున్నారు?

సింపుల్‌గా ఉండాలి.

సినిమాలో 'బండోడా' అంటే విపరీతమైన కోపం వచ్చింది. ఇలాంటి సంఘటన రియల్ లైఫ్‌లో ఎప్పుడైనా ఎదురైందా?

ఫ్రెండ్స్ అందరూ నన్ను బాగా ఇష్టపడతారు. ఇంతవరకూ ఎవ్వరూ అలా తిట్టలేదు. ఫ్రెండ్స్ కాకుండా బైటవాళ్ళు ఎవరైనా వెనకాల తిట్టుకుంటారేమో! తెలీదు.

యాక్సిడెంట్ కారణంగా సంవత్సరంపైగా బెడ్‌రెస్ట్ తీసుకోవడంతో లావయ్యానన్నారు. ఎప్పుడైనా తగ్గడానికి ప్రయత్నించారా?

ఇంతవరకూ ప్రయత్నించలేదు. ఆపరేషన్ కావడంతో ఐదారు సంవత్సరాల వరకు ఎక్సర్‌సైజ్‌లు చేయొద్దని డాక్టర్లు చెప్పారు. ఇదే లావుతో కొనసాగితే కొంతకాలానికి ప్రేక్షకులు అంగీకరించక పోవచ్చు. పరేష్ రావెల్, తనికెళ్ళ భరణి మాదిరి విభిన్న పాత్రలు పోషించాలని ఉందని ముందే చెప్పాను కదా. డెఫినెట్‌గా.... ఆరు నెలల్లో బరువు తగ్గి న్యూ లుక్(కొత్త రూపం)తో ముందుకొస్తాను. ప్రఖ్యాత గాయకుడు అద్నాన్ సమి 130 కేజీలు తగ్గాడు. ప్రస్తుతం నేను 120 కేజీలున్నాను. సమీలా 130 కేజీలు తగ్గితే మైనస్ టెన్‌లోకి వెళ్ళిపోతాను (నవ్వుతూ...). సమీ 130 కేజీలు తగ్గి నాకు ప్రేరణగా నిలిచినపుడు, నేనందులో పావు శాతం అంటే సుమారు 30 కేజీలన్నా తగ్గుతాను.

ఇండస్ట్రీకి వచ్చి 10 సంవత్సరాలైంది. ఈ ఇండస్ట్రీ మీకు ఏం నేర్పింది? మీరేం నేర్చుకున్నారు?

నాతో జర్నీ చేసినవాళ్ళు పెద్ద పెద్ద డైరెక్టర్లు, యాక్టర్లు అయ్యారు. మంచి స్థాయికి వెళ్ళినందుకు ఆనందంగా ఉంది. నటనే కాకుండా ఎదుటివారిని గౌరవించే సంస్కారం, ఎదుటివారితో ఎంతవరకు ఉండాలనే ఇంగిత జ్ఞానం ఉంటే ఇక్కడ మంచి భవిష్యత్తు ఉంటుందని నేననుకుంటున్నాను.

'వినాయకుడు' టైటిల్ మార్చాలంటూ కోర్టులో కేసు నడుస్తోంది? దీనిపై మీ కామెంట్?

'వినాయకుడు' అంటే 'సిద్ధి', 'బుద్ధి'. 'సిద్ధి' అంటే మంచోడు. 'బుద్ధి' అంటే చాలా తెలివైనవాడు. సినిమాలో కార్తీక్ క్యారెక్టరైజేషన్ వినాయకుడుని పోలి ఉంటుంది. అందుకే ఆ పేరు పెట్టారు. దేవుణ్ణి కించపరచాలన్న ఉద్దేశం మాకెవ్వరికీ లేదు. అందరం దేవుణ్ణి నమ్మేవాళ్ళం. దేవుణ్ణే కాదు ఒక వ్యక్తిని కూడా కించపరిచే మనస్తత్వం మాకు లేదండి.

ఇష్టమైన ఆహారం...

పీతలు, రొయ్యలు.

(అయిపోయింది)

కథ



మీరేనా నీరజగారు. రండి మీరు ఈరోజు చేస్తుంది ఎంతో మంచిపని. అలా కూర్చోండి' అని చెప్పింది. అక్కడే సిద్ధంగా ఉన్న నర్సు సిరంజితో నీరజ చేతినరం నుంచి కొద్దిగా రక్తం తీసి ప్రాథమిక టెస్టుకు తీసుకు పోయింది. ఆపక్కనే గైనిక్ వార్డుంది. లేడీ డాక్టర్‌ను కలుసుకోవడానికి కొద్దిమంది ఆడాళ్లు అక్కడే ఉన్నారు. అప్పుడే వచ్చిన గురివినాయుడు భార్య, కోడలు నీరజను ఆమె తల్లిని చూసి ఆగారు. "అబ్బో ఖరీధైన ఆసుపత్రికి వచ్చారంటే అక్కడ గ్రామం వదిలివచ్చి ఇక్కడ మీరు చేస్తున్నది ఏమిటో అర్థమవుతోంది.

ఆమె దారి

వై. కుసుమకుమారి

"ఒక పేషెంటుకు అర్జంటుగా బి-నెగటివ్ రక్తం కావలెను. రక్తం లభించనందున అత్యవసరంగా జరగాల్సిన ఆపరేషన్ జరగకుండా పేషెంట్ ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. దాతలు సంప్రదించాల్సిన సెల్‌నెంబర్" అని లోకల్ టి.వి ఛానల్‌లో స్క్రోలింగ్ వస్తునే ఉంది. డిపార్టు మెంటుస్టోర్‌లో పనిచేస్తున్న నీరజ నాలుగైదుసార్లు చూసి 'అయ్యోపాపం' అనుకుంది.

మధ్యాహ్నం భోజనవిరామసమయంలో కూడా ఆప్రకటన చూసింది. అప్పుడు ఎందుకో ఆసెల్‌నెంబర్ నోట్ చేసుకుంది. ఆవెంటనే కార్పొరేట్ ఆసుపత్రికి ఫోన్ చేసి వివరాలు అడిగింది.

"ట్రాక్టర్ యాక్సిడెంటు అయ్యింది. పేషెంట్‌కు అరవైఏళ్లుంటాయి. నెత్తురు బాగా పోయింది. కాలిమడమకు లింకు ఊడిపోయి వేలాడుతోంది. అర్జంటుగా 24గంటలలో ఆపరేషన్ జరిగితీరాలి. లేకుంటే ఆలింకులో మాంసపుకండలు పెరిగిపోయి తర్వాత ఆపరేషన్‌కు వీలుండదు. అయితే పేషెంట్‌కు బి-నెగటివ్ రక్తం సరిపడినంతలేదు. రక్తం కావల్సిందే. లేకుంటే ఆపరేషన్ జరగదు. అతడికి నడిచే యోగం ఉండదు. రిసెప్షన్‌లో ఉన్న నేను ఓపిగ్గా మీకు ఇంతసేపు ఎందుకు చెప్పానంటే బహుశా మీది ఆ గ్రూపు రక్తమై ఉంటుంది. యామై కరక్ట్?' అనడిగింది.

ఆమాటలకు నీరజ గతుక్కుమంది. "అవును నారక్తం గ్రూపు అదే. నేను ఇవ్వాలనుకుంటున్నాను. మధ్యాహ్నం వస్తాను."

"మీరెవరో మీస్థాయి ఏమిటో తెలియదు. అయినా పెద్దోళ్లు ఎవరూ ఇలా పక్కవాడి ప్రాణం పోతుందన్నా ఇవ్వరు గాక ఇవ్వరు. రక్తం ఇచ్చి ఎంతో కొంత తీసుకుందామనుకున్నవారే ఇలా ఫోన్‌చేస్తారు. మీరు ఏమైనా ఆశిస్తే దండిగా ముడుతుంది. పార్టీ గొప్పవారే ఎంతైనా ఇవ్వడానికి సిద్ధపడ్డారు కానీ ఇచ్చేదాత దొరకలేదు. మీరు నేరుగా రిసెప్షన్‌కి వచ్చి నన్ను కలవండి. నా పేరు రాధారాణి. నాకూ ఎంతో కొంత ముడుతుంది" చెప్పింది రిసెప్షనిస్టు.

అంతలోనే నీరజ తల్లి కారియర్ పట్టుకుని వస్తే స్టోర్సు వెనుక రూమ్‌లో కూర్చుని తిన్నాక "అమ్మా ఈరోజు ఒక పేషెంట్‌కు రక్తం కావాల్సి వచ్చింది. లోకల్ ఛానల్‌లో అదే పనిగా చూపిస్తున్నారు. అతడి గ్రూప్ నాగ్రూప్ రక్తమే. నేను ఇవ్వాలనుకుంటున్నాను. ఒకప్రాణం నిలుస్తుంది" చెప్పి తల్లి కళ్లలోకి చూసింది.

"వద్దమ్మా నీవు తినే పచ్చడిమెతుకులకు నీఒంట్లో రక్తం ఏముంటుంది కనుక అందులో ఆడపిల్లలు రక్తం ఇవ్వడం కుదరదు." చెప్పి కూతురు తల నిమిరింది తల్లి.

"అమ్మా ఏజన్మలో ఏపాపం చేశామో ఈజన్మలో మనకు ఒక్క మంచి జరగలేదు. ఉన్న ఊళ్లో పొలం, ఇల్లు అన్నీ నాన్న అవసరాలకు తాకట్టుపెట్టుకుంటే వాటిని అక్కడ భూస్వామి గురివినాయుడు స్వాధీనం చేసుకుని ఊరునుంచి గెంటించేశాడు. నాన్న అవమానం తట్టుకోలేక ఊరువదిలి పారిపోయి మనల్ని అనాథలను చేశాడు. ఇక నాకుపెళ్లి చేశారన్న మాటేగాని అత్తారింటికి వెళ్లిన మరుక్షణం 'అక్కడ బాకీపడిన కట్నండబ్బు మీరేం ఇవ్వగలరు సర్వం కోల్పోయి నీతండ్రి దేశాలు పట్టిపారిపోయాడు' అని మా అత్త నన్ను గెంటేసింది. నావంటి అభాగ్యురాలితో చదువుకుంటున్న తమ్ముడితో ఏమీ తెలియని పట్టణంలోకి వచ్చాం. ఇక్కడ నీఅన్న చేరదీసి నీకు నాకు ఏదో బ్రతికే దారి చూపాడు. లేకుంటే ఏమయిపోయేవాళ్లం.నాకెందుకో అవకాశం ఉన్నంతలో ఈ పనిచేస్తే బావుంటుందనిపిస్తోంది" నీరజ కళ్లు తుడుచుకుని గతాన్ని ఒక్కసారి గుర్తుచేసింది.

"రక్తం ఇవ్వకుంటే ఆమనిషి బతకడా?"

"ఇది రేర్ గ్రూప్ రక్తమమ్మా. నేను ఇంటర్ చదువుకున్నప్పుడే నాకు రక్తం దానిగ్రూపులు గురించి తెలుసు. నాకుతెలిసీ ఆపేషెంట్‌కు దొరకదు. రక్తం ఇచ్చినందుకు నాకు ఎంతోకొంత ఇస్తారు. ఇంతవరకు ఉచితంగా ఇద్దామనుకున్నాను. నీతో మాట్లాడాక ఇప్పుడు డబ్బు తీసుకోవాలనుకుంటున్నాను. ఎందుకంటే బలమైన ఆహారం తీసుకోవాలి"

"మనకెందుకు? మగాళ్లు చేయాల్సినపని" మరోసారి వద్దనే చెప్పింది తల్లి. నీరజ సన్నగా నవ్వింది. సరిగ్గా అప్పుడే ఫోన్‌లో ఎవరో పిలుస్తున్నట్టు చెప్పడంతో వెళ్లి రిసీవర్ అందుకుంది.

"మేడమ్ ఎప్పుడు వస్తున్నారు? రక్తం ఎంతత్వరగా ఇస్తే పేషెంట్‌కు అంత వేగిరం ఆపరేషన్ చేస్తారంట." రాధారాణి ఆత్రంగా చెప్పింది.

"నేను బయల్దేరుతున్నాను. ఆటోలో వస్తాను. నాతో మా అమ్మను కూడా

తీసుకువస్తాను" అని చెప్పి ఫోన్‌పెట్టేసి స్టోర్సు యజమానికి మధ్యాహ్నం లీవ్ అడిగి ఆటోలో తల్లితో సహా బయల్దేరింది.

రిసెప్షన్‌లో రాధారాణి నీరజను చూసి పోల్చుకుని మీరేనా నీరజగారు. రండి మీరు ఈరోజు చేస్తోంది ఎంతో మంచిపని. అలా కూర్చోండి' అని చెప్పింది. అక్కడే సిద్ధంగా ఉన్న నర్సు సిరంజితో నీరజ చేతినరం నుంచి కొద్దిగా రక్తం తీసి ప్రాథమిక టెస్టుకు తీసుకు పోయింది. ఆపక్కనే గైనిక్ వార్డుంది. లేడీ డాక్టర్‌ను కలుసుకోవడానికి కొద్దిమంది ఆడాళ్లు అక్కడే ఉన్నారు. అప్పుడే వచ్చిన గురివినాయుడు భార్య, కోడలు నీరజను ఆమె తల్లిని చూసి ఆగారు. "అబ్బో ఖరీదైన ఆసుపత్రికి వచ్చారంటే అక్కడ గ్రామం వదిలివచ్చి ఇక్కడ మీరు చేస్తున్నది ఏమిటో అర్థం అవుతోంది. కూతురుమీద వ్యాపారం చేస్తున్నావా? మొగుడు వదిలేసిన కూతురుతో పట్టణంలో భలే బ్రతుకు దారి వెతుక్కున్నావు" చీదరించుకుని మరీ గేలిచేశారు.

నీరజ తల్లి నోటమాట రాకుండా అయిపోయింది. అక్కడ ఉన్న ఆడాళ్లు ఎగాదిగా చూసి ఒకరకంగా ఏవగింపును ముఖంలో పులుముకుని చూడసాగారు.

"అవేం మాటలమ్మా అన్నీ కోల్పోయి బతుకుదారికోసం ఇక్కడికి వచ్చాం. కాయకష్టం చేసుకుని మాబతుకు మేము బతుకుతున్నాం. మీగురించి ఎక్కడా మేము తప్పుడు మాటలు అనలేదు. కన్పించగానే ఎందుకు అలా నోరుపారేసుకుంటావు." కళ్ల నీళ్లు తిప్పుకుంది.

"డబ్బు కోసం నాపెనిమిటి చుట్టూ నీమొగుడు తిరిగాడు. ఇస్తే అవసరాలు తీర్చుకుని వడ్డీలు, అసలు కట్టలేక పారిపోయాడు. మాకు రావాల్సినదానికి నీకున్న పొలం, ఇల్లు రాసిచ్చి ఊరు వదిలిపోయి మామీద కోర్టులో కేసు వేయాలని లాయర్ నోటీసు పంపు తావా? కోర్టులో కేసుకు నెంబర్‌పడలేదు కాబట్టి సరిపోయింది. లేకుంటే నీకు అప్పు ఇచ్చిన పాపానికి కోర్టులు చుట్టూ తిరగాల్సిందే. ఇప్పుడు అర్థమైంది ఇక్కడ పట్టణంలో ఎవడో నీకూతురుతో కులికి నీతో కోర్టులో కేసు వేయమని ఉంటాడు. ఇప్పుడు నంగనాచి కబుర్లు చెబుతున్నావు." గురివినాయుడు భార్య కోపంగా నిలదీసింది.

నీరజ అదోలా అయిపోయింది. "పదమ్మా వెళ్లిపోదాం. నాకు తలతిరిగిపోతోంది." తల్లి చెయ్యి పట్టుకుని ఆరూమ్‌లోంచి బయటికి తీసుకువెళ్లిపోతుండగా పాపాన్ని తీయించుకోవడానికి రేపటికి వాయిదా వేసుకుంటే నిలబడిపోగలదు. అప్పుడు ఏకంగా పాపాన్ని కనాలి." పెద్దగొంతుతో అరిచింది గురివినాయుడు భార్య.

ఆమాటలు ములుకుల్లా గుచ్చుకోవడంతో నీరజ కళ్లు వర్షించాయి. సరిగ్గా అప్పుడే రాధారాణి వచ్చి "ఏమిటి వెళ్లిపోతున్నారు? ఎందుకు ఏడుస్తున్నారు? ఏమయ్యింది?" ఇద్దరిని తిరిగి ఆరూమ్‌లోకి తీసుకువచ్చి కూర్చోబెట్టింది.

"మమ్మల్ని అడుగు మేము చెబుతాం. ఆ ఇద్దరిని తాకితే కాశీగంగలో స్నానంచేయాలి. పోతున్నవాళ్లను తిరిగి ఎందుకుతెచ్చావు?" రుసరుసలాడింది గురివినాయుడు భార్య. ఆపైన ఇంతవరకు ఏమేమి అన్నారో అన్నీ ఏకరువుపెట్టారు. అప్పుడు రాధారాణికి అర్థమైంది.

"ఏమ్మా ఇది మీఊరిలో జరిగే తగువు. ఇప్పుడు ఈనీరజగారు ఎందుకొచ్చారో తెలుసా? యాక్సిడెంటులో చావుబతుకులమధ్య ఉన్న నీభర్త గురివినాయుడుకు రక్తం ఇవ్వడానికి, మీరన్నట్టు పాపాలు కడిగేసుకోడానికి కాదు. పుణ్యాన్ని మూటకట్టుకోవడానికి వచ్చింది మీకోసం. మీరు కసెక్కిపోయి నోటికి వచ్చినట్లు కూస్తున్నారు. ఏమిటి ఇదంతా? ఇది హాస్పిటల్ అనుకున్నారా లేక మీఊరి రచ్చబండ అనుకున్నారా?" కోపంతో రాధారాణి ముక్కుపుటాలు అదిరాయి.

అక్కడ గురివినాయుడు భార్య, కోడలు నీరజ, ఆమెతల్లి అవాక్క య్యారు. ఎవరికి నోట మాటరాలేదు. సరిగ్గా అప్పుడే డాక్టరు వచ్చాడు. రక్తదాత ఎవరు? మీ రక్తపరీక్ష చేశాం. అన్నీ ఓకే. మీరేనా అదేమిటి ఏడుస్తున్నారు. కొంపదీసి బలవంతంగా రక్తం మీతో ఎవరైనా ఇప్పిస్తున్నారా? మీకు ఇష్టంలేకుంటే వద్దు. ప్రశాంతంగా ఇవ్వాల్సిఉంది. రక్తదాత ఏడుస్తుంటే ఎలా? బి-నెగటివ్ దొరికి చావడంలేదు." డాక్టర్ అసహనంగా అనేసి వెళ్లి పోయాడు. అప్పటికే గురివినాయుడు కొడుకులు అక్కడికి చేరుకున్నారు. వారు నీరజను ఆమెతల్లిని చూసి గుర్రెత్తిపోయారు.

"మీకారణంగానే మానాన్న యాక్సిడెంటు అయిపోయాడు."అని ఏమేమో అనబోతుండగా తల్లి ఆపేసి "రేయ్ రక్తం దొరికిందా?" ఆత్రంగా అడిగింది.

"లేదమ్మా మరి దొరకదు. ఎంతిస్తామన్నా దొరకడంలేదు. నాన్న పరిస్థితి ఏమిటో అర్థంకావడంలేదు. ఈఇద్దరివలనే నాన్న మానసికంగా గాయపడి యాక్సిడెంటు చేసుకొన్నాడు."

తల్లి వాడిచెవిలో చెప్పింది. "నీరజే రక్తం ఇవ్వడానికి వచ్చింది. నోరు కాస్త అదుపుచేసుకోరా!" విని అతడు అవాక్కయ్యాడు.

నీరజను ఆమె తల్లి రెక్కపట్టుకుని బయటికి నడిచింది. రాధారాణి వారిని ఆపి "అదేంటి వెళ్లిపోతున్నారు, కాస్త ఆగండి. అన్నీ సిద్ధంచేసుకున్నాం. వాళ్లేదో అన్నారని మీరు వెళ్లిపోతే వారికి మీకు తేడా ఏమిటి? పెద్దమనస్సుతో వచ్చారు. మీకు పదివేలు ఇవ్వడానికి రంగం సిద్ధం అయ్యింది. ఇక్కడ జరిగినదేమిటి అంటే రక్తదాత మీరు అని వారికి తెలియదు. రక్తం పుచ్చుకునే పేషెంటు గురివినాయుడు అని మీకు తెలియదు."

"అంతేసి మాటలన్న వారికి రక్తం నాకూతురు ఇవ్వదుగాక ఇవ్వదు. మమ్మల్ని తాకితే కాశీగంగలో స్నానంచేయాలని ఇప్పుడే కదా చెప్పింది. ఇంక ఏముఖంపెట్టుకుని ఇస్తుంది. ఒకవేళ ఇచ్చినా నేను ఒప్పుకోను" నీరజ తల్లి కోపంతో ఊగిపోయింది.

"అమ్మా ఆగు. ఇంత జరిగిన తరువాత వేరెవ్వరికైతే ఇవ్వక పోదును. ఇప్పుడు ఖచ్చితంగా ఇస్తాను. ఎంతకాదనుకున్నా గురవినాయుడు మనగ్రామపెద్ద. చాలాకాలం ఆయననీడలో బతికాం. ఆయన వద్ద ఎన్నోసార్లు అప్పుతెచ్చి మన అవసరాలు తీర్చుకున్నాం. ఇప్పుడు ఆయన బెడ్‌మీద ఉన్నాడు. ఒక్కరూపాయి తీసుకోకుండా రక్తం ఇస్తానమ్మా నన్ను నిలువరించకు. నామేనమావ కేసువేద్దామనంటే నేను వద్దన్నా అతడు వినలేదు. మనం ఎలాగైనా కోర్టుకెక్కుతామని భయంతో ట్రాక్టర్ నడుపుతూ గురివినాయుడు యాక్సిడెంటుకు గురయ్యాడు. అందుకే వారు ఏదో కడుపుమంటతో అలా అన్నారు" చెప్పి నర్సు వెనుకనే లాబ్‌లోకి వెళ్లిపోయింది.

గురివినాయుడు భార్యపిల్లలు అయోమయంగా చూస్తు చేష్టలుడిగిపోయారు. బిక్కముఖాలతో నిలబడిపోయారు. ఒకమూల నీరజతల్లి కళ్లల్లో నీళ్లు కక్కుతూ నిలుచుంది. నీరజ నీరసంగా వచ్చింది. రాధారాణి ఆమెకు నోట్లకట్ట అందిస్తే వద్దని చెప్పి తల్లిని తీసుకుని వెళ్లిపోయింది.

మూడునెలల తర్వాత నీరజ ఇంటిని వెతుక్కుంటూ గురివినాయుడు కుంటినడకతో భార్య తోడుతో కలిసి వచ్చాడు.

ఇద్దరిని లోపలికి తీసుకుని వెళ్లింది నీరజ.

వారిద్దరిని చూడగానే నీరజతల్లికి కళ్లనీళ్లు ఆగలేదు.

"అమ్మా నీరజా ఆపరేషన్ అప్పుడు ఎవరో తెలియని పేషెంటుకు రక్తం ఇవ్వడానికి వచ్చావు. తీరా నావాళ్లతో అనరాని మాటలు పడ్డావు. పేషెంట్ నేనే అని తెలిసి నీతల్లి కాదంటున్నా నీవు పుట్టి పెరిగిన గడ్డను, గ్రామపెద్ద గురించి గౌరవంగా మాట్లాడి రక్తం ఇచ్చి నన్ను ఈరోజు నీఇంటికి నడిచి వచ్చేట్టు చేశావు. నీమాటలు నీఆలోచన తోటివారిని ఆదుకోవాలన్న నీతపనకు మీపట్ల నేను నాకుటుంబం చేసినదానికి సిగ్గుపడుతున్నాను. నీవంటి ఉత్తమురాలి రక్తం నాఒంట్లో కలిసినందుకు గర్వపడుతున్నాను. ఇక్కడికి ఎప్పుడు వచ్చి కలుస్తానా అని రోజులు లెక్కించాను. నానీడలో బతికానని ఆరోజు నీవు చెప్పినందున నాపెద్దరికం నేను నిలుపుకోవాలి. నీపొలం, ఇల్లు తిరిగి ఇచ్చేస్తున్నాను. నీఅత్తారింటికి మీనాన్న బాకీపడ్డ డబ్బు చెల్లించి నిన్ను అత్తారింటికి పంపుతాను. అందుకే వచ్చాను. నీవు ఎంచుకున్న దారిలో అంతా నడవాలి. నిన్ను చూసి నేర్చుకోవాలి" అని ఉద్వేగంగా చెప్పాడు.

నీరజ తల్లి కళ్లను గురివినాయుడు భార్యే తుడిచింది.

"ఇక నీవు ఏడవద్దు మేమున్నాం" అని ఆదంపతులు ధైర్యం చెప్పారు.

కొత్త పుస్తకాలు

తెలుగులో సభాపర్వం



భారతాన్ని పంచమ వేదం అంటారు పురాణ కోవిదులు. ఒక విధంగా ఇతిహాసాలు వేదాలకు కొనసాగింపులేనన్నది వారి వాదం. శూద్రులు వేదాలు చదవకూడదు గాని అనుసరించాలి. వేదాలు అపౌరుషేయాలు గనక వాటిని రాయడం నేరం. వల్లె వేస్తూ నేర్చుకోవలసిందే. అందుకే వాటిని శ్రుతులు అన్నారు. ఈ ధర్మసంకటాన్ని అధిగమించడానికి తరుణోపాయంగా ఇతిహాసాలైన భారత రామాయణాలను సృష్టించారు. వీటిని పురాణాలుగా శూద్రులు విని ఆచరించాలన్నమాట. నాలుగు వేదాలు పోగా భారతం పంచమ వేదమైంది. సంస్కృతంలో వ్యాసుడు రాసిన భారతాన్ని కవిత్రయము అద్భుతంగా ఆంధ్రీకరించింది. అయినా పద్య రూపంలో వుంటుంది గనక సామాన్యులు వాటిని అర్థం చేసుకోవడం కష్టం. బహుభాషా కోవిదుడైన పురిపండా అప్పలస్వామి వ్యవహారికాంధ్ర మహాభారతం రాసి ఆ కొరత తీర్చారు.అదే కోవలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వ్యాస భారతాన్ని తేటతెలుగులో రాయాలని తలపెట్టారు. అయితే ఆయన ఆ పని అసంపూర్ణ దశలో వుండగానే 1961లో కన్నుమూశారు. దాంతో ప్రచురణకర్త అద్దేపల్లి నాగేశ్వరరావు ఆ పని పురిపండా వారిని పూర్తి చేయవలసిందిగా కోరారు.ఏడేళ్ల తర్వాత 1968లో ఆ పుస్తకం వెలుగు చూసింది.40 ఏళ్ల తర్వాత ఇప్పుడు ప్రగతి పబ్లిషర్స్ వారు బాపు ముఖచిత్రంతో దాన్ని పునర్ముద్రించారు. భారతంతో సభాపర్వానికి ఒక ప్రత్యేకత ఏమంటే అది పూర్తిగా సభా మయం. దుర్యోధనుడి వేయి స్తంభాల సభతో మొదలై ధర్మరాజు మయసభతో ముగుస్తుంది. వేద కాలంలో సభలు వెదుర్లతో కట్టేవారని, రాళ్ళు(మణులు)తో కట్టిన మొదటి సభ ధర్మరాజుదే అయివుంటుందని కొందరు వూహిస్తున్నట్టు పురిపండా 'ముందుమాట'లో రాశారు. చరిత్రకు అందిన తొలి రాళ్లసభ మాత్రం చంద్రగుప్త మౌర్యుడిది. ధర్మరాజు మయసభ చూసి ఈర్ష్య పడిన దుర్యోధనుడు కట్టించుకున్న ద్యూతసభలోనే మాయాజూదం జరిగింది. సభా పర్వంలో నారదుడు రాజనీతి ప్రసంగం చేస్తాడు. కౌరవ పాండవ వైభవాలు, వైషమ్యాలు, శకుని మాయోపాయాలూ, శిశుపాల వధ, జూదం, ద్రౌపదీ వస్త్రాపహరణం,పాండవ వనవాసం తదితర ఘట్టాలు ఈ సభా పర్వంలో చూడొచ్చు. 74 ఉప శీర్షికలతో నడిచే 148 పేజీల ఈ పుస్తకం మూల భారతం చదవలేని వారికి వెలలేని కానుక వంటిదే.

వ్యాస ప్రోక్త మహా భారతం, సభాపర్వం
శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి & పురిపండా అప్పల స్వామి
వెల: 60/-, పేజీలు : 148, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, బ్యాంక్ స్ట్రీట్, విజ్ఞాన భవన్, హైదరాబాద్ - 500001.

- పీపీ

సమీక్షల "గ్రంథా"వలోకనమ్

స్వరలాసిక, కోడిహళ్లి మురళీమోహన్ పేర్లతో ఆంధ్రభూమి దిన పత్రిక, నేటి నిజం దినపత్రిక, ఈ వారం, జాగృతి లాంటి పత్రికలలో వివిధ గ్రంథాలపై చేసిన సమీక్షల్ని "గ్రంథావలోకనమ్" పేరుతో వెలువరించారు రచయిత. ఈ పుస్తకంలో డా॥ అద్దేపల్లి రామమోహన్‌రావు, డా॥ చేకూరి రామారావు ముందు మాటలు రాశారు. ఐ.ఎస్.బి.ఎన్. నెంబరుతో వెలువరించిన ఈ పుస్తకంలో చివర గతంలో రచయిత సంకలనం చేసిన కథాజగత్, గడ్డిపూలు పుస్తకాలపై పత్రికలు, ప్రముఖుల అభిప్రాయాలు ప్రచురించారు. స్వీయ సాహితీ కృషిని తెల్పుకోవడంలో ఆక్షేపణ లేదు కానీ, అవసరమా? అనే అంశం ఆలోచించాలి.

ప్రముఖ రచయితలు, కవుల నుండి కొత్త వారి పుస్తకాల దాకా వివిధ పత్రికల్లో మురళీ మోహన్ చేసిన సమీక్షల సంకలనమే ఈ గ్రంథావలోకనమ్. గుంటూరు శేషేంద్ర శర్మ, దేవరాజు మహారాజు, నాగసూరి వేణుగోపాల్, కల్లూరి భాస్కరం, గోపులింగారెడ్డి, షేక్ కరీముల్లా, పెన్నా శివరామ కృష్ణ, జూలూరు గౌరీ శంకర్, ఎస్ఆర్.పృథ్వీ, ఎస్. రవీంద్ర, ప్రయాగ, మునిసుందరం లాంటి వారి గ్రంథాలపై నిశితంగా సమీక్ష చేసిన తీరు మనం గమనించగలం. ఈ పుస్తకంలో మంచి సమీక్షలనేవి వేళ్లమీద లెక్కించవచ్చు. మిగతావన్నీ "తూతూ.. మంత్రం" బాపతు సమీక్షలే అంటారు ముందుమాట చివరలో చేకూరి రామారావు (పేజీ14). ఒంగోలు రైతు జీవన చిత్రం "మిత్తవ" రచన: మంచికంటి(పేజీ35), మానవత్వంపై మమకారం ఉన్న ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం ఇది అంటూ షేక్ కరీముల్లా "కవాతు"ను (పేజీ87) పరిచయం చేస్తారు మురళీ మోహన్. లకుమ "హైకూలు" (పేజీ89) చక్కటి వ్యాసపరమైన ప్రయోజనకరమైన సమీక్ష.

సామాన్యుడి జీవిత చి(ఉ)త్తర్వులపై "రాజముద్ర" అంటూ దేవరాజు మహారాజు గారి గ్రంథంపై (పేజీ99) సమీక్షిస్తారు. శైలి శిల్పాల పరంగా "అన్వేషణ" మొదటి పుస్తకం కన్నా సంగెవేని రవీంద్ర "కవిగా "ఈ వలస పత్రంలో" పురోగమించాడు(పేజి102). విమర్శనాత్మకంగా... నిశితంగా పరిశీలిస్తూ సత్యవాద (ఓగేటి) ఇందిరాదేవి రాసిన "నిరుదు కురిసిన హిమ సమూహములు" (నవల) (పేజీ69) యువ నవలా కారులకు ఎంతో



ప్రయోజనకర సమీక్ష. "రచనతోనే మనకు సంబంధం తప్ప - రచయిత కాదు" అనేది విమర్శకుడి లక్ష్యం- లక్షణం.

రాచమల్లు రామ చంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూధనరావు, చిలుకూరి నారాయణ రావు, రాళ్లపల్లి అనంత శర్మ, కాశీ కృష్ణమాచార్యులు, వేలూరి నారాయణ రావు, జే.సీ. జగన్మోహనా చార్యులు, జి. లక్ష్మీనర్సయ్య, కోతవరపు రామకోట శాస్త్రి, ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యం, చేరా, అద్దేపల్లి, ఆర్.ఎస్. సుదర్శనం, కెవి. రమణారెడ్డి, కె.కె. రంగనాథాచార్యులు, ఆచార్య తుమ్మపూడి లాంటి అనేక మంది పెద్దలు సమీక్ష, విమర్శ మొదలగు అంశాలపై ఎంతో నిబద్ధతతో, బాధ్యతాయుతంగా విశ్లేషణలు చేశారు. కవిని, రచయితను... చూడకుండా అతని రచనపైనా ... విమర్శను... (బాగోగులను) రాయాలి. సమీక్షకుడు వేరు - విమర్శకుడు వేరు. ఎటువంటి భేషజాలు, పక్షపాత ధోరణులు, రంధ్రాన్వేషణలు, ఈర్ష్య, ద్వేషాలు, లేకుండా సాహిత్య విమర్శలు రావాలి. సమీక్షకుడికి తగినంత ప్రాచీన, నవీన, సాహిత్యా అధ్యయనం ఉండాలి. కేవలం తన అభిప్రాయాలనే పెట్టుబడిగా పెట్టుకున్నవారి సమీక్షల్లో ప్రామాణికత ఉండదు. సమీక్షకుడు ఏ ఒక్క భావజాలానికీ నిబద్ధుడు కాదు. భావాలకు మాత్రమే నిబద్ధుడు. ఈ దశగా "కోడిహళ్లి" కలం సమీక్ష ప్రమదావనానికి కాపు కాయాలి.

రచన: కోడిహళ్లి మురళీ మోహన్, పేజీలు : 136, వెల: 75 రూ॥, ప్రతులకు : రచయిత, # 9111, 9వ బ్లాక్, జనప్రియ మహానగర్, మీర్ పేట, హైదరాబాద్-79.

- తంగిరాల చక్రవర్తి

వంకర టింకర కొమ్మలే వస్తువులైతే...

వంకరటింకర కొమ్మలూ, లావాటి దుంగలు, చెక్కలూ... మీ ముందర పెడితే... ఏం చేస్తారు?! 'పనికిరాని చెత్త ఎదురుగా ఎందుకు అడ్డం కాకపోతే!' అనుకొని ఏ స్టోర్‌రూమ్‌లోనూ పడేస్తారు. అక్కడకూడా వద్దనుకుంటే పెరట్లో వేయిస్తారు. కానీ మీ ఎదురుగా వున్న వస్తువులను చూశారుగా. అవన్నీ ఇందాక మనం చెప్పకున్న ముడిసరుకుతో తయారుచేసినవేనంటే నమ్మశక్యంగా లేదుకదూ. కావాలంటే పరిశీలనగా చూడండి. అచ్చంగా వాటితో చేసినవే ఈ కుర్చీలు, టేబుళ్ల, బల్లలు, ఫ్లవర్‌వాజులు, బుట్టలు. అందుకేనండీ అంటారు! 'మడిసన్నాక కూసింత కళాపోసనుండాల' అని.

అమ్మ మాట

-పుప్పాల కృష్ణమూర్తి

ఓ పిచ్చుకకు రెండు పిల్లలున్నాయి. ఒకదాని పేరు చిక్కి మరోదాని పేరు బుక్కి. చిక్కి చాలా బుద్ధిమంతురాలు. తల్లి చెప్పినట్లు వింటుంది. బుక్కి మాత్రం ఎడ్డెమంటే తెడ్డెమనే రకం. అక్కతో ఎప్పుడూ దెబ్బలాడుతుండేది. పైగా అమ్మమాట అస్సలు వినేది కాదు.

వాటికి రెక్కలు వచ్చాయి. క్రమేపీ గూటి మీదకు ఎగరసాగాయి. తల్లికోసం గూటి వద్ద ఎదురుచూస్తూ, ఒక కొమ్మ మీదనుండి మరో కొమ్మ మీదకు వెళ్లసాగాయి. పిల్లలు పెద్ద కావడం తల్లికి సంతోషమే కదా. పిచ్చుక కూడా రెంటినీ దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుని "మీకు ఆకాశంలోకి ఎగరడం వచ్చింది. ఇంక నేను ఆహారం తేనవసరం లేదు. మీ మేతను మీరే సంపాదించుకోవచ్చు. ముందుగా ఆహారం దొరికే స్థలాలను చూపిస్తాను. ఈరోజు విశ్రాంతి తీసుకోండి" అని గూట్లోకి చేరుకుంది.

మరునాడు ఉదయమే పిల్లల్ని లేపి "రాజుగారి తోటలోకి వెళు న్నాము. ఆ తోట నిండా పచ్చగడ్డి చెప్పలేనంత ఉంది. ఆ గడ్డిలో రకరకాల పురుగులు, గింజలు బోలెడు దొరుకుతాయి. మీకు ఓపికున్నంత వరకు తినొచ్చు. రండి వెళదాం" అంది.

"నేనేం రాను. తోటలోకే ఎందుకు రావాలి. నేను అంతఃపురంలోకి వెళతా" అని రివ్వున రాణిగారి అంతఃపురంలోకి వెళ్లింది బుక్కి. విశాలమైన గదులు, పట్టు చీరలు, తివాచీలు, నగిషీతో చేసిన తలుపులు, బల్లలు, రంగురంగుల దీపాలు ఇలా అనేకం చూసుకుంటూ రాణిగారి విలాస మందిరంలోకి వెళ్లింది. అక్కడ దానికి పెద్ద అద్దం కనిపించింది. అద్దంలో మరో పిట్ట కనిపించింది. ఎవరూ రాని ప్రదేశంలోకి నేనే ముందు వద్దామనుకుని వచ్చాను. కానీ నాకంటే ముందే, ఓపిట్ట వచ్చిందే..? ఇది ఎక్కడ్నించి వచ్చిందబ్బా? దీని పేరేంటో? ఊరేంటో? దీని తల్లిదండ్రులెవరో తెలుసుకోవాలి. అని రివ్వున వెళ్లి అద్దం ముందు వాలింది.

"ఏయ్, ఎవర్నువ్వు? నీ పేరేంటి?" అంది దబాయిస్తూ.

అద్దంలోని పిచ్చుక కూడా అలాగే ప్రశ్నించింది.

"హమ్మా! ఎంత పొగరు నీకు. నన్ను ఊరూ, పేరు అడుగుతావా? నువ్వు చెప్పకుండా" అంది పిచ్చుక.

ఎదురుగా ఉన్న పిచ్చుక కూడా అలాగే అనడంతో కాస్త శాంతించి "నాపేరు బుక్కి నా అక్కపేరు చిక్కి. మేం దగ్గరలోని అడవిలో తుమ్మచెట్టుమీద గూడు కట్టుకుని ఉంటున్నాం" అంది.

అద్దంలోని పిచ్చుక కూడా అలాగే అనడంతో "నేను ఏమాటంటే, నువ్వూ అదే అంటావా? ఎంత అహంకారం నీకు?" అని ముక్కుతో పేట్‌మని పొడిచింది. తిరిగి పిట్టకూడా పొడిచినట్టనిపించింది. "ఆ... నన్నేపొడుస్తావా? నిన్నివ్వాళ వదిలిపెట్టను. చంపి తీరతాను" అని కసి కొద్దీ పొడవ సాగింది. ఇలా తిడుతూ, ఎగిరెగిరి అద్దం మీద తంతూ, సాయంత్రం దాకా హోరాహోరీగా పోట్లాడింది. తన్నీ తన్నీ కాళ్లు నొప్పి లేశాయి. పొడిచీ పొడిచీ ముక్కంతా రక్తమయింది. అలా సాయంత్రం దాకా పోట్లాడుతూనే ఉంది.

రాణిగారి గదిని అలంకరించటానికి దాసీలు రావడంతో భయమేసి, కిటికీలోంచి రివ్వున ఎగురుతూ, ఇంటికి చేరుకుంది.

అప్పటికే అక్క అమ్మ , కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పకుంటున్నారు.

ముక్కుకున్న రక్తం చూసి "ఏమైంది బుక్కి, శత్రువుల చేతిలో చిక్కావా?" అంది ఆందోళనగా, ముక్కు కంటిన రక్తాన్ని తుడుస్తూ.

"లేదమ్మా, నేనంత తెలివి తక్కువ దాన్నా చిక్కడానికి? అంత:పురంలోకి వెళ్లానా? అక్కడ ఒక గదిలో అచ్చం నాలాంటి పిట్టే కనిపించింది. నాకంటే ముందుగానే వెళ్లి , అక్కడ కూర్చుంది. నాకు కోపమొచ్చింది. అయినా తమాయించుకున్నాను. ముందు మర్యాదగా పేరడిగాను. అది తిరిగి నన్నడిగింది. సరే దీనికింత పొగరా అని చెప్పాను.అది కూడా నేను చెప్పినట్టే చెప్పింది. నాతో తమాషా ఆడుతున్నావా? అంటూ ముక్కుతో ఒక్కటిచ్చాను. అదీ ఇచ్చింది. ఎగిరి తన్నాను. అదీ ఎగిరి తన్నింది. నాకింక పౌరుషం పొడుచుకొచ్చింది. దానితో హోరాహోరీగా దెబ్బలాడాను. దాని ముక్కు కూడా రక్తమైంది. ఇంతలో దాసీలు రావడంతో బతికి పోయింది. లేకుంటే ఇవాళ నాచేతిలో చచ్చిపోయేదే" అంది ఆవేశపడుతూ.

బుక్కి చెప్పిన సంగతి విని పడీపడీ నవ్వింది తల్లి.

"ఎందుకమ్మా నవ్వుతావు? నేను పోట్లాడలేదనా? ఇదిగో గాయం కూడా అయింది" అంది.

"అది మరో పిట్ట కాదు బుక్కి నీ ప్రతిబింబం. అచ్చం నీ మాదిరిగానే ఉంటది. ఆ తెల్లని ఎత్తైన దాన్ని అద్దం అంటారు. మనం దాని ముందు నిలబడి, ఏం చేస్తే అది కూడా అదే చేస్తుంది.నీ ప్రతిబింబంతో రోజంతా దెబ్బలాడావన్నమాట" అంది నవ్వాపుకోడానికి ప్రయత్నిస్తూ.

"అద్దమా? ఇంతకుముందెప్పుడూ అలాంటిది చూడ్లేదమ్మా" అంది సిగ్గుపడ్తూ.

"ఇవాళే గదా మీరు గూట్లోంచి బైటికొచ్చింది. రేపు అంతఃపురం తీసుకెళ్లి, మీకా అద్దం చూపిద్దామనుకున్నాను. నువ్వు నామాట వింటేనా? ఇవాళే వెళ్లి, దెబ్బలాడి వచ్చావు" అంది నవ్వుతూ.

"సారీ, అమ్మా నాకు దాని గురించి తెలియదు"అంది.

"అందుకే తల్లి చెప్పిన మాట వినాలి అనేది.ఇంతకూ, అక్కడేమన్నా తిన్నావా? లేదా?"

"అదేనమ్మా, ఏమన్నా దొరుకుతుందేమోనని, వెతుకుతుంటే ఆ పిట్ట కనిపించింది.నాకు కోపమొచ్చింది. ఏం తినలేదమ్మా, ఆకలౌతోంది" అంది తల్లి ఒడిలో వాలిపోతూ.

"నాకు తెలుసు చిన్నా నువ్వు ఆకలిని వదిలేసి ఏమేమో చేస్తావని. అందుకే నీ కోసం రెండు మిడతలు తెచ్చాం" అంది దాచిపెట్టిన ఆహారాన్ని నోటికందిస్తూ.

"మా మంచి అమ్మ, ఇకనుండి నువ్వు చెప్పినట్టే వింటానమ్మా" అంది ప్రేమగా.